టిసిపార్డ్
TSIPARD

స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 7 సంచిక: 10

నవంబర్, 2015

*ఎడిటర్*
**అనిత రామచంద్రన్**, ఐ.ఏ.ఎస్.
కమీషనర్, టిసిపార్డ్

*ఎడిటోరియల్ బోర్డు*
**కె. యాదయ్య**
**డా॥ కె. ఆసయ్య**
**ఎ. నాగేశ్వరరావు**

*కాన్సెప్ట్, ప్లానింగ్, ఎడిటింగ్, డిజైనింగ్*
**సెంటర్ ఫర్ మీడియా పబ్లికేషన్స్, టిసిపార్డ్**
**కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

*ప్రచురణ*
**టిసిపార్డ్**
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
తెలంగాణ, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : editorsthanikapalana@gmail.com
Website: www.tsipard.gov.in

ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి గాని, టిసిపార్డ్‌కి గాని చెందినవిగా భావించనక్కరలేదు.

# విషయ సూచిక

సంపాదకీయం ....... 4
టిసిపార్డు- ఐక్యరాజ్య సమితి రెండవదశ మహిళా ప్రాజెక్టు ప్రారంభం ....... 5
నిరుపేదలకు చేయూతగా తెలంగాణాలో 'ఆసరా' పథకం ....... 6
పేదరికం పారద్రోలే మిషన్ కాకతీయ ....... 8
మాతా, శిశు సంరక్షణకు ఆరోగ్యలక్ష్మి పథకం ....... 10
ఆదర్శంగా నిలిచిన మెంటెపల్లి గ్రామం ....... 12
బాల్యం బందీ కారాదు ....... 17
భావి అవసరాలకు దీటుగా విద్య ....... 19
సుపరిపాలనకు పౌరసేవల పారదర్శకత ....... 22
గ్రామపంచాయతీలో సర్పంచులు మరియు కార్యదర్శులు నెల వారీగా చట్ట ప్రకారంగా తప్పక చేయవలసిన విధులు ....... 24
పేదల సొంత ఇంటికల రెండు పడక గదుల ఇళ్ళు ....... 26
అన్నార్తుల అపన్నహస్తం 5 రూపాయల భోజనం ....... 27
పేదల కలల సాకారం 'కళ్యాణలక్ష్మి' ....... 29
షాదీ ముబారక్ పథకం ....... 31
'షీ' బృందాల విజయగాథ ....... 33
కె.జి. టు పి.జి. ఉచిత విద్య ....... 36
నూతన పారిశ్రామిక విధానమే తెలంగాణ సమాజాభివృద్ధికి సోపానం ! ....... 38
గ్రామీణులకు ఉపాధినిచ్చే రిజర్వాయర్లు, మత్స్య సంపద అభివృద్ధికి సూచనలు ....... 41
గ్రామపంచాయతీలలో వినియోగ చార్జీలు విధించు విధానము ....... 43
డిజిటల్ తెలంగాణాల మొట్టమొదటి ఆదర్శగ్రామం - సిర్గాపూర్ ....... 45
విపత్తులు - నిర్వహణ ....... 47
కేంద్ర ప్రభుత్వ వినూత్న పథకాలు ....... 53
సైన్సు & టెక్నాలజీ రంగంలో దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్రం ....... 59
బహిర్భూమి స్థితిగతుల పరిశీలనపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం ....... 61
పల్లెల్లో ఐటి వెలుగులు ....... 62
బహిరంగ మల విసర్జనారహిత దిశగా తెలంగాణ రాష్ట్రం ....... 64

గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్న మన జాతిపిత గాంధీజీ మాటలను సార్థకం చేసేదిశలో గ్రామజ్యోతి కార్యక్రమం అమలుచేయటానికి మన ప్రభుత్వం పూనుకుంది.

ఈ అభివృద్ధిలో ప్రభుత్వాధికారులను ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలను, ప్రజాసంఘాలను భాగస్వాములు చేయడానికి గ్రామ జ్యోతి కార్యక్రమం ఒక చక్కటి వేదిక. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీలో వీలైనంతవరకు ఎక్కువగా ప్రజల భాగస్వామ్యం కావాలనే ప్రధాన ఉద్దేశంతో గ్రామపంచాయతీలలో కార్యాచరణ కమిటీల వ్యవస్థను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

దీనిలో గ్రామసభల ద్వారా ప్రజలకు ఏది అవసరమున్నదో దానినే నిర్ణయించి అమలు చేయటం ద్వారా ప్రత్యక్ష ప్రజాస్వామ్యం అమలులోకి వస్తుంది. దీనికొరకు ప్రభుత్వం ప్రజాస్వామ్య విధానంలో ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళిక రచనకు కావలసిన సామర్థ్యాన్ని పెంచటానికి మన రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా తగిన శిక్షణ ఇవ్వబడినది. అభివృద్ధి ప్రణాళికలు తయారుచేసే అధికారులకు మరియు ప్రజా ప్రతినిధులకు తగిన సామర్థ్యం పెంచటానికి జిల్లాస్థాయిలో శిక్షణ ఇవ్వటానికి తగినంత మంది ప్రధాన శిక్షకులు సిద్ధంగా వున్నారు. మండల స్థాయి శిక్షణకు తగిన ఏర్పాట్లు కూడా పూర్తిచేయడమైనది.

గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీలో భాగస్వాములు, తమకున్న నైపుణ్యాన్ని పెంచటానికి కావలసిన శిక్షణను ఇవ్వడానికి మండల స్థాయిలో ఏర్పాటు చేయబడిన శిక్షణ ద్వారా నైపుణ్యాన్ని పెంచుకొని గ్రామాల అభివృద్ధికి సరైన అభివృద్ధి ప్రణాళిక రచన చేయుటయే మండల స్థాయి శిక్షణ ముఖ్య ఉద్దేశ్యం.

గ్రామ పంచాయతీలలో అందుబాటులో ఉన్న సహజ వనరులతోపాటు, ఆర్థిక వనరులను మానవ వనరులను కూడా సమర్థవంతంగా వినియోగించుకొని చక్కటి గ్రామాభివృద్ధి ప్రణాళికను తయారుచేయటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అయ్యేందుకు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి. చర్చల ద్వారా పరిష్కారం కాని సమస్య అంటూ ఏదీ ఉండదు.

గ్రామ సభలే వేదికగా సర్పంచు గారి అధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాచరణ కమిటీలు తమకు సంబంధించిన అంశాలతో కూడిన గ్రామాభివృద్ధి ప్రణాళికలు తయారుచేసి అన్ని రంగాలలో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తే గ్రామ పంచాయతీలు అభివృద్ధి బాటలో పయనిస్తాయి అనటంలో ఎలాంటి సందేహం లేదు.

( అనిత రామచంద్రన్ )



# టిసిపార్డు–ఐక్యరాజ్యసమితి రెండవదశ మహిళా ప్రాజెక్టు ప్రారంభం

**తెలంగాణ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థ (టిసిపార్డు) ఐక్యరాజ్యసమితి మహిళా ప్రాజెక్టు అధికారుల మధ్య సమీక్షా సమావేశం నవంబర్ 27న రాజేందర్‌నగర్‌లో టిసిపార్డులో జరిగింది.**

ఈ కార్యక్రమానికి టిసిపార్డు కమీషనర్ శ్రీమతి అనిత రామచంద్రన్, ఐఎఎస్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, ఐక్యరాజ్య సమితి మహిళల అభ్యున్నతి కోసం నిర్వహించిన ప్రాజెక్టు గతంలో మహబూబ్‌నగర్, విజయనగరం, శ్రీకాకుళంలో జరిగిందని, ఆ పథకాన్ని ఎంతో సమర్థవంతంగా అమలు చేయడం, మహిళా సాధికారతకు తోడ్పడిందని ఆమె అన్నారు. నేడు మహిళలకు పంచాయతీరాజ్ శాఖలో 50% రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, అందుకు మహిళల నాయకత్వాన్ని తీర్చిదిద్దేందుకు కృషిని ఎస్ఐఆర్‌డి సమర్థవంతంగా నిర్వహించిందన్నారు.

జెండర్ ప్రాధాన్యతను శిక్షణలోనే బోధించి వారిని ప్రజా ప్రతినిధులుగా పనిచేయటానికి తోడ్పడినట్లు తీర్చిదిద్దడం జరిగిందన్నారు. మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక బృందాలు తెలంగాణ రాష్ట్రంలో చాలా చురుకుగా పనిచేస్తున్నాయని శ్రీమతి అనిత రామచంద్రన్ అన్నారు.

2014 జూన్‌లో యు.ఎన్. ఉమెన్ ప్రాజెక్ట్ (మొదటి దశ) పూర్తి అయింది. ఇప్పుడు ఈ యు.ఎన్.ఉమెన్ ప్రాజెక్ట్ (రెండవ దశను) 2016లో తిరిగి ప్రారంభించాలని ప్రాజెక్ట్ అధికారులు కమీషనర్ దృష్టికి తీసుకు రావడం జరిగింది. కమీషనర్ ఈ ప్రాజెక్ట్ మహిళల కోసం చేయబడినదని, తాను మహిళగా టిసిపార్డ్ తరఫున నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నానని సంతోషం వ్యక్తపరచారు.

ఐక్యరాజ్య సమితి – టిసిపార్డులు రాబోయే కాలంలో మరిన్ని మహిళాసాధికారితకు కలిసి పనిచేయనున్నాయి ఈ కార్యక్రమంలో ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు శ్రీమతి నవనీత సిన్హా, డాక్టర్ టి. ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు. టిసిపార్డు తరఫున మహిళా, శిశు సంక్షేమ కేంద్రం హెడ్ శ్రీమతి కుసుమ మాధురి టిసిపార్డు మొదటి దశలో చేసిన మహిళాభివృద్ధి కార్యక్రమాలను గూర్చి వివరించారు.

ఈ కార్యక్రమంలో టిసిపార్డు జాయింట్ డైరెక్టర్ కె.యాదయ్య, సిఎన్ఆర్ఎం, సెంటర్‌హెడ్ బి. నరేంద్రనాథరావు, సిడిపిఎహెడ్ యల్. స్వామి, కన్సల్టెంట్ జి.జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొని మహిళా ప్రాజెక్టు విషయాంశాలను గూర్చి చర్చించారు.

ఈ కార్యక్రమంలో 'సమన్వయం' అనే లఘు చిత్రాన్ని కూడా ప్రదర్శించారు. ఈ చిత్రం వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సహకారంతో ఏ విధంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు పరుస్తుందో వివరిస్తుంది.

*–సి.ఎం.పి.*

# నిరుపేదలకు చేయూతగా తెలంగాణాలో 'ఆసరా' పథకం

**సంక్షేమ రాజ్యంలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాల మంచి చెడులను చూసేందుకు పేదవాడి ముఖమే ప్రతిబింబం. పేదవాడి ముఖంలో చిరునవ్వులు పలికించగలిగే పథకమే మంచి పథకం. ప్రభుత్వ పథకాల మంచిచెడులను కొలిచేందుకు ఇది ఒక ప్రామాణికం అని మన జాతిపిత మహాత్మాగాంధీ చెప్పారు.**

తెలంగాణ సమాజంలోని నిరుపేదలకు సంక్షేమం మరియు సాంఘిక భద్రతను కల్పించాలనే ఆశయంతో తెలంగాణ ప్రభుత్వం 'ఆసరా' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం అక్టోబర్ 1, 2014 నుంచి అమలులోకి వచ్చింది. ఈ పథకం ద్వారా నిస్సాహాయస్థితిలో ఉన్న నిరుపేదలైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు మరియు హెచ్.ఐ.వి./ఎయిడ్స్‌తో జీవిస్తున్న వ్యక్తులను సగౌరవంగా మరియు సురక్షితంగా సమాజంలో జీవించేందుకు భరోసా కల్పిస్తుంది.





నిరుపేదలకు రెండు పూటలా ఆహారం కల్పించడంతోపాటుగా వారి రోజువారి జీవితంలో కనీస అవసరాలను తీర్చాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం గతంలో రూ. 200 లు ఉన్న వితంతువు, వృద్ధాప్య ఫించన్లను రూ. 1000 లకు మరియు రూ. 500 లు ఉన్న వికలాంగుల ఫించన్ను రూ. 1500 లకు పెంచింది.

| పింఛన్ రకాలు | భత్యం | అర్హత |
|---|---|---|
| వృద్ధాప్య ఫించన్ | 1000 | 65 సం॥లు ఆపైబడిన వయస్సు వారు, బిపిఎల్ కుటుంబానికి చెందినవారై ఉండాలి. |
| నేత కార్మికులు | 1000 | 50 సం॥ మరియు ఆపై వయస్సు పైబడినవారు |
| వితంతువులు | 1000 | 1) 18 సం॥ వయస్సు పైబడినవారై ఉండాలి.<br>2) భర్త మరణ ధృవీకరణ పత్రం కలిగి ఉండాలి.<br>3) 45 సం॥ వరకు ప్రతి సంవత్సరం పునర్వివాహం జరగలేదని ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలి. |
| గీత కార్మికులు | 1000 | 50 సం॥ వయస్సు పైబడి గీత కార్మికుల కో-ఆపరేటివ్ సొసైటీలో నమోదు చేసుకొని ఉండాలి. |
| హెచ్.ఐ.వి./ఎయిడ్స్ తో జీవిస్తున్నారు | 1000 | ART చికిత్స మొదలు పెట్టిన వారై ఉండాలి. |
| వికలాంగులు | 1500 | 1) వయస్సుతో సంబంధం లేదు<br>2) కనీసం 41% అంగవైకల్యం కలిగి ఉన్నట్లుగా SADAREM వారిచేత ధృవీకరించాలి.<br>3) కనీసం 50% వినికిడి సమస్య ఉన్నట్లుగా SADAREM వారిచేత ధృవీకరించాలి.<br>4) వారు మైనర్స్ అయితే ఫించన్ డబ్బును వారి తల్లి/దండ్రులకు చెల్లిస్తారు. |



అవిభక్త రాష్ట్రంలో ప్రభుత్వం సాలీనా రూ. 881.23 కోట్ల రూపాయలను ఫించన్ పథకాలకు ఖర్చు చేయగా, తెలంగాణ ప్రభుత్వం దానిని రూ. 3,350 కోట్ల రూపాయలకు పెంచింది. దేశంలోని ఏ ఇతర రాష్ట్రం కూడా ఇంత పెద్ద మొత్తంలో (రూ. 3,350 కోట్లు) సామాజిక భద్రత గురించి ఖర్చు చేయనంతగా, మన రాష్ట్రం ఖర్చు చేస్తూ, ఫించన్ల విషయంలో అన్ని రాష్ట్రాల్లో తలమానికమయింది.

ఎంతో వినూత్నంగా, ఉపయుక్తంగా ఉండే ఈ 'ఆసరా' పథకాన్ని ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నవంబర్ 8, 2014న మహబూబ్‌నగర్ జిల్లాలోని కొత్తూరు గ్రామంలో శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా "అర్హులందరికి ప్రభుత్వ పథకాలను అమలు అయ్యేలా చర్యలు తీసుకొంటామని, అనర్హులను ఉపేక్షించేది లేదని" తన మనస్సులోని మాటను ప్రజలకు స్పష్టంగా తెలియచేశారు. అదేరోజు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కూడా ఇతర మంత్రులచేత ఈ పథకం ప్రారంభించబడింది.

## అర్హులు - అర్హతలు

పైన సూచించిన అర్హతలతోపాటుగా లబ్ధిదారు ఎంపిక ఏ విధమైన అవకతవకలు జరగకుండా ఎలాంటి రాజకీయ, ప్రాంతీయ వివక్షలకు తావు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం కొన్ని ప్రత్యేకమైన నియమ నిబంధనలు తయారుచేసి ఈ పథకం అమలులో పారదర్శకతతోపాటు నియమ నిబంధనల ప్రకారం దరఖాస్తుదారుని సామాజిక, ఆర్థిక స్థితిగతుల ఆధారంగానే లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

లబ్ధిదారులు వారి అర్హతలకు సంబంధించిన అన్ని ధృవీకరణ పత్రాలతో పాటుగా, ఆ వ్యక్తి ఫొటో వారి బ్యాంక్/పోస్టాఫీస్ అకౌంట్ వివరాలను, ఆధార్‌కార్డ్, ఒకవేళ వికలాంగుడైతే వారి ధృవీకరణ పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించవలసి ఉంటుంది. స్వీకరించిన దరఖాస్తులన్నీ సంబంధిత పంచాయతీ సెక్రటరీ/ బిల్ కలెక్టర్ చేత పరిశీలించబడతాయి. తిరిగి వాటిని సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి / మున్సిపల్ కమీషనర్/డిప్యూటీ/జోనల్ కమీషనర్ పున:పరిశీలనచేసి నిబంధలను అనుసరించి లబ్ధిదారుల జాబితాను తయారుచేస్తారు. జాబితాను తయారుచేయటంలో అన్ని వర్గాలవారికి సమన్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకొంటారు.



లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలోను ధృవీకరణ పత్రాలను జారీ చేయడంలో ఏ విధమైన అవకతవకలు జరిగినట్లుగా సామాజిక తనిఖీలో (సోషల్ ఆడిట్) నిర్ధారిస్తే సంబంధిత వ్యక్తులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

అందుకే గత చరిత్ర పునరావృతం కాకుండా ఉండేందుకు లబ్ధిదారుల ఎంపికలో నిండు వడపోత విధానాన్ని ప్రవేశపెట్టింది తెలంగాణ ప్రభుత్వం. ఫించన్ల కోసం ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. అంతేకాక వ్యక్తిగతంగా కూడా ఎవరికి వారు తమ పేరును నమోదు చేసుకునే వీలును కల్పించింది. ఇప్పటిదాక 35,86,243 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుండి నేటివరకు మన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదరికాన్ని నిర్మూలించి. సాంఘిక ఆర్థిక అసమానతలను రూపుమాపి నిరుపేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఎన్నో సంక్షేమ మరియు సామాజిక భద్రత పథకాలను ప్రవేశపెట్టాయి. కాని శాఖల మధ్య సమన్వయం లేకపోడం, అధికారులలో పారదర్శకత లోపించడం, ప్రజలలో ఆ పథకాలపై అవగాహన లేకపోవడంచేత ప్రభుత్వం ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా నిరుపేదవారి జీవితంలో రావల్సినంతగా మార్పు తీసుకురాలేకపోతున్నాము.

అందుకే తెలంగాణ ముఖ్యమంత్రి సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ఎక్కువ ప్రాముఖ్యతనిస్తున్నారు. ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమం అమలులో ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా ఉండాలని, అప్పుడే వాటి ఫలాలు అర్హులకు అందుతాయని నొక్కి చెబుతున్నారు. 'ఆసరా పథకం' ఎంతోమంది నిరుపేదల జీవితంలో వెలుగులు నింపింది. నింపుతుంది.

*- ఎ. విజయలక్ష్మి, టిసిపార్డ్*

'మన ఊరు-మన చెరువు' అనే నినాదంతో రాష్ట్రంలో ఉన్న 46 వేలకు పైగా చెఱువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 12.03.2015లో ప్రారంభించారు. కాకతీయుల కాలం నాటి ప్రాభవాన్ని తీసుకురావటానికి ఈ కార్యక్రమానికి 'మిషన్ కాకతీయ' అని పేరు పెట్టారు. 20 వేల కోట్ల రూపాయలతో వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో అన్ని చెఱువులను పునరుద్ధరించడం జరుగుతుంది.



గౌతమ్ పింగ్లే (జూన్, 2011) తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయం అనే అంశంపై అధ్యయనం జరపగా 1956లో 5.30 లక్షల ఎకరాల్లో వ్యవసాయం చెరువు నీటి ద్వారా జరిగిందని, అదే 2009లో చూస్తే 2.18 లక్షల ఎకరాలకు పడిపోయిందని తేలింది.

# పేదరికం పారద్రోలే మిషన్ కాకతీయ

శాతవాహన మరియు కాకతీయుల కాలంలోనే తెలంగాణ రాష్ట్రంలో చెఱువులను తవ్వించారు. దీనికి నిదర్శనంగానే రామప్ప, పాకాల, లక్నవరం, ఘణపురం మరియు బయ్యారం చెరువులు వెలసి ఎన్నో వేల ఎకరాలకు సాగు నీరు అందించి వ్యవసాయం చేసుకోవటంలో రైతులకు తోడ్పడ్డాయి. తర్వాత కాలంలో వ్యవసాయరంగంపై నిర్లక్ష్యం వల్ల ఎన్నో వేల చెఱువులు ఎండిపోయి ఆక్రమణలకు గురయ్యాయి.

తర్వాత గ్రామాల్లో వర్షాలు లేక, చెఱువులు ఎండిపోయి వలసలు ప్రారంభమయ్యాయి. ఎక్కువ శాతం తెలంగాణ గ్రామాలు కరువుకోరల్లో చిక్కుకుపోయాయి. ఉన్న ఊరును, కన్నభూమిని వదిలి గ్రామం నగరబాట పట్టింది. కృష్ణా, గోదావరి, మూసి మరియు మంజీరా నదులలోని నీరు ఎక్కువ శాతం పారిశ్రామిక రంగానికి, త్రాగునీటికి మరియు ఆంధ్రాప్రాంతానికి సాగునీరుగా ఉపయోగపడ్డాయి.

గతంలో వ్యవసాయరంగంపై చిన్న చూపువల్ల తెలంగాణ ప్రాంతం పూర్తిగా వెనుకబడిపోయింది. స్వయం సమృద్ధిగా ఉన్న గ్రామాలు కరువుకోరల్లో చిక్కుకుపోయి వలసల రాష్ట్రంగా మిగిలిపోయింది. దేశంలోని ముంబాయి, భివండి, సూరత్, అహ్మదాబాద్‌లోనే కాకుండా గల్ఫ్ దేశాల్లో సైతం తెలంగాణ ప్రజలే ఎక్కువగా వలస కూలీలుగా కన్పిస్తారు.

## పి.ఆర్ & ఆర్.డి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీ శేఖర్ ప్రసాద్ సింగ్, ఐ.ఏ.ఎస్



శ్రీ శేఖర్ ప్రసాద్ సింగ్, ఐ.ఏ.ఎస్

3-11-2015న పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మరియు త్రాగునీటి సరఫరా ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా శ్రీ శేఖర్ ప్రసాద్ సింగ్, ఐ.ఏ.ఎస్ పదవీ బాధ్యతలు స్వీకరించారు.

శ్రీ శేఖర్ ప్రసాద్ సింగ్ 1983 సివిల్ సర్వీసు బ్యాచ్‌కి చెందిన వారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శిగా పని చేశారు. రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. అంతేకాక శ్రీ శేఖర్ ప్రసాద్ సింగ్ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఆర్థిక వ్యవహారాల డైరెక్టర్‌గా పనిచేశారు. అంతకుముందు విశాఖపట్నం మున్సిపల్ కమీషనర్‌గా. శ్రీకాకుళం, కర్నూలు జిల్లాలకు కలెక్టర్‌గా పనిచేశారు.



1977లో వలస కూలీలుగా తూర్పుతీర ప్రాంతానికి వెళ్లిన కొందరు అక్కడ వచ్చిన తుపానుకు గురై తిరిగి రాలేదని వాళ్లెక్కడున్నరో జాడ తెలియ రాలేదని తెలిసినప్పుడు కవి హృదయంలో కలిగిన ఆవేదన ఇది డా॥ ముకురాల రామ రెడ్డి గారు ఒక జాలరి జీవితాన్ని కన్నులకు కట్టినట్లు చిత్రీకరించారు.

*గోకులాష్టమి దాటిపోయినా*
*గొడ్ల డొక్కలు గుంజినా*
*వాగులల్లో వంకలల్లో వానపాములు ఎండినా*
*చినుకు రాలే ఆశ లేదని, చెర్లు కుంటలు పర్రెపడెనని*
*కూలి మస్తుగ దొరుకుతదని కోస్త దేశం పోతివా*
*ఎన్నడొస్తవు లేబరీ, పాలమూరీ జాలరీ*

ఇది తెలంగాణ రాష్ట్రంలో నీటి వసతికి నోచుకోక, పంటలు పండక, నిరంతరం కరవు రక్కసి కోరల్లో చిక్కుకున్న పాలమూరు ప్రాంత కన్నీటి గాథ, బతుకు భారాన్ని మోస్తూ కాలాన్ని వెళ్లదీయలేక బతకటానికి వలసపోవటం అక్కడి కూలీలకు పరిపాటి. ఈ పరిస్థితిని పారద్రోలడానికి గ్రామాలను తిరిగి సుభిక్షంగా చేసుకోవటానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చెఱువుల పునరుద్ధరణ కార్యక్రమం వల్ల గ్రామ ప్రజలు ముఖ్యంగా రైతులు ఎంతో లాభపడతారు.

తెలంగాణలో చెరువులను పునర్మించడం ద్వారా వ్యవసాయాభివృద్ధి సాధిస్తే ప్రజలకు ఉపాధి దొరికి వలసలు ఆగిపోతాయి. మిషన్ కాకతీయ మొదటి దశలో 8218 పనులకు రూ. 2.606,54 కోట్లతో ప్రభుత్వం అనుమతిచ్చింది. 7,910 పనులకు సుమారు రూ. 1,550 కోట్లకు గుత్తేదారులతో ఒప్పందాలు జరిగాయి.

తొలిదశలో ఎక్కువ ప్రాంతాల్లో పనులు మెరుగ్గా జరిగినా అక్కడక్కడా చెరువు గట్లు పనులు సరిగా చేయలేదని తూములు సరిగా లేవని ఫిర్యాదులు అందాయి. ఈ అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మలిదశలో మరింత మెరుగ్గా పనులు చేయాలని సంకల్పిస్తోంది.

రెండో దశలో రూ. వెయ్యి కోట్ల నిధులకు ఆర్థికశాఖ అంగీకరించింది. నిబంధన ప్రకారం వెయ్యి కోట్లకు ఆర్థికశాఖ అనుమతిస్తే ఒకటిన్నర రెట్లు పనులు చేపట్టటానికి అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రూ. 1500 కోట్ల విలువైన పనులకు అనుమతిచ్చి వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు నీటి పారుదల శాఖ కసరత్తు చేస్తుంది.

మొదటి దశలో తెలంగాణ పల్లెల్లో మిషన్ కాకతీయ పనుల్లో ఊరు ఊరంతా కదిలి ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో మరింత ఉత్తేజం తీసుకురావటానికి ప్రజాప్రతినిధులు, మంత్రులు, పలుగు పార చేతపట్టి చెరువులను పునరుద్ధరించుకున్నారు. పూడిక మట్టిని తమ పొలాల్లో వేసుకున్న రైతులు మంచి దిగుబడిని పొందారు. పూడిక మట్టి ద్వారా మొక్కలు ఎత్తు పెరగటం, ఎక్కువ మొక్కలు పెరగటం వల్ల దిగుబడి పెరిగింది.

కాకతీయు కాలంనాటి ప్రాభవాన్ని తీసుకురావటానికి వలసల నుండి తెలంగాణ రైతులను కాపాడటానికి గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పేదరికం నిర్మూలనే ధ్యేయంగా, వ్యవసాయాభివృద్ధే ముఖ్య ఉద్దేశ్యంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ మహత్తరమైన కార్యక్రమం అనతి కాలంలోనే మొదటిదశను పూర్తి చేసుకుని అత్యంత ప్రజాదరణ పొందింది. దేశంలోనే కాకుండా, విదేశాలలో కూడా పేరు ప్రఖ్యాతిని పొంది వారి ఆదరణకు నోచుకుంటుంది. ఎంతోమంది ఉదాత్తంగా ఈ కార్యక్రమం విజయవంతం కావటానికి విరాళాలు అందిస్తున్నారు.

తెలంగాణ ఏర్పడక ముందు ప్రజలు ఏదైతే కోరుకున్నారో ఏర్పడ్డాక ఆ కలలు సాకారం చేసుకుంటున్నారు. ఎన్నో చెరువులు విపరీతమైన కంపచెట్లతో, తుమ్మచెట్లతో చిన్నపాటి అడవిని తలపించేలా, చిన్న చెరువు కట్టతో ఉన్న ఆ చెరువు స్వరూపం ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. కార్లు ప్రయాణం చేయగల విశాలమైన చెరువు కట్టలతో, తూము, అలుగు పోసే చోట పూర్తిగా పునరుద్ధరింపబడి శోభయమానంగా విలసిల్లుతున్నాయి.

సహజసిద్ధంగా ఒక చెరువు ద్వారా మరొక చెరువు నిండడం అనేది గొలుసుకట్టు చెరువుల ద్వారా వ్యవసాయం. ఇది కాకతీయుల కాలం నుండి తెలంగాణ ప్రాంతంలో ఉన్నది. ముఖ్యమంత్రి నీటి పారుదల శాఖ ఇంజనీర్లకు ఈ విధానాన్నే ఎక్కువగా కొనసాగించాలని చెప్పారు ఒక చెరువు బాగా నిండాక నీరు విడిచి పెట్టే అని సహజసిద్ధమైన కాలువల ద్వారా ప్రవహించి మరో చెఱువులోకి వెళ్తాయి.

ప్రస్తుతం వేలాది చెరువులు నీటితో నిండి జలకళ కనబడుతుంది. భూగర్భ జలమట్టం పెరిగింది. బావిలోకి నీరు వచ్చి చేరుతుంది. మంచినీటికి, సాగునీటికి కొరత లేని పరిస్థితి వచ్చింది. చాలా చెరువుల్లో చేప పిల్లలను పోసి పెంచడం ద్వారా బెస్తవాళ్లు, జాలరుల పరిస్థితి మెరుగుపడింది.

"పుట్టి బుద్దెరిగిన కాడ్నించి, మేనుల మొలకి బట్టకట్టిన కాడ్నించి గీ చెరువుల మన్ను ఎవ్వరు ఎత్తి బోయంగ చూడలె గింత బాగా మా ఊరి సెరువును జూస్తనని నేను కలలో కూడా అనుకోలేదు" ఇది ఊళ్లో ఒక రైతు ఆనందం.

ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామం అభివృద్ధి పొంది రైతుల ఆత్మహత్యలు లేని తెలంగాణ గ్రామాలుగా సిద్ధిస్తాయని ఆశిద్దాం.

– **కె. విద్యుల్లత,** *ట్రైనింగ్ ఆఫీసర్, టిసిపార్డ్*

# మాతా శిశు సంరక్షణకు ఆరోగ్యలక్ష్మి పథకం



**మహిళా శిశు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖరరావు ఆరోగ్యలక్ష్మి అనే పథకాన్ని 01-01-2015న ప్రారంభించారు. రాష్ట్రంలోని తల్లి బిడ్డలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించి వారికి ప్రతిరోజూ పౌష్టికాహారం అందించేలా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.**

2014లో జరిపిన సర్వేలో తెలుగు రాష్ట్రాల్లో శిశు మరణాలు రేటు 41/1000గా నమోదైంది. ఇది అభివృద్ధి చెందని రాష్ట్రాలైన జార్ఖండ్ , ఉత్తరఖండ్ కన్నా ఎక్కువ. మాతా శిశు మరణాల రేటును తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా ఆరోగ్యలక్ష్మి పథకం ప్రారంభమైంది. ఈ పథకంలో 31,897 అంగన్ వాడీ కేంద్రాలు, 4076 మినీ అంగన్ వాడీ కేంద్రాల ద్వారా దాదాపు 5.9 లక్షల ఆర్థికంగా వెనుకబడిన గర్భిణీలు, బాలింతలకు, 18.20 లక్షల పిల్లలకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందిస్తున్నారు.

## ఈ పథకం క్రింద లబ్ధిదారులు

*గర్భిణీ మరియు బాలింతలు:* ప్రతి రోజు ఒక గుడ్డు, 200ml పాలతో కూడిన సంపూర్ణ పౌష్టికాహార భోజనం నెలలో 25 రోజులు ఇస్తారు.

*7 నెలల నుండి 3 సం॥ల పిల్లలు:* 16 గుడ్లు, 2.5 కిలోల పౌష్టికాహార ప్యాకెట్ (గోధుమలు, శనగలు, పాలపొడి, చక్కర మరియు నూనె).

**ఆహార పదార్థాలు సేకరించే విధానం**

| ఆహార పదార్థం | సరఫరా చేయవలసిన వారు | బడ్జెట్ పొందువారు |
|---|---|---|
| బియ్యం | పౌరసరఫరాల శాఖ/ప్రాజెక్ట్ డైరెక్టర్ | ప్రాజెక్టు డైరెక్టర్ |
| పప్పు | డి.పి.సి/సరఫరాల శాఖ | ప్రాజెక్టు డైరెక్టర్ |
| నూనె | ఆయిల్‌ఫెడ్ | సి.డి.పి.ఒ. |
| పాలు | డైరీ/స్థానిక పాల వ్యాపారులు | సి.డి.పి.ఒ. |
| గుడ్లు | కోళ్ల ఫారాలు/యన్.ఇ.సి.సి. | సి.డి.పి.ఒ. |
| కూరగాయలు | అంగన్‌వాడీ వర్కర్ | సి.డి.పి.ఒ. |
| పోపుగింజలు | అంగన్‌వాడీ వర్కర్ | సి.డి.పి.ఒ. |
| వంటగ్యాస్ | అంగన్‌వాడీ వర్కర్ | సి.డి.పి.ఒ |

*3 సం॥ నుండి 7 సం॥ పిల్లలు:* అన్నం, పప్పు, కూరలు, స్నాక్స్ మరియు ప్రతిరోజు ఒక గ్రుడ్డు.

## ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యాలు

* గతంలో ఇస్తున్న పౌష్టికాహార నాణ్యతను పెంపొందించి ప్రతి గర్భిణి మరియు బాలింతలు పోషకాహారం తీసుకునేలా ప్రోత్సహించడం.
* గర్భిణి మరియు బాలింతలకు ఇచ్చే ఈ పోషకాహారం వారికి మాత్రమే చెందేలా చూడటం.
* గర్భిణి మరియు బాలింతలు 90 ఐరన్ ఫోలేట్ మాత్రలు తీసుకునేలా చెయ్యటం.
* అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణి, బాలింతల నమోదును పెంపొందించడం.
* గర్భిణి, బాలింతలలో రక్తహీనత లేకుండా చేయడం.
* పిల్లలలో పోషకాహారలోపం లేకుండా చేయటం.
* తక్కువ బరువుతో పిల్లలు పుట్టకుండా జాగ్రత్తపడటం.
* మాతా శిశు మరణాల రేటును తగ్గించటం.

పైన పేర్కొన్న అంశాలను సంపూర్ణంగా సాధించడానికి ప్రతిరోజూ గర్భిణీలు, బాలింతలు మరియు పిల్లలకు ఒక పూట సంపూర్ణ భోజనం అందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు 11 మంది సభ్యులుగా గల అంగన్‌వాడి లెవల్ పర్యవేక్షణ మరియు తోడ్పాటు కమిటి (ఎ.ఎల్.యమ్.యస్.సి) ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పడింది. సభ్యులుగా క్రింద పేర్కొన్న వారు ఉంటారు.

(1) సర్పంచ్ లేదా వార్డ్‌మెంబర్ చైర్ పర్సన్‌గా ఉంటారు.
(2) ఆశా కార్యకర్త
(3) గర్భిణి/బాలింత – ఇద్దరు.
(4)గ్రామస్తులు (రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి లేదా సామాన్య శాస్త్ర అధ్యాపకులు) – ఒకరు
(5) చిన్న పిల్లల తల్లులు – ముగ్గురు.
(6) సబల కార్యక్రమంలో ఉన్న యుక్త వయస్సు బాలిక – ఒకరు.

## సంపూర్ణ భోజనం మెను

| | ఆహార పదార్థం-1 | ఆహార పదార్థం-2 | ఆహార పదార్థం-3 | ఆహార పదార్థం-4 | ఆహార పదార్థం-5 |
|---|---|---|---|---|---|
| మొదటిరోజు | బియ్యం | కూరగాయలతో కూడిన సాంబార్ | ఆకుకూరలు కూరగాయలు | గుడ్డుకూర | 200 మి.లీ. పాలు |
| రెండవ రోజు | బియ్యం | పప్పు | ఆకుకూరలు | గుడ్డు | 200 మి.లీ. పాలు |
| మూడవ రోజు | బియ్యం | ఆకుకూర పప్పు | గుడ్డుకూర | గుడ్డు | 200 మి.లీ. పాలు |
| నాల్గవ రోజు | బియ్యం | కూరగాయలతో కూడిన సాంబార్ | 100 మి.లీ. పెరుగు | గుడ్డుకూర | 200 మి.లీ. పాలు |
| ఐదవ రోజు | బియ్యం | ఆకుకూర పప్పు | గుడ్డుకూర | గుడ్డు | 200 మి.లీ. పాలు |
| ఆరవ రోజు | బియ్యం | ఆకుకూర పప్పు | 100 మి.లీ. పెరుగు | గుడ్డు | 200 మి.లీ. పాలు |

(7) గ్రామ సంఘం నుండి సభ్యులు - ఇద్దరు.

(8) అంగన్ వాడీ వర్కర్.

* పైన పేర్కొన్న సభ్యులంతా నెలకోసారి (ప్రతి నెలా మొదటి తారీఖు) సమావేశమై సంపూర్ణ భోజనం ప్రాముఖ్యత తెలియచేస్తారు
* బియ్యం, పప్పు, నూనె, గుడ్లు, పాలు, కూరగాయలు మరియు ఇతర సరుకులు అవసరం మేరకు అందేలా చర్యలు తీసుకుంటారు.
* స్థానిక పాల వ్యాపారులు లేదా పాల కేంద్రాలను గుర్తించి వారి నుండి పాలు సేకరించడం.
* ఈ పథకం క్రింద అర్హులైన లబ్దిదారులను గుర్తించి వారందరూ లబ్ధిపొందేలా ప్రోత్సహించడం.
* లబ్ధిదారులలో ఎవ్వరు కూడా సంపూర్ణ భోజనాన్ని ఇంటికి తీసుకుపోకుండా చూడటం.
* ప్రతి రోజూ ఆహార పదార్థాల పట్టిక, తీసుకునే సమయం నిర్ధారించడం.
* లబ్దిదారుల హాజరు, పోషకాహార నాణ్యత, పరిశుభ్రత అంశాలను పరిశీలించటం. ఏమైనా అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవటం.
* హాజరు పట్టికలను పరిశీలించి సర్టిపై చేయటం.
* అంగన్‌వాడీ వర్కర్ మరియు ఆశాకార్యకర్తలు లబ్ధిదారులను గుర్తించి నమోదు చేయాలి. అంగన్‌వాడీ వర్కర్ ప్రతి ఇంటికి వెళ్లి గర్భిణి బాలింతలను నమోదు చేసి వారికి మాతా శిశు సంరక్షణ కార్డులను గ్రామ ఆరోగ్య పౌష్టికాహార దినోత్సవం రోజున అందచేస్తుంది.



* కమీటి సభ్యులు, ఐ.సి.డి.యస్ అధికారులు సంపూర్ణ భోజనం యొక్క ఆవశ్యకతను లబ్దిదారులకు తెలియచేస్తారు.
* సంపూర్ణ పౌష్టికాహార భోజనం నెలకు 25 రోజులు అంగన్‌వాడీ సెంటర్‌లోనే అందచేస్తారు.
* 25 గుడ్లు 25 రోజులకు అందచేస్తారు. మిగతా 5 గుడ్లు మోడల్ మెనులో ఇస్తారు.
* పాలు 25 రోజులు అందచేస్తారు. మిగాతా 5 రోజుల పాలు పెరుగు రూపంలో అందచేస్తారు.
* అంగన్‌వాడీ హెల్పర్ ప్రతిరోజూ అంగన్‌వాడీ సెంటర్‌లోనే వండుతుంది.
* హెల్పర్ లేని పక్షంలో కమీటి సభ్యులలో ఎవరైనా ఒకరు వండాలి.
* ఐరన్ ఫోలిక్ మాత్రలు ఎయన్.యమ్ ద్వారా అంగన్‌వాడీ వర్కర్ తీసుకుని భోజనంతో పాటుగా ఇవ్వాలి.
* గర్భిణి, బాలింతల పెరుగుదల పర్యవేక్షణ ప్రతి నెలకోసారి చూసి నమోదు చెయ్యాలి. పుట్టిన శిశువు బరువు కార్డులో నమోదు చెయ్యాలి.
* గ్రామస్తుల పంచాయతీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలి.
* ఐసిడియస్ అధికారులు ప్రతినెల 20 అంగన్‌వాడీ సెంటర్‌లలో సంపూర్ణ భోజనం ఎలా అమలవుతుందో పర్యవేక్షించాలి.
* నాణ్యతలో లోపం, ఏమైనా అవకతవకలు జరిగితే ఐసిడియస్ అధికారులు బాధ్యత వహించాలి.
* గ్రామ సభలలో, మండల పరిషత్, జిల్లా పరిషత్ సమావేశాలలో ఈ పథకం గురించి చర్చించి తగిన చర్యలు తీసుకోవాలి.

మాతా శిశు సంరక్షణకై మన ముఖ్యమంత్రి గారు ప్రారంభించిన ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా బలహీన వర్గాలకు చెందిన ఎంతో మంది లబ్దిదారులు ప్రతి రోజు సంపూర్ణ భోజనం తీసుకుంటున్నారు. తద్వారా మన తెలంగాణ మాతా శిశు మరణాలు లేని రాష్ట్రంగా కావాలని ఆశిద్దాం.

**- కె.విద్యుల్లత**

*ట్రైనింగ్ ఆఫీసర్, టిసిపార్డ్*

# ఆదర్శంగా నిలిచిన మెంటెపల్లి గ్రామం

**"అవసరాలను గుర్తించి పరిష్కార మార్గాలను కనుగొననంతవరకు ఒక గ్రామంపై కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టినా ఆ గ్రామం అభివృద్ధి చెందదు" అని అన్నారు గొప్ప వ్యక్తిత్వ నాయకుడు స్వామి వివేకానంద.**

**"దేశాభివృద్ధికి అట్టడుగున ఉన్న గ్రామ వికాసం ప్రధాన కీలకం" అని అన్నారు గ్రామ స్వరాజ్ స్ఫూర్తిదాత మహాత్మాగాంధీ.**

**"నీ కోసం బతికితే నీవు నీవు గానే మిగిలిపోతావ్. జనం కోసం బ్రతికిచూడు వారి గుండెల్లో ఉండిపోతావ్" అని అన్నారు భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్**

ఈ ముగ్గురు మానవతావాదుల ఆశయాలను పునికిపుచ్చుకుని, కృషి, పట్టుదల, అంకితభావంతో, మంచి చొరవతో నిరంతరం శ్రమిస్తూ నీతి, నిజాయితీతో, జవాబుదారితనంతో, పారదర్శక పరిపాలనందించాలనే దృఢ సంకల్పంతో మెంటెపల్లి గ్రామ అభివృద్దే ధ్యేయంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సమర్థ సర్పంచ్‌గా సకల రంగాలలో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నారు గ్రామ సర్పంచ్ మెంటెపల్లి పురుషోత్తం రెడ్డి గారు.

"సర్పంచ్ కాలపరిమితి తర్వాత వెనక్కి చూసుకుంటే ప్రేమానురాగాల మిగలాలని, ప్రజల మదిలో చెరిగిపోని ముద్రగా ఉండాలని, అది వందేళ్లయినా పదిలంగా ఉండాలని అందుకు గ్రామం అభివృద్ధి కొరకు ప్రజల భాగస్వామ్యంతో మంచి పనులు చేస్తూ ప్రజల కష్టాలను, తన కష్టంగా భావిస్తూ ప్రతి సమస్యను పరిష్కరిస్తూ మెంటెపల్లి గ్రామాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శగ్రామంగా / అభివృద్ధి గ్రామంగా నిలపాలన్నదే తన ప్రధాన ఆశయం" అని అంటున్నారు. ఆ గ్రామ ప్రథమ పౌరులు, గ్రామ సర్పంచ్ శ్రీ మెంటెపల్లి పురుషోత్తం రెడ్డి గారు.

మహబూబ్‌నగర్ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులుగా మరియు రాష్ట్ర పంచాయితీ సర్పంచుల సంఘానికి కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

### అభివృద్ధి పల్లె - మెంటెపల్లె

తెలంగాణ రాష్ట్రంలో విరివిగా వనరులు, అభివృద్ధికి అవకాశాలు ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి రెవెన్యూ డివిజన్ వనపర్తి మండలంలోని ఒక మారుమూల పల్లె మెంటెపల్లి. ఈ గ్రామం జిల్లా కేంద్రానికి 80 కి.మీ., వనపర్తి మండల కేంద్రానికి 13 కి.మీ. దూరంలో ఉంది. గతంలో నాటవెల్లి అను గ్రామపంచాయతీ పరిధిలో ఇది అనుబంధ గ్రామంగా ఉండేది. 1981 లో ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడింది.

### మెంటెపల్లి అను పేరు రావడానికి కారణం

పూర్వం ఈ గ్రామంలో నివసిస్తున్న రామన్న అనే వ్యక్తికి మెల్ల కన్ను ఉన్నదట. అతడు పలు విలువిద్యల్లో ఆరితేరిన వ్యక్తిగా గుర్తింపు ఉండేది. ఒకనాడు ఒక విలువిద్యలో పాల్గొని నిర్దేశించిన లక్ష్యాన్ని సూటిగా/ నేరుగా గురితో కొట్టి విజయం సాధించాడు.

### గ్రామజ్యోతి స్ఫూర్తితో రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షులు శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దత్తత గ్రామం మెంటెపల్లి ఆదర్శగ్రామంగా ఎంపిక

అందువల్ల అక్కడివారు ఆ రోజు అతనిని అభినందిస్తూ శభాష్ మెంటోడా అని చెప్పడంతో నాటి నుండి ఆ పల్లెకు మెంటెపల్లి అని పేరు వచ్చింది.

మెంటెపల్లి గ్రామ పంచాయితీకి ప్రస్తుతం రాఘవేంద్రనగర్ కాలనీ అను ఒక ఆవాసం కలదు. ప్రస్తుతం మెంటెపల్లి గ్రామం 8 పంచాయతీ వార్డులతో విస్తరించి ఉన్నది. ఈ గ్రామంలో ప్రధానంగా ప్రజలు మెంటె (బి.సి) మంద (ఎస్సీ) మరియు మైనారిటీ రాచాల (ఓ.సి.) సమూహాలు ఉన్నాయి.

ఇక్కడ మొత్తం 264 కుటుంబాలు ఉండగా, ఇందులో ఎస్సీలు 428 మంది, బి.సి.లు 341, ఓ.సి.లు 152 మంది మరియు 479 ఉండగా మొత్తం 965 మంది జనాభాతో 753 మంది ఓటర్లు ఉన్నారు.

1980లో ప్రత్యేక పంచాయితీగా ఏర్పడిన ఈ గ్రామానికి మొదటి సర్పంచ్‌గా షెడ్యూల్డు కులానికి చెందిన వ్యక్తి యం. వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 3వ సర్పంచ్‌గా షెడ్యూల్డు కులానికి చెందిన యం. దేవన్నను, 4వ సర్పంచ్‌గా జనరల్ మహిళా కోటాలో శ్రీమతి రాచాల విజయలక్ష్మి, పురుషోత్తం రెడ్డిగారిని, 5వ సర్పంచ్‌గా బి.సి. కులానికి చెందిన పి. భారయ్యను ఎన్నుకున్నారు.

మెంటెపల్లి ప్రత్యేక పంచాయితీగా ఏర్పడిన నాటి నుండి 2001 వరకు ఆ ఊరి గురించి ఎవరికి తెలియదు. గ్రామానికి సరియైన రహదారులు ఉండేవి కావు. గ్రామస్థులు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొనేవారు.

## అభివృద్ధికి నాంది పలికిన సర్పంచ్ విజయలక్ష్మి

కొరతల కొలిమిలో మగ్గిపోతూ నిస్సహాయంగా నిట్టూరుస్తున్న వలయంలో చిక్కుకొని ఉన్న మెంటెపల్లికి శ్రీమతి రాచాల విజయలక్ష్మి పురుషోత్తం రెడ్డి సర్పంచ్‌గా గెలుపు మెంటెపల్లి అభివృద్ధికి మలుపు.

2001 లో గ్రామ పంచాయితీకి జరిగిన 3వ సాధారణ ఎన్నికల్లో జనరల్ మహిళా కోటాలో ఉన్నత విద్యావంతురాలైన శ్రీమతి రాచాల విజయలక్ష్మి పురుషోత్తం రెడ్డి (బి.ఎస్సీ., బి.ఇడి.) గారిని గ్రామప్రజలు సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. సర్పంచ్ కూడా అభివృద్ధి పనులు చేయని రీతిలో ఒక ప్రణాళిక బద్ధంగా లక్ష్యాలను నిర్దేశించుకుని, ఆ లక్ష్యాలను తూచా తప్పక అమలుచేసి, మెంటెపల్లి గ్రామానికి మెరుగైన సేవలు అందించారు. విజయలక్ష్మి సర్పంచ్‌గా ఉన్న కాలంలో గ్రామానికి మెరుగైన సేవలను అందించి, సాధించిన ప్రగతి పనులు చాలా ఉన్నాయి.

## అభివృద్ధి ఆశాకిరణం - పురుషోత్తం రెడ్డి

మెంటెపల్లి గ్రామం ప్రత్యేక పంచాయతీగా ఏర్పడిన నాటి నుండి ఇంకా ముఖ్యమైన సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని గుర్తించి సర్పంచ్‌గా తన హయాంలో ప్రజలకు సుపరిపాలన అందించాలని ప్రజల భాగస్వామ్యంతో, గ్రామంలోని సమస్యలను గుర్తించి వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని మెంటెపల్లిలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, గ్రామ రూపురేఖలు సంపూర్ణంగా మార్చివేసి ప్రగతి ఫలాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చెంతకు చేర్చుతూ, మెంటెపల్లి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచి సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపి అభివృద్ధి మార్గంలో ఆదర్శ మెంటెపల్లిగా తీర్చిదిద్దడానికి మెంటెపల్లి పురుషోత్తం రెడ్డి గారు కంకణబద్ధులైయ్యారు.

నిరంతరం / ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులోఉంటూ ప్రజలతో మమేకమై అభివృద్ధి పనులు అమలు చేస్తూ మరియు వివిధ శాఖల అధికారులతో కూడా మంచి సత్సంబంధాలు నెలకొల్పుకొని ఎవరి ని నొప్పించక, ఇబ్బంది కలిగించకుండా, మారుమూల గ్రామమైన మెంటెపల్లి గ్రామానికి మంచి కీర్తి ప్రతిష్టలు తెస్తున్నారు.

## మెంటెపల్లి సర్పంచ్‌గా పురుషోత్తం రెడ్డి సాధించిన ప్రగతి

- 100% ఇంటిపన్ను వసూలు 100% నీటి పన్ను వసూలు
- 100% విద్యుత్ బిల్లు చెల్లింపు
- సంపూర్ణ మద్యపాన నిషేధ గ్రామం
- ఎలాంటి గొడవలు, తగాదాలు లేని గ్రామం
- గ్రామంలోని వీధులన్ని సిమెంట్ రోడ్ల నిర్మాణం
- అన్ని వీధుల్లో ప్రతి స్థంబానికి సి.ఎఫ్.ఎల్. లైట్లు ఏర్పాటు
- ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యార్థం నీటి కుళాయిల ఏర్పాటు
- ప్రతి గృహానికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణం
- ఇంటింటికి చెత్త బుట్టలు పంపిణి, వీధి వీధికి చెత్తకుండీల ఏర్పాటు తద్వారా ఊరి చెత్తను పోగు చేసి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించడంతో పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దారు.
- మురుగు కాలువలు శుభ్ర పరచడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం
- ప్రజల భాగస్వామ్యంతో గ్రామంలో ఉన్న ముళ్ల పొదలను తొలగింపు మరియు విచ్చల విడిగా విపరీతంగా వీధుల్లో పెరిగి ఉన్న పిచ్చి మొక్కలను యంత్రాల సహాయంతో తొలగించడం జరిగింది.
- రూ॥ 10 లక్షల విలువతో పాఠశాలకు ప్రహరీ గోడను నిర్మించడం జరిగింది.
- ప్రతి వారం నీటి క్లోరినేషన్ చేయడం జరుగుతోంది.
- **హరితహారం కార్యక్రమంలో భాగంగా:**
  - ఎ. ఇంటింటికి మొక్కలు పెంపకం కొరకు 3 వేల మొక్కలు సరఫరా చేసి వాటిని నాటించడం జరిగింది.
  - బి. పాఠశాల ఆవరణలో 500 మొక్కలు నాటి వాటిని ప్రత్యేక వాచ్‌మెన్‌తో సంరక్షణ చేస్తున్నారు.
  - సి. చెరువు గట్లపై 13 వేల మొక్కలు నాటించడం జరిగింది.
  - డి. ఉద్యానవన శాఖ ద్వారా 70 ఎకరాలలో ఆధునిక పద్ధతులలో పండ్లతోటల పెంపకం చేపట్టడం జరిగింది.

## గ్రామజ్యోతి

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రజలే సారథులు కావాలని, గ్రామ అభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని తద్వారా ప్రగతి సాధించాలనే ధృఢ సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామజ్యోతి అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.

దేశాభివృద్ధికి పల్లెలే పట్టుకొమ్మలు కావాలన్న మహనీయుని మాటలే గ్రామజ్యోతి కార్యక్రమానికి పునాది. అభివృద్ధి ప్రక్రియలో ప్రజలను సంపూర్ణ భాగస్వాములను చేయడమే గ్రామజ్యోతి ముఖ్య ఉద్దేశం. పంచాయతీ ఉద్యమం, సహకార ఉద్యమం, భూదాన ఉద్యమం వీటన్నింటికి స్ఫూర్తి చాటేలా ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలన్నదే గ్రామజ్యోతి కార్యక్రమ లక్ష్యం.

పల్లెసీమల్లో కొత్తవెలుగు నింపడం, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కాంతులు ప్రసరింపజేయడం, గ్రామంలోని సామాజిక సమస్యలను అక్కడి వారి సహాయంతో రూపుమాపడం తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన గ్రామజ్యోతి లక్ష్యాలు. ప్రతి పనిలో స్థానికులనే భాగస్వాములుగా చేస్తూ పల్లెల అభివృద్ధికి బాటలు వేయడం గ్రామజ్యోతి ప్రధాన ఉద్దేశ్యం.

పల్లెసీమల్లో కొత్తవెలుగు నింపడం, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కాంతులు ప్రసరింపజేయడం, గ్రామంలోని సామాజిక సమస్యలను అక్కడి వారి సహాయంతో రూపుమాపడం తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన గ్రామ జ్యోతి లక్ష్యాలు. ప్రతి పనిలో స్థానికులనే భాగస్వాములగా చేస్తూ పల్లెల అభివృద్ధికి బాటలు వేయడం గ్రామ జ్యోతి ప్రధాన ఉద్దేశ్యం.

## గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగంగా మెంటెపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలు

ఈ లక్ష్యసాధనలో మెంటెపల్లి గ్రామ సర్పంచ్ శ్రీ మెంటెపల్లి పురుషోత్తం రెడ్డి గారు ప్రతి పనిలో స్థానికులనే భాగస్వాములు చేస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.

గ్రామజ్యోతి కార్యక్రమంలో 7 కార్యాచరణ కమిటీలు ఏర్పాటు చేశారు.

- వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో తన వంతుగా ప్రతి లబ్దిదారునికి ముందస్తు మద్ధతుగా రూ॥ 3,000ల ఆర్థిక సహాయం అందించారు.
- గ్రామంలో దట్టంగా ఉన్న ముళ్లపొదలను మరియు ఊరచెరువులో ఉన్న ముళ్లపొదలను తొలగించారు.
- ఉపాధి హామీ పథకం ద్వారా డంపింగా యార్డు ఏర్పాటుచేసి జిల్లాలో మొదటిసారిగా వాడుకలోకి తీసుకురావడం జరిగింది.
- గ్రామం చుట్టూ అన్ని రోడ్లను కలపటానికి అవసరమైన మేరకు సొంత నిధులతో భూమి కొనుగోలు చేసి ఒక అద్భుతంగా రింగ్‌రోడ్డు నిర్మాణం చేయడం జరిగింది.
- రింగ్‌రోడ్డు పొడవునా విద్యుత్ స్థంబాల ద్వారా విద్యుత్ దీపాల ఏర్పాటు చేయడం జరిగింది.
- ఊర చెరువును ఆహ్లాదకరంగా మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చడం దీని పొడవునా విద్యుత్ దీపాల ఏర్పాటు జరుగుతుంది.
- హరితహారంలో ఇంటింటికి మొక్కలు సరఫరా వాటిని నాటి సంరక్షించే చర్యలు చేపట్టడం జరిగింది.
- పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం
- గ్రామ పంచాయతీకి అవసరమైన స్థలాన్ని గ్రామస్థుల నుండి దానపూర్వకంగా (ఉచితంగా) స్వీకరించి గ్రామ పంచాయితీ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దడం జరిగినది.
- మెంటెపల్లిలో నాన్ సి.ఆర్.పి. కింద రూ. 3 లక్షల విలువ చేసే నిధులను ప్రభుత్వం నుండి తెప్పించి త్రాగునీటి సరఫరా పునరుద్ధరణ పనులు చేయడం జరిగింది.
- రాఘవేంద్రనగర్ కాలనీలో రూ. 2 లక్షల విలువచేసే త్రాగునీటి పునరుద్ధరణ పనులు చేయడం జరిగింది.

### ఆరోగ్యం

గ్రామానికి పి.హెచ్.సి 4 కి.మీ.ల దూరంలో ఉంది. ఈ గ్రామానికి వైద్య ఆరోగ్య శాఖవారి సేవలు బాగానే అందుతున్నాయి. ఈ గ్రామంలో ఎలాంటి మాతృమరణాలు గాని, శిశుమరణాలు గాని జరుగకుండా చర్యలు చేపట్టడం జరిగింది. వ్యాధినిరోధ టీకాలు చిన్న పిల్లలకు సకాలంలో వేస్తున్నారు. గృహ కాన్పులు లేవు. అన్ని ఆసుపత్రి కాన్పులకే గర్భవతులను ఎ.ఎన్.యం / ఆషా కార్యకర్తలు చైతన్యం చేస్తున్నారు.

### పౌష్టికాహారం

గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో పనిచేస్తున్న టీచర్లు శాఖాపరంగా అందిస్తున్న సేవలు సక్రమంగా అందిస్తున్నారు. గర్భవతులకు, బాలింతలకు, కిషోర బాలికలకు కేంద్రాల ద్వారా ఆహారం, గుడ్డు, సకాలంలో అందించే విధంగా గ్రామజ్యోతి పౌష్టికాహార కమిటీ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుంది.

### విద్య

గ్రామంలో ప్రాథమిక పాఠశాల విశాలమైన వాతావరణం, పచ్చటి చెట్లతో కళకళలాడుతుంది. సరిపడే తరగతి గదులున్నాయి.

5వ తరగతి వరకే విద్యాభ్యాసం సాగుతుంది. ఇక్కడ ప్రస్తుతం ముగ్గురే ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇద్దరు వాలంటీర్లను సర్పంచ్ శ్రీ పురుషోత్తం రెడ్డి ఏర్పాటు చేసి విద్యాబోధన చేయడం జరుగుతుంది. పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న సెజాతీబేగం అనే మహిళను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి మొక్కలు పెంచే బాధ్యతను అప్పగించడం జరిగింది. ప్రతిరోజు మొక్కలకు నీరు పోస్తు వాటిని సంరక్షిస్తుంది.

### సామాజిక సేవా పంథాలో..

- గ్రామ ప్రజలకు సామాజిక సేవలో భాగంగా ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి తూడుకుర్తి వారి ఆధ్వర్యంలో గ్రామంలో మెగా

కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించి దృష్టిలోపం గల వారిని గుర్తించి మొత్తం 150 మందికి ఉచితంగా కంటి అద్దములను పంపిణీ చేయడం జరిగింది.

- తల్లిదండ్రులు లేని 3 అనాథ పిల్లలను తన సొంత ఖర్చులతో సర్పంచ్ పురుషోత్తం రెడ్డి గారు చదివించడం జరుగుతుంది.
- నిరుపేద కుటుంబాల వారు గ్రామంలో ఎవరు చనిపోయిన వారి అంత్యక్రియల నిమిత్తం రూ॥ 3000/-ల వరకు ఆర్థిక సహాయం సర్పంచ్ పురుషోత్తం రెడ్డి గారు అందిస్తుంటారు.
- పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేయటం కొరకు ప్లేట్లు మరియు గ్లాసుల పంపిణీ

## పంచాయతీ రికార్డుల నిర్వహణ

మెంటెపల్లి పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజుగారు, పంచాయతీని స్థానిక ప్రభుత్వం పరిపాలనగా తీర్చిదిద్ది ప్రజలకు, పంచాయతీకి నిరంతరం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పంచాయతీస్థాయిలో నిర్వహించవలసిన వివిధ రకాల రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ ఇంకా అదనంగా ప్రత్యేకమైన రికార్డులతో పాటు మొత్తం 46 రకాల రికార్డులను నిర్వహించడం. ఈ గ్రామ పంచాయతీని సందర్శించిన డి.పి.ఓ. శ్రీ వి. వెంకటేశ్వర్లు మరియు డి.ఎల్.పి.ఓ. శ్రీ కృష్ణ రికార్డుల నిర్వహణ చూసి అభినందించారు.

## మెంటెపల్లికి అండగా ఉంటా

- రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబెడుతాం.
- అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యం
- గ్రామీణ ప్రాంతాల్లో మార్పు రావాలి
- పురుషోత్తం కల నెరవేరాలి - మెంటెపల్లి ఆదర్శంగా నిలవాలి.

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు గౌ॥ శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రాష్ట్రంలోనే అన్ని గ్రామాలకు ఆదర్శంగా మెంటెపల్లి నిలవాలని ఆ దిశగా తీర్చిదిద్దుతామని కావలసిన అభివృద్ధికి తన చేయూతనందిస్తూ అండగా ఉంటానని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి మండలంలో తాను దత్తత తీసుకున్న మెంటెపల్లి గ్రామాన్ని, జిల్లా కలెక్టర్ శ్రీమతి టి.కె. శ్రీదేవి, జడ్.పి. సి.ఇ.ఓ. లక్ష్మినారాయణ, డి.పి.ఓ. వేంకటేశ్వర్లు, ఎస్.ఇ. ప్రసాద్‌రెడ్డి ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసిన సందర్భంగా తేది : 20-11-2015 నాడు జిల్లా కలెక్టర్ టి.కె. శ్రీదేవి గారు జిల్లా అధికారులతో మెంటెపల్లి గ్రామాన్ని సందర్శించారు.

గ్రామంలోని వీధులన్నీ తిరిగి, స్వచ్ఛభారత్‌లో భాగంగా నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లు, హరితహారంలో భాగంగా ఇళ్ల ముందు నాటిన మొక్కలను, ఇంటికి ఏర్పాటు చేసిన నీటి కుళాయిలను, సిమెంట్ రోడ్లను, గ్రామం చుట్టూ వేసిన రింగ్‌రోడ్డును మరియు వీధి లైట్లను పరిశీలించారు.

అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శ్రీ పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు మాట్లాడుతూ మెంటెపల్లి గ్రామం రాష్ట్రంలోని మిగతా గ్రామాలకు ఆదర్శం కావాలని, కృషి పట్టుదల ఉంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చునని అన్నారు. నేను దత్తత తీసుకున్న ఈ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధివైపు నడిపిస్తున్న గ్రామ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి గారిని అభినందిస్తూ ఇక్కడి ప్రజలకు, ఈ మట్టికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని అన్నారు.

ఈ సందర్భంగా సమిష్టికృషి, ప్రజల భాగస్వామ్యంతో ప్రజల ఆలోచనలే పెట్టుబడిగా సమగ్రాభివృద్ధి సాధించవచ్చునని ఈ ఆశయసాధనే ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు లక్ష్యమని అదే ఒక్క వినూత్న గ్రామజ్యోతి కార్యక్రమం అని అన్నారు.

ఈ గ్రామంలో మీరు స్మరించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్లను నిరూపయోగంగా వదిలిపెట్టకుండా వాటిని వినియోగించుకుని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. గ్రామంలో ప్రజలంతా ఐక్యమత్యంగా పార్టీలకతీతంగా ఉండాలని ఐక్యమత్యమే బలమని, బలంగా మీరుంటే ఇకనుంచి మీ గ్రామానికి ఎంతో మంది సందర్శకులు వచ్చి వెళ్తారని అన్నారు.

స్వయం ఉపాధి పథకాల ద్వారా చిరు వ్యాపారాలు చేసుకుని పాత పద్ధతులు వదిలేసి వాణిజ్య పంటలైన కూరగాయలు, పండ్లు, పూల తోటలు సాగుచేస్తే లాభాలు వస్తాయని ప్రతి ఒక్కరు ఆవులు, గేదులు పెంచుకోవాలని పాలతో పాటు వాటి ఎరువులను పొలాలకు సేంద్రీయ ఎరువుగా వాడుకునే అవకాశముందని అన్నారు.

మారుతున్న మార్పులకు అనుగుణంగా పల్లెల్లోని ప్రజల జీవితాల్లో మార్పురావాలని, దానికి అనుగుణంగా ఎదగాలని అధునాతన విజ్ఞానాన్ని అందుకుని ఆరోగ్యకరమైన కొత్త సమాజాన్ని ఏర్పరచుకుని అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని అన్నారు.

ఈ ప్రాంత రైతులకు సాగునీరందించి వారి కళ్లల్లో నీళ్ళు

తుడుస్తానని అన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి సాగునీరు అందిస్తానని అన్నారు. భీమా కాలువను పూర్తి చేయడం జరిగిందని తన సొంత నిధులతో డైవర్షన్ బండ్ ఏర్పాటు చేసి కాలువలకు నీళ్లను విడుదల చేయించాలని కృష్ణ సముద్రం నుండి లిఫ్టు ద్వారా మెంటెపల్లి గ్రామంలోని మిగులు భూముల సాగుకొరకు, మెంటెపల్లి చెరువుకు సాగునీరందిస్తామని మెంటెపల్లి గ్రామానికి అండగా ఉంటానని మెంటెపల్లి అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని – అందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబెడతానని, రాష్ట్రంలోనే గుర్తింపు వచ్చేలా కృషిచేస్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.

## రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చేయూత

- గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేస్తే మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయిస్తానని చెప్పి మాట ప్రకారం గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీరు అందించుటకు శుద్ధజల ప్లాంటును మంజూరుచేస్తూ త్వరలో మంజూరు చేస్తూ శంకుస్థాపన చేస్తానని అన్నారు.
- అధునాతన మురుగునీరు పారుదల వ్యవస్థ అయిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి తన నియోజకవర్గ అభివృద్ధి నిధులతో స్వంత నిధులతో రూ|| 7,59,000 మంజూరు చేశారు.
- మెంటెపల్లి గ్రామంలోనే 4.5 ఎకరాలలో ఉన్న ప్రభుత్వ భూమిలో నిరుపేదలందరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి పేదలకు ఆవాసయోగ్యం కల్పిస్తామని అన్నారు.
- మెంటెపల్లి నుంచి జాతీయ రహదారి వరకు బి.టి. రోడ్డు నిర్మాణం కొరకు రూ|| 1 కోటి 9 లక్షలు మంజూరు చేశామని తెలియజేశారు.
- మెంటెపల్లి నుండి జాతీయ రహదారికి దూరం తగ్గించటానికి విలియం కొండ తాండ వరకు రోడ్డు ఏర్పాటు చేసే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

*గ్రామ జ్యోతి నిరంతర ఆరిపోని జ్యోతి కావాలి*

*ప్రజల భాగస్వామ్యమే చమురు, వత్తి కావాలి*

*ఆదర్శంగా మారాలంటే 5 సూత్రాలు పాటించాలి*

జిల్లా కలెక్టర్ శ్రీమతి టి.కె. శ్రీదేవి ఐ.ఎ.ఎస్ ముఖ్యమంత్రి గారు చేపట్టిన విప్లవాత్మకమైన గ్రామాభివృద్ధి కార్యక్రమం గ్రామజ్యోతి కార్యక్రమం అని ఇట్టి గ్రామజ్యోతిని నిరంతరం ఆరిపోని జ్యోతిగా వెలిగించే జ్యోతిగా ప్రజలు భాగస్వాములై తమ కృషి ద్వారా రెండు చేతులతో ఈ జ్యోతిని కాపాడుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ శ్రీమతి టి.కె. శ్రీదేవి అన్నారు.

గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగంగా ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసిన మెంటెపల్లి గ్రామాన్ని మొట్టమొదటిసారిగా సందర్శించి ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో కలెక్టర్ గారు ప్రసంగించారు. గ్రామంలో ప్రజలు ప్రతి ఒక్కరు మలమూత్ర విసర్జనకు బహిర్భూమికి వెళ్లకుండా మరుగుదొడ్లు నిర్మించుకుని, వాటిని వాడుకోవాలని ఇది మహిళల ఆత్మ గౌరవాన్ని పెంచుతుందని అన్నారు. బహిరంగ మల విసర్జన మరియు మేనరికం వల్లనే వికలత్వం వచ్చే అవకాశం ఉందని ఒక అధ్యయనంలో తేలిందని అన్నారు.

- 100% పన్నులు చెల్లించాలి.
- గ్రామంలో నూటికి నూరుశాతం మరుగుదొడ్లు నిర్మించుకొని వాటిని వాడుతూ సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించాలి.
- విద్యాభివృద్ధికి కృషి చేస్తూ నిరక్ష్యరాస్యతను నిర్మూలించాలి.
- ఇంటింటికి, రోడ్డు కిరువైపులా మరియు ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి హరితగ్రామంగా తీర్చిదిద్దాలి.
- గ్రామంలోని గర్భవతులు ఆసుపత్రులలోనే కాన్పులు జరిగేటట్లు చూడాలి. మాతృశిశు మరణాలు లేకుండా ఉండాలి.

ఈ ప్రకారం 5 లక్ష్యాలను అధిగమించిన గ్రామాలను ఆదర్శగ్రామంగా ఎంపిక చేస్తామని తెలియజేశారు. మెంటెపల్లి గ్రామం ఈ లక్ష్యసాధనలో పయనిస్తున్నదని అందుకే ఆదర్శ గ్రామంగా ఎంపిక చేశామని కలెక్టర్ అన్నారు. ఈ గ్రామాభివృద్ధికి కృషి చేసిన గ్రామ సర్పంచ్ పురుషోత్తం రెడ్డిని, వార్డు సభ్యులను మరియు గ్రామ ప్రజలను కలెక్టర్ అభినందించారు. సర్పంచ్ పురుషోత్తం రెడ్డి కోరిక మేరకు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావును మెంటెపల్లికి రావాలని కోరుతామని అన్నారు.

గ్రామజ్యోతి స్ఫూర్తితో జిల్లాలో మొత్తం 212 గ్రామాలు దత్తత గ్రామాలుగా ఉన్నాయని ఈ గ్రామాలే కాక, జిల్లాలోని అన్ని 1330 గ్రామ పంచాయతీలను సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామాలుగా మార్చి జిల్లానే ఒక ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని ఇందుకు ప్రజా ప్రతినిధులు, ప్రజలు, అధికారులు చొరవ చూపాలని గ్రామజ్యోతికి ప్రజలే చమురు, వత్తి కావాలని ఈ జ్యోతి ఆరిపోకుండా ప్రజలు కంటికి రెప్పలా దాచుకోవాలని అందుకు నిఘానేత్రాలు ఇచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి టి.కె. శ్రీదేవి గారు కోరారు.

***– బి. వెంకటయ్య,*** *జిల్లా శిక్షణా మేనేజర్, జిల్లా ప్రజాపరిషత్, మహబూబ్‌నగర్*

# బాల్యం బందీ కారాదు

**బాల్యం బందీ అవుతోంది. బాలలహక్కులు, చట్టాలు, రక్షణలు భరోసాను కల్పించలేకపోతున్నాయి. దేశంలో అనాదిగా వస్తున్న పలు రుగ్మతలకు తోడు సాంఘిక, రాజకీయ, ఆర్థిక కారణాల వలన పసిమొగ్గల బాల్యం బరువెక్కిపోతోంది. చిట్టిపొట్టి చేతులతో పలకా, బలపము పట్టి సరస్వతీమాత ఒడిలో అక్షరసేద్యం చేయవలసినవారు పరిశ్రమల్లో, కార్ఖానాలల్లో, రైల్వేలు, రోడ్లపై భారంగా కాలాన్ని వెళ్ళదీస్తున్నారు.**

బాలలహక్కులు హరించబడిపోతూ ఏపూటకు, ఆ గొడుగు పడుతూ జానెడు పొట్టకూటి కోసం పడరాని పాట్లు పడుతూ జీవనసమరంలో నడయాడుతున్నారు. తమకు హక్కులు, రాజ్యాంగ రక్షణలు ఉంటాయనీ తెలియని చిరుప్రాయంలో మత్తుపదార్థాలకు, ఇతర వ్యసనాలకు లోనవుతూ నేరమయ జీవితానికి చేరువవుతున్నారు. అమ్మ, నాన్నలేని అనాథలుగా, ఆలనాపాలనాలేని అభాగ్యులుగా నేటి బాలలు నిర్లక్ష్యం గావించబడితే రేపటి నవనిర్మాణ భారతవనికి మేటి పౌరులుగా ఎలా ఎదుగుతారన్నదే ప్రశ్నార్థకంగా తయారయ్యింది. ఇలా బాల్యంలోనే అభద్రతకు చేరువయి, అశాంతికారకులుగా తయారయ్యే వారి సంఖ్య ఏటికేడు హెచ్చింపుకావడం ఆందోళన రేకెత్తించుచున్నది.

దేశంలో బాలల హక్కులకు తగిన సహకారం లభించక అనేకులు బాలకార్మికులుగా మారుతున్నారు. తల్లిదండ్రుల నిర్లక్ష్యపు జీవితాలకు పిల్లలు బలి అయి అనాథలుగా తయారవుతున్నారు. ఆడి, పాడే వయసులో అభం, శుభం తెలియనివారు చెడుసావాల సాలకు ఆకర్షితులయి నేరాలకు పాల్పడుతున్నారు. తద్వారా బాల్యం నాలుగుగోడల మధ్య బంధించబడి ఊచలు లెక్కిస్తున్నారు. అమ్మాయిల ను వ్యభిచార రొంపిలోకి దింపి సొమ్ముచేసుకునే కీచకుల కుట్రలకు కొందరి అమాయకజీవితాలు బలయిపోతున్నాయి.

నీచమైనవృత్తిలోకి అమ్మాయిలను దింపి తమ దేహమంతా పుండుగామారినా దుర్మార్గులకు కాసులు కురిపించే కల్పతరువులా తయారయి కాటికి చేరువవుతున్నారు. ఎందరో అమ్మాయిలు ఒకటేమిటి పలురకాల లైంగిక చర్యలకు తనదేహాన్ని తాకట్టుపెట్టినా తాము మాత్రం ఆ నరకకూపంనుండి బయటపడలేక తమ వేదన అరణ్యరోదనగా మారుతుంది.

భారతావని ముద్దుబిడ్డలు మాయగాళ్ళ బాణాలకు చిక్కి విలవిలలాడుతున్నారు. బయటపడలేక దేశానికి భారంగా మారుతున్నారు. నమ్మినవారు నట్టేటముంచినవారు కొందరైతే, ఆర్థికకారణాలతో అంగట్లో సరుకుని చేసి కొందరు ఆడపిల్లల జీవితాలతో ఆడుకుంటున్నారు. పసిప్రాయంలోనే కీచకుల వలలో చిక్కి బయటికి రాలేక జీవితాలు పదుల వయస్సులోనే నూరేళ్ళు నిండుతున్నాయి. భారతవని ఒడిలో హాయిగా చిరుప్రాయాన్ని చిద్విలాసంగా గడపాల్సినవారు అంపశయ్యకు చేరువవుతుంటే మేలిమి మానవవనరులుగా ఎలా దేశానికి సద్వినియోగమవుతారు.

నేటి బాలలను రేపటి సంపూర్ణ పౌరులుగా తీర్చిదిద్దాలంటే విద్యతోనే సాధ్యమని గ్రహించిన ప్రభుత్వాలు, సమాజం విద్యపట్ల ఆసక్తిని ప్రదర్శిస్తూ అందరికీ విద్యను అందించేవిధంగా తగుచర్యలు చేపడుతున్నది. విద్యతోనే సమాజవికాసం సాధ్యమని భావించిన తల్లిదండ్రులు తమపిల్లలను ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషిచేస్తున్నారు. అందరికీ విద్య అందించబడితేనే



అసమానతలు రూపుమాపబడి సమగ్రాభివృద్ధికి బాటలుపడుతాయని భావించి అందరికీ ఉచిత నిర్బంధ విద్య అందించే విధంగా విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం అమలులోకి తెచ్చింది.

చదువుకొనే కాలంపెరిగి, పేద, ధనిక తారతమ్యాలతో చదువుకొనడం జరుగుతున్న ప్రస్తుత వ్యవస్థకు చరమగీతం పాడాలని ఉచితనిర్బంధ విద్యకు బాటలు వేసింది. ఈ చట్టం ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించాల్సిందే కానీ నేడది గగనకుసుమం అవుతోంది. ఈ చట్టం అనాథలకు, బాలకార్మికులకు, వెట్టిచాకిరీ చేసే వారికి, విధివంచితులకు క్రొత్త భరోసానిచ్చి వారి భావిజీవితాలకు బంగారుబాటలు వేస్తుందని భావించినా ఇంకా పట్టాలెక్కక ప్రహసనంగా మారింది. చట్టం సంపూర్ణంగా అమలుచేస్తే బడుగుల భావిపౌరులకు భరోసానిస్తుందనడంలో ఎలాంటి సందేహంలేదు. కానీ అమలు ఎప్పుడన్నదే వేధిస్తున్న ప్రశ్న.

దేశంలో విద్యాహక్కు చట్టంతో బడిఈడు పిల్లలందరు బడిలో చేరేలా ప్రభుత్వాల చర్యలు తీసుకొంటున్నా నిలువలేకపోతున్నారు.

బడిలో నమోదయిన వారిలో 41 శాతం మంది ప్రాథమిక విద్యను పూర్తిచేయకుండానే వెనుదిరుగుతున్నారు. దేశంలో సుమారుగా 60 లక్షల మంది పిల్లలు బడిలో చేరడంలేదు అన్న నిజం కలిచివేస్తోంది. మధ్యలో బడిమానేస్తున్నవారు దేశంలో 42 శాతం కాగా, అందులో దళితులు 51 శాతం, ఆదివాసీలు 58 శాతం, అమ్మాయిలు 64 శాతంగా ఉండడం శోచనీయం. డ్రాపౌటుగా మారుతున్నవారిలో దళితులు, ఆదివాసులు కావడం అందులో అమ్మాయిలే అత్యధికంగా ఉండడం విచారించదగినది. విద్యాలయాలల్లో తగిన వసతులులేక అమ్మాయిలు తగ్గుముఖం పడుతున్నారని పలునివేదికలు వెల్లడించిన విషయాలు ఆలోచింపదగినవి. దీనితోపాటు అమ్మాయిల పట్ల తల్లిదండ్రుల ఆలోచనా ధోరణి, వారి భద్రత పట్ల అభద్రత మూలానా బాల్యవివాహాలు చేయడం లాంటి కారణాలు ముఖ్య కారణాలుగా వెల్లడయ్యాయి.

బడిలో చేరే 20 కోట్ల మంది పిల్లలో సుమారు 8 కోట్ల మంది ప్రాథమిక విద్యను పూర్తిచేయకుండానే ఎగనామం పెడుతున్నారని యునిసెఫ్ వెల్లడించింది. 2011 లెక్కల ప్రకారం సెకండరీ విద్యను అభ్యసించకుండా స్వస్తిపలికిన వారిలో 1.64 కోట్లతో భారతదేశం మొదటిస్థానంలో నిలిచింది. ఇలా ప్రాథమిక, సెకండరీ స్థాయిలలో విద్యపట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్యధోరణితో బాలకార్మికలోకం ఇంతలంతలు కావడానికి కారణమవుతోంది.

దేశంలో 67 శాతం బాలకార్మికులు వ్యవసాయ, అనుబంధరంగాలల్లో పనిచేయుచుండగా, 23 శాతం పారిశ్రామికరంగంలో పనిచేస్తున్నారు. ప్రపంచ బాలకార్మికులలో 33 శాతం మంది భారత్‌లోనే ఉండడం గమనార్హం. కాగా వీరిలో 60 శాతం మంది పదేళ్ళలోపు వారు కావడం విచారకరం. 2011 జనాభాలెక్కల ప్రకారం 5-14 సంవత్సరాల మధ్య బాలకార్మికులు 43.53 లక్షలు కాగా, అత్యధికంగా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలలో ఉన్నారు.

బాలకార్మికులు దేశంలో విస్తరించిపోతుండడమే కాకుండా బాలలు పలునేరాలకు, ఘోరాలకు పాల్పడుతున్నారు. బాలలపై జరిగే నేరాలు, ఘోరాలు, లైంగికవేధింపులు లాంటి పలురకాల మోసాలకు గురి అవుతున్నారు. జాతీయ నేర సమాచార విభాగం(ఎన్.సి.ఆర్.బి) నివేదిక- 2014 ప్రకారం పిల్లలపై 89,423 సంఘటనలు నమోదయినాయి. దీనిలో మధ్యప్రదేశ్ 15,085 ఉత్తరప్రదేశ్‌లో 14,835 కేసులు నమోదయినాయి. అత్యల్పంగా నాగాలాండ్‌లో 25, సిక్కింలో 93 కేసులు నమోదయినాయి.

కేంద్రపాలితప్రాంతాలల్లో అత్యధికంగా 9,350 కేసులు నమోదుకాగా, లక్షద్వీప్‌లో కేవలం 1 కేసు మాత్రమే నమోదుకావడం గమనించదగినది. ఆంధ్రప్రదేశ్‌లో 2,059 కాగా తెలంగాణాలో 1,930 కేసులు నమోదయినాయి. ఇందులో పిల్లలపై హత్య కేసులు 1817 కాగా, అత్యాచారం కేసులు 13,766, అమ్మాయిల హక్కులకు భంగంకలిగించి, సభ్యత, శీలమును కించపరిచే విధంగా



వ్యవహరించిన కేసులు 11,335, కిడ్నాప్ మరియు బలవంతంగా ఎత్తుకొనిపోవడం వంటి కేసులు 37,854, లైంగికవేధింపుల బారి నుండి పిల్లలను రక్షించే చట్టం ప్రకారంగా 8,904 కేసులు ఇలా పలు రకాల కేసులతో పిల్లలపై జరిగే నేరాల చిట్టా పురివిప్పుతోంది.

వీటికి తోడు జాతీయ పిల్లల హక్కుల సంరక్షణ కమీషన్ నివేదిక 2014 ప్రకారం అదృశ్యం (మిస్సింగా) అయిన పిల్లల సంఖ్య ఆందోళనకు గురిచేస్తోంది. దేశంలో మొత్తం 13,081 మంది మిస్సింగ్ కాగా, అందులో 7,382 మందిని పట్టుకోవడం జరిగింది. కానీ ఇంకా 5,699 మంది పిల్లల అదృశ్యంను చేధించలేకపోయింది. అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 3,290, తమిళనాడులో 2,518, ఉత్తరప్రదేష్‌లో 2,208, ఆంధ్రప్రదేశ్‌లో 1,224 మంది, తెలంగాణలో 1,018 మంది పిల్లలు అదృశ్యం అయ్యారు. అత్యల్పంగా మణిపూర్‌లో 4, డామన్‌డయ్యూలో 6 కాగా, లక్షద్వీప్‌లో ఒక్క మిస్సింగ్‌కేసు నమోదు కాకపోవడం ప్రశంసించదగినది. ఇలా పిల్లలపై అత్యాచారాలు, వేధింపులు, మిస్సింగ్‌లు లాంటి పలు మోసాలకు గురికాబడి వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా తయారవుతోంది.

పిల్లలపై జరిగే మోసాలు వారి ఉనికిని వారి అంధకారబంధురం చేస్తున్నాయి. దానికితోడు పిల్లలకు కల్పించవలసిన రాజ్యాంగ రక్షారేకులు నీడనివ్వలేకపోతున్నాయి. పేదరికం, సామాజిక కారణాలు వారి సంరక్షణలకు అడ్డుగోడలుగా నిలుస్తున్నాయి. ఇలాంటి దుస్థితిని సమూలంగా మార్చివేయడానికి ఉచిత నిర్బంద విద్యను పకడ్బంధీగా అమలు చేయాలి.

నిర్బంధ విద్యాహక్కు చట్టం ఆశయమైన ఆర్థిక కారణాలతో చదువుకు ఎవ్వరూ దూరంకాకూడదు అన్న సదాశయం బాల కార్మికులు, అనాధల ప్రగతికి నిచ్చెనమెట్లుగా ఉపయోగపడాలి. బాల కార్మికుల చట్టాలను పటిష్టంగా అమలుపరచాలి. పిల్లల తల్లిదండ్రులలో గల సామాజిక, ఆర్థికకారణాలను అధిగమించేలా తగుచర్యలు చేపడితేనే బాలల బంగారుభవిష్యత్‌కు బాటలు పడతాయి. అప్పుడే వారు భావి భారత పురోభివృద్ధికి కారకులవుతారు.

*- ఎ. శ్యామ్ కుమార్,*
*8374918513*

**భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో స్వేచ్ఛా, స్వాతంత్రాల కోసం ఎంత చర్చ జరిగిందో అదే స్థాయిలో విద్య, అభివృద్ధిపై కూడా విస్తృతస్థాయిలో చర్చ జరిగింది. ఫలితంగా మన విద్యా విధానంలో, కోసం కరికులం రూపకల్పనతో గాంధీజీ ప్రతిపాదించిన విద్యార్థి సమగ్రాభివృద్ధి, నెహ్రూ ప్రతిపాదించిన సోషలిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తాయి.**

అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో విద్యారంగంలో ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయాల గురించి విస్తృత చర్చ జరిగింది. నిధులు, నియామకాల్లో కూడా అన్యాయం చేస్తూ విద్యారంగాన్ని దెబ్బ తీశారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత మనం ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో దేశంలోని అభివృద్ధి చెందిన ఇతర రాష్ట్రాలతో పోటీపడాలంటే సమగ్రమైన ఉన్నత విద్యావిధానాన్ని తయారు చేసుకోవాల్సిన అవసరమున్నది.



ఉన్నతవిద్య ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిశీలిస్తే మనకు ప్రధానంగా కన్పించేది రాజకీయ సంకల్పం లేకపోవడం. ఈ సమస్యను ఉద్యమానంతరం ఏర్పడిన ప్రభుత్వం సులభంగానే అధిగమించగలదు.

కానీ దేశవ్యాప్తంగా ఉన్నతవిద్య ఎదుర్కొంటున్న మరో నాలుగు సమస్యలను అధిగమించాలి.

# భావి అవసరాలకు దీటుగా విద్య

మనదేశంలో ఒకనాడు ఉన్నత విద్య అంటే ఉన్నత వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉండేదనే స్థాయి నుంచి ఇవ్వాళ పేద వారు కూడా చదువుకునే స్థాయికి వచ్చింది. మనదేశంలో అత్యధికులు యుక్త వయస్సువారు. మరో ఐదేళ్ల తర్వాత దేశంలోని సగం జనాభా సరాసరి వయస్సు ఇరవై అయిదు సంవత్సరాలలోపే. ఇంత పెద్దమొత్తం జనాభాకు ఉన్నత విద్యను అందించవలిసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. దానికి తగిన ముందుచూపు ప్రణాళికలు అవసరం. మరో పదిహేను సంవత్సరాల తర్వాత ప్రపంచంలో గ్రాడ్యుయేషన్ చేసే ప్రతి నలుగురిలో ఒకరు భారతీయుడు ఉంటాడు.

ప్రపంచానికి అత్యధిక ఉన్నత విద్యావంతులను ఇవ్వగలిగే శక్తి మనదేశానికే ఉన్నది. అంతటి మానవ వనరులను కలిగి ఉండటమే కాక ప్రపంచంలోనే బలమైన ఆర్థికశక్తిగా మనం ఎదగబోతున్నాం. కాబట్టి ఈ దృక్కోణంలో మన ఉన్నత విద్యలో సమూల మార్పులు తీసుకురావాలి. ఇంత మంది జనాభాకు ఉన్నత విద్యను సాధారణ పద్ధతుల్లో అందజేయడం వల్ల మన యువతకు పెద్దగా అవకాశాలు కల్పించలేం.

నాణ్యత, ప్రమాణాలు జోడించి కరికులం తయారు చేసుకోవాలి. పరిశ్రమలు, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా విభిన్నమైన ఉన్నతవిద్యా కోర్సులను రూపొందించుకోవాలి. అన్ని ఉన్నత విద్యాసంస్థలను క్రమంగా అంతర్జాతీయస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలి.

1. బోధనాభ్యసన ప్రక్రియలో నాణ్యత లేకపోవడం. దానికి ప్రధాన కారణం సగం మంది అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉండటం. వారికి అంతర్గత శిక్షణ నిర్వహించకపోవడం.
2. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా యూనివర్సిటీలు, సీట్లు లేకపోవడం.
3. గ్రామీణ, పట్టణ విద్యార్థుల మధ్య అవకాశాలను అందిపుచ్చుకొనే సామర్థ్యంలో వ్యత్యాసం.
4. పరిశోధన సామర్థ్యం, సృజనాత్మకతలో వెనకబాటుతనం. మనదేశంలో సైన్స్, ఇంజినీరింగ్‌లో ఏటా 4500 మంది పీహెడ్‌డీ, పూర్తి చేస్తే చైనాలో 30,000 మంది, అమెరికాలో 25,000 మంది పీహెచ్‌డీ పూర్తి చేస్తున్నారు.

మన రాష్ట్రంలో పరిశీలించినట్లయితే విశ్వవిద్యాలయాల అభివృద్ధిలో అసమతుల్యత స్పష్టంగా కనిపిస్తున్నది. కొత్తగా ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయాలకు నిధులివ్వక, ఉద్యోగులను నియమించక వాటిని ఇంకా పీజీ కళాశాల స్థాయికి పరిమితం చేశారు. అన్ని విశ్వవిద్యాల యాలు అధ్యాపకుల, సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నాయి. ప్రొఫెసర్ల పోస్టులు సగం ఖాళీగా ఉన్నాయి.

గత ప్రభుత్వాలు నియామకాలు రెగ్యులర్‌గా చేయకపోవడంతో ప్రొఫోసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల మధ్య సమతూకం దెబ్బతిని

యూజీసీ ఇచ్చిన నాక్‌ఏ గ్రేడు కూడా నిలుపుకోలేని పరిస్థితి వచ్చింది. యూజీసీ నిబంధనల ప్రకారం ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ పదమూడు సంవత్సరాలు పూర్తి చేస్తేనే అసోసియేట్ ప్రొఫెసర్‌గా ప్రమోషన్ పొందే అవకాశం ఉన్నది.

ఉదాహరణకు కాకతీయ యూనివర్సిటీలో ప్రస్తుతం 89 మంది ప్రొఫెసర్లు ఉంటే 2019 నాటికి అందరూ పదవీ విరమణ పొందుతారు. సైన్స్, ఇంజినీరింగ్, విద్యా శిక్షణ విభాగాల్లో ఒక్కరు కూడా అసోసియేట్ ప్రొఫెసర్ స్థాయికి పదోన్నతి పొందే అవకాశం రాబోయే ఏడు సంవత్సరాలలో ఒక్కరికి కూడా లేదు. మిగిలిన అన్ని విశ్వవిద్యాలయాల పరిస్థితి దీనికిభిన్నంగా ఏమిలేదు. రూసా, ఎన్.ఎమ్. హెచ్.ఇ.పి. వంటి సంస్థలు నిధులు ఇచ్చేటప్పుడు ఆయా యూనివర్సిటీలు, సంస్థల ప్రతిభ, పనితీరు, సిబ్బంది ఆధారంగా నిధులు పంపిణీ చేస్తాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 65:35 నిష్పత్తిలో నిధులు సమకూర్చాలి. సంస్థల గ్రేడు పడిపోతే కేంద్రనిధులు తగ్గిపోతాయి. ఆ సమస్యను ఎదుర్కోవడానికి గల ప్రత్యామ్నయ మార్గాలను అన్వేషించాలి.

ఇప్పటికే ఉన్నతవిద్యలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. దీన్ని మార్కెట్ చేసుకోవడానికి విదేశాలు ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలు మనదేశంలో అడుగు పెట్టడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నాయి.

2020 నాటికి ప్రపంచంలోనే మూడవ బలమైన ఆర్థిక శక్తిగా ఎదగనున్న భారతదేశ మానవవనరుల సంపదపై కన్నేసిన పశ్చిమ దేశాలు మనదేశంలో టెక్నాలజీ ఆధారిత విద్యను అందించాలనే సాకుతో కొలాబరేషన్‌కు ప్రయత్నాలు మొదలుపెట్టాయి. ఈ విషయంలో మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలు సరియైన అవగాహనతో ముందుకు పోవాలి. మనదేశంలో అభివృద్ధి పరిచిన సాంకేతికను జోడించి, స్థానిక వనరులను వినియోగించుకొనే రీతిలోనే ప్రణాళికలు తయారు చేసుకోవాలి.

పన్నెండవ పంచవర్ష ప్రణాళికలో ప్రతిపాదించిన అంశాలు అమలయ్యేటట్లు చూడవలసిన బాధ్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలి. రాష్ట్రాలకు విశ్వవిద్యాలయాలకు మరింత స్వయంప్రతిపత్తిని కల్పిస్తూ అక్రిడిటేషన్ వ్యవస్థను బలోపేతం చేయాలి. బోధనలో నాణ్యతను మెరుగు పరుచుకోవడానికి టీచర్ల సంఖ్యను రెట్టింపు చేయాలి.

పరిశోధనాభివృద్ధిపై పెట్టే ఖర్చును రెట్టింపు చేయాలి. మౌలిక వసతుల కల్పన, కరికులం అభివృద్ధికి తగిన స్థాయిలో నిధులు ఖర్చు చేయాలి. ఇప్పటికి నడుస్తున్న సంస్థలను అన్నివిధాల బలోపేతం చేస్తూనే, మన రాష్ట్రంలో నాలుగు పరిశోధనాత్మక విశ్వవిద్యాలయాలు, జిల్లాకు ఒకటి చొప్పున సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కేంద్రాలను, సైన్స్, టెక్నాలజీ, సామాజిక, మానవీయ శాస్త్రాల విభాగాలలో ఏర్పాటు చేయాలి.

> సమాజానికి అవసరమయ్యే సేవలు ఏమిటి? అందుకు అనుగుణంగా సేవలందించేవారిని ఎలా తయారు చేయాలి? అనే విషయంపై విద్యాశాఖకు అవగాహన ఉండాలి. ఏ వృత్తిలో ఎంత మంది అవసరం? అనే విషయాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా కోర్సులు తీసుకురావాలి. సమాజానికి అవసరమైన నర్సులు, ఉపాధ్యాయులు, మానవ వనరులను పెంపొందించే వారు, ప్రణాళికలు రూపొందించే వారు, కళాకారులు, మెకానిక్‌లు, రాజకీయ, రాజకీయేతర నాయకులు... ఇలా ఎన్నో రకాల వ్యక్తులను తయారు చేయాల్సిన బాధ్యత కూడా విద్యాశాఖదే.

## అందరికీ విద్య దిశగా అడుగులు

కుల, మత, ధనిక, పేద అనే తేడా లేకుండా, అందరూ ఒకేచోట ఉండి చదువుకునే విధంగా, ఆంగ్ల మాధ్యమంలో కేజీ టు పీజీ వరకు ఉచిత, నిర్బంధ విద్యావిధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టనుంది. నూతన రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణలో, ఎన్నికల ప్రణాళికలో చేసిన వాగ్దానానికి అనుగుణంగా, కేజీ టు పీజీ దిశగా విద్యా నమూనాను రూపొందించే దిశగా సీఎం కేసీఆర్ చర్యలు చేపట్టారు.

విద్యావ్యవస్థలో సంస్కరణలపై దృష్టిసారించారు. బాల బాలికలందరికీ ఒకే తరహా పాఠశాలల్లో, ఒకేరకమైన పరిస్థితుల్లో, విద్యాబోధన జరిగేట్లు చూడడమే ఈ విద్యావిధానం ప్రధాన ఉద్దేశం. సీఎం ప్రతిపాదించి అమలు చేయదల్చుకున్న ఈ విద్యా విధానం ఆరంభించి ముందుకుసాగాలంటే, ప్రధానంగా కావాల్సింది ఆంగ్ల భాషలో చక్కటి ప్రావీణ్యం ఉన్న ఉపాధ్యాయులు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలవుతున్న విద్యా విధానం కొంతమేరకు ఈ పథకానికి చేరువలో ఉన్నది.

కేసీఆర్ మాటల్లో చెప్పాలంటే, మొత్తం విద్యావ్యవస్థను నాలుగు భాగాలు చేసి, పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయి విద్యను ప్రాథమిక విద్యగా, ఇతర వాటిని, సాంకేతిక విద్యగా, వైద్య విద్యగా, వ్యవసాయ విద్యగా విభజించాలి. వైద్య విద్య మినహా మిగిలినవన్నీ విద్యాశాఖ నోడల్ ఏజెన్సీగా, ఒకే గొడుగు కింద పనిచేస్తే ఫలితాలు బాగుంటాయనేది కేసీఆర్ భావన. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ, వికలాంగులు, తదితర విభాగాలకు రెసిడెన్షియల్ పాఠశాలలు నడుస్తున్నాయి. ఇన్ని రకాల రెసిడెన్షియల్ పాఠశాలల

ఆవశ్యకత ఉన్నదా అనే విషయం ఆలోచించాలి. ఆ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థికి సరైన బోధన జరుగుతున్నదా లేదా అనేది ముఖ్యం.

అందరికీ ఒకే రకమైన విద్య, వసతి, సౌకర్యాలు కల్పించాలి. విద్యాశాఖ నిర్ణయించిన, ఒకే రకమైన సిలబస్ అన్ని పాఠశాలల్లో అనుసరిస్తే మంచిది. ఇంకో విషయం... ఈ పాఠశాలలకు రకరకాల పర్యవేక్షణ వ్యవస్థలు ఉండాల్సిన అవసరం ఉన్నదా అనేది. ఉదాహరణకు, గిరిజన సంక్షేమ శాఖ చేయాల్సిన పనులెన్నో ఉండగా, పలు సంక్షేమ కార్యక్రమాలు అమలుపై దృష్టి సారించకుండా, దానికి పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగించడం ఎంతవరకు సబబు? అన్ని రకాల రెసిడెన్షియల్ పాఠశాలను ఒకే ఏజెన్సీ పర్యవేక్షణలో, ఒకే గొడుగు కిందకు తేవడం మంచిదని ముఖ్యమంత్రి అభిప్రాయం.



కేజీ టు పీజీ విద్యావిధానంలో భాగంగా, బాల బాలికలకు ఎనిమిది సంవత్సరాల వయసు పూర్తి అయిన తరువాతే, అంటే, నాలుగో తరగతి పాసైన అనంతరం మాత్రమే, రెసిడెన్షియల్ పద్ధతి ద్వారా, హాస్టల్లో ఉంటూ విద్యనభ్యసించాలి. నాలుగో తరగతి వరకు తల్లిదండ్రుల సంరక్షణలోనే ఉండి, దానికనుగుణంగా, గ్రామం లేదా వారుండే నివాస ప్రాంతం స్థాయిలోనే విద్యా బోధన జరగడం శ్రేయస్కరం. ఆ తరువాతే ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యనందించాలనేది సీఎం అభిప్రాయం.

ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానంలో, ఐదవతరగతి నుంచి, ఒక్కో ఏడాది గడుస్తుంటే, ఒక్కో తరగతి ఉపసంహరించుకోవడం జరుగుతుంది. అంటే, నూతన విద్యా విధానంలో, ఐదవతరగతిలో చేరిన విద్యార్థి, పదవ తరగతిలో ప్రవేశించడానికి, ఆరేళ్లు పడుతుంది. ఇలా కొనసాగుతుంటే, ఆంగ్ల మాధ్యమంలో బోధనకు అనుకూలంగా, ఏటేటా పదవీ విరమణ చేసే ఉపాధ్యాయుల సంఖ్యను అంచనా వేసి, వారి స్థానంలో ఆంగ్లంలో ప్రావీణ్యం ఉన్న వారిని తీసుకుంటే మంచిది.

కేంద్ర ప్రభుత్వ నిధులో ఆరంభించి, దరిమిలా నిధుల కేటాయింపును నిలుపుదల చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి నిర్వహన బాధ్యతను అప్పగించిన ఆదర్శ పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా 668 వున్నాయి. వీటిల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన జరుగుతోంది. వీటితో పాటు అనేక రెసిడెన్షియల్ పాఠశాలలు కూడా రాష్ట్రంలో ఉన్నాయి. వీటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తేవాలనేది ముఖ్యమంత్రి అభిప్రాయం.

సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ఉన్నంతలో మెరుగ్గా నడుస్తున్నాయని, స్వల్ప మార్పులు అవసరమైతే చేసుకుని, అదే నమూనాలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడున్న 668కి తోడు మరో 522 స్కూల్‌లను ప్రారంభించి, మొత్తం 1190 రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఆ విధంగా, రాష్ట్రంలో ఉన్న 119 నియోజకవర్గాల్లో... నియోజకవర్గానికి సగటున 10 ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు అవుతాయి. ఈ పాఠశాలలో, ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన విద్యార్థులందరికీ ప్రవేశాలు కల్పించాలనేది ముఖ్యమంత్రి ఆశయం ప్రస్తుతం వున్న 668 మోడల్ స్కూళ్లను, శాసనసభ నియోజకవర్గాల వారీగా, సమతుల్యం పాటించే విధంగా పంపిణీ జరగాలి. అదేవిధంగా, 12వ తరగతి తరువాత కూడా ఈ విద్యార్థులు ఏయే కోర్సులు ఎంచుకుంటున్నారు? వారికి ఎలాంటి విద్య, వసతి సౌకర్యాలు కల్పించాలి? అనే దానిపై ఓ సమగ్ర విధానం రూపొందించాలి.

వైద్య విద్యా విధానాన్ని కూడా విశ్లేషించి చూడాల్సిన అవసరం ఉన్నది. చదువంటే కేవలం మెడిసిన్, ఇంజనీరింగ్ మాత్రమే అనే భావన పోవాలని ముఖ్యమంత్రి అన్నారు. సమాజానికి అవసరమయ్యే సేవలు ఏమిటి? అందుకు అనుగుణంగా సేవలందించేవారిని ఎలా తయారు చేయాలి? అనే విషయంపై విద్యాశాఖకు అవగాహన ఉండాలి. ఏ వృత్తిలో ఎంతమంది అవసరం? అనే విషయాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా కోర్సులు తీసుకురావాలి. సమాజానికి అవసరమైన నర్సులు, ఉపాధ్యాయులు, మానవ వనరులను పెంపొందించే వారు, ప్రణాళికలు రూపొందించేవారు.

కళాకారులు, మెకానిక్‌లు, రాజకీయ, రాజకీయేతర నాయకులు.. ఇలా ఎన్నో రకాల వ్యక్తులను తయారు చేయాల్సిన బాధ్యత కూడా విద్యావాఖదే. ఉదాహరణకు, తెలంగాణ రాష్ట్రంలో వివిధ స్థాయిలలో ఎన్నిక కావాల్సిన సుమారు 1,00,000 మందికి పైగా భవిష్యత్ తరం ప్రజాప్రతినిధులకు సరైన నాయకత్వ లక్షణాలు అలవరచుకునే రీతి విద్యా విధానం తయారు కావాలి. ఏ తరగతి నుంచి ఇలాంటి విద్యా బోధన జరగాలనేది ఆలోచించాలి.

ప్రస్తుతం ఉన్న డిగ్రీ కోర్సులు ఉద్యోగావకాశాలను పెంచేలా ఉండాలని ప్రభుత్వం లక్ష్యం. అంతిమంగా విద్యా విధానంలో ఈ మార్పులన్నీ చోటు చేసుకోవడం అంటే.. సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా ఆంగ్ల మాధ్యమంలో 'కేజీ టు పీజీ' వరకు ఉచిత నిర్బంధ విద్యావిధానాన్ని అమలు పరచడమే.

◆

# సుపరిపాలనకు పౌరసేవల పారదర్శకత

**ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారికి అవసరమైన సేవలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం పౌరసేవల విభాగాన్ని సమాయత్తం చేసింది. దీంతో ప్రభుత్వ యంత్రాంగంలోని సకల సేవలు, సమాచారం, పథకాల సమాచారం, అమలు, విధివిధానాలు ఎప్పటికప్పుడు ప్రజలు తెలుసుకునే వీలు కలుగుతుంది. దీంతో పౌరులు ప్రభుత్వం నుంచి సేవలు పొందే హక్కును గుర్తించినట్లయ్యింది. పౌరుల హక్కులను గుర్తించి దానికనుగుణంగా నడుచుకోవడం ప్రజాస్వామ్య మౌలిక స్వభావం. ఇది ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఒక ప్రజా ఉద్యమంగా ఈ మధ్య ముందుకు వచ్చింది.**

ఈ విధమైన ఆలోచనాసరళి నిజానికి నియో లిబరలిజం నుంచి ఉత్పన్నమైనది. ఇది మనుషులందరూ సమానులు, సమానహక్కులు, బాధ్యతలు కలిగి ఉంటారన్న తాత్వికతమై నిర్మితమైనది. మరో రకంగా చెప్పాలంటే అభివృద్ధి తాత్వికత విలువల నుంచి ఉద్భవించి






వికసిస్తున్నది. దీనిలో భాగంగానే భారత్‌లో హక్కులు, సేవలు పొందే హక్కు విషయంలో ఉద్యమ స్వభావంతోనే ప్రజాచైతన్యం ముందుకు వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా మనుషుల హక్కుల గురించి పెరిగిన చైతన్యం పరిధిలోనే మన దేశంలోనూ ఈ భావజాల ఉద్యమం పాతుకొన్నది.

అస్తిత్వంలో ఉన్న హక్కుల ముందు పౌరులందరూ సమానులే. సమానత్వాన్ని అనుభవించే హక్కు అందరికీ ఉన్నది. ఏ రూపంలో ఉన్న వివక్షనైనా వ్యతిరేకించే హక్కు పౌరులకు లభించింది. ఈ క్రమంలో నుంచే బలహీనులను, సామాజిక వెనుకబాటు తనాన్ని అనుభవిస్తున్న వారి రక్షణ సామాజిక బాధ్యత అన్న భావన ముందుకు వచ్చింది. అది పౌర విధిగా చెప్పబడుతున్నది.

ఈ నేపథ్యంలోంచే అంగవైకల్యం ఉన్నవారి, సమాజంలో వెనుకబడిన వారి బాధ్యత సామాజిక బాధ్యతగా పరిగణించబడుతున్నది. ఈ క్రమంలోనే సమాజంలో అత్యున్నత పౌరసేవలు, అధికారాలు అనుభవిస్తున్న వీఐపీ సంస్కృతికి తిలోదకాలు ఇవాతులు సమాజంలో అనుభవిస్తున్న అదనపు గౌరవం ఇతర సమాజానికి అటంకంగా, ఇబ్బందికరంగా మారకుండా చూడాల్సిన అవసరం ఉన్నది.

ప్రజాస్వామ్య నైతిక బలమంతా ప్రజల భాగస్వామ్యంలో ఉన్నదని చెబుతారు. సిద్ధాంతరీత్యా ప్రతి ఒక్కరికీ అన్ని విధాలా సమాన హక్కులు, అవకాశాలు ఉంటాయి. ఈ క్రమంలోనే సమాజంలోని ప్రతి పౌరుడూ ప్రభుత్వ పాలనా యంత్రాంగంలోని ఉన్నతాధికారులు, నేతలు అనుభవిస్తున్న అదనపు సేవలు, సౌకర్యాల గురించి పట్టించుకోవాలి. ఆలోచించాలి.

అలాగే ప్రజల సేవకులుగా వారు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారా లేదా అన్నది కూడా చూడాలి. నిజమైన అర్థంలో ప్రజలకు అనుకూలంగా ప్రజలకు అందుబాటులో పాలన సాగుతుంది అనడానికి పౌరులకు అన్నిరకాల సేవలు అందుబాటులో ఉన్నాయా లేదా? అన్నది అత్యంత ముఖ్యమైనది. పౌరులకు సేవలందించడం ప్రభుత్వ ధర్మంగా గుర్తించడం. ఇది వివిధ దేశాల్లో వివిధ రూపాల్లో ఉన్నా అంతిమ

సారంలో పౌరసేవలు అన్ని విధాలుగా ఎల్లవేళలా అందరికిఅందుబాటులో ఉండటంగా చెప్పుకోవాలి.

పౌరచట్టాలు, హక్కులు ప్రజలందరికీ అందుబాటులో ఉండి వారి బాగుకోసం వినియోగంలో ఉన్నట్లయితే ప్రజలందరికీ అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండాలి. సమాచారం పొందే హక్కు ఉండాలి. వినియోగదారుడి హక్కులు పరిరక్షించబడాలి. అలాగే ప్రభుత్వ పాలనా వ్యవహారాలన్నింటిలో ప్రజలకు అందాల్సిన సేవలన్నీ అందాలి. లేనట్లయితే.. అది నిజమైన ప్రజానుకూల ప్రజాస్వామ్య పాలన అని చెప్పడానికి లేదు.

1990 వ దశకంలో చాలా దేశాల్లో సిటిజన్స్ చార్టర్ పేరిట పౌర సేవా పత్రాలు అమలులోకి వచ్చాయి. ఇది మొదట బ్రిటన్‌లో ప్రారంభమై కామన్‌వెల్త్ దేశాలలో, ఇతర దేశాలలో విస్తరించింది. దీంతో పాలనా యంత్రాంగం నుంచి పౌరులు తమకు అవసరమైన సమాచారం, అవసరమైన పత్రాలు పొందేది హక్కుగా సంక్రమించింది. దీంతో ప్రజలకు అవసరమైన పత్రాలు సకాలంలో అందడమేగాక, పాలనలో పారదర్శకత చేకూరింది.

కాలక్రమంలో ఇదే ప్రజల భాగస్వామ్యం, ఎంపిక, సంప్రదించడం, ప్రజామోదం లాంటి వాటికి విస్తరించింది. మరికొన్ని దేశాలు కూడా ఈ చార్టర్స్‌ను అమలులోకి తెచ్చాయి. బ్రిటన్‌లో పబ్లిక్ సర్వీసెస్ పేరుతో అమలులోకి తీసుకొచ్చారు. భారత్‌లో కూడా ప్రజా చైతన్యంతో ఇది అమలులోకి వచ్చింది. ఈ క్రమంలోనే మిగతా ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుసుకోవడం అవసరం.

సేవలు పొందే హక్కును గుర్తించినప్పుడు, తప్పకుండా నిర్దేశించిన సమయంలోనే పౌరుడు కోరిన సేవలు అందించాలి. ఇది పౌర పాలనకు ప్రతిబింబంగా ప్రజలకు సేవకులుగా ఉద్యోగుల పనితీరును ప్రతిబింబిస్తుంది. ఎవరైనా సరియైన విధంగా, అనుకున్న సమయంలో సేవలు అందించనట్లయితే అతను శిక్షార్హుడుగా పరిగణించబడతాడు. దీంతో అనివార్యంగా పాలనా విధానంలో పారదర్శకత వేళ్లూనుకుంటుంది. జవాబుదారీతనం పెరిగి అవినీతి, బాధ్యతా రాహిత్యం అంతమవుతుంది. సమాచారహక్కు ప్రజలకు తగిన సేవలు అందడానికి ఆయుధంగా పనిచేస్తుంది.

చట్ట సభలు పాలనా విధానాలను ప్రజల ముంగిటకు తేవడంలో కీలకంగా పనిచేస్తాయి. ఇవే మంచి పాలనకు మొదటిమెట్టుగా ఉంటాయి. ఈ క్రమంలోనే 'బాధ్యతాయుత పాలనావిధానానికి చేపట్టాల్సిన కర్తవ్యాలు' అన్న అంశంపై 1997లో రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలోంచే బాధ్యతాయుత పాలనకు పౌరసేవల హక్కును అన్నిరాష్ట్రాల ప్రభుత్వాలు గుర్తించాయి.

ఈ క్రమంలోంచే దశాబ్దకాలంలో వివిధ పౌర, స్వచ్ఛంద సంఘాలు వందకు పైగా సిటిజన్ చార్టర్స్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విడుదల చేశాయి. ఇవన్నీ స్వచ్ఛందంగా ప్రకటించుకున్న విలువలుగానే



గుర్తించాలి. ఈ ఒరవడిలోనే మధ్యప్రదేశ్ ప్రభుత్వం మొదటిసారి 2010లో రైట్ టు సర్వీసెస్ యాక్ట్‌ను తెచ్చింది. ఆ తర్వాత బీహార్ కూడా 2011లో తీసుకొచ్చింది. ఆ తర్వాత కాలక్రమంలో దేశంలోని రాష్ట్రాలన్నీ పౌరసేవల చట్టాన్ని అమలులోకి తెచ్చాయి.

గుజరాత్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, కేరళ, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాలన్నీ సిటిజన్ చార్టర్‌ను గుర్తించినట్లు ప్రకటించాయి. కానీ చాలా రాష్ట్రాల్లో అనుకున్న స్థాయిలో అమలుకు నోచుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

చాలా రాష్ట్రాల్లో ఇది కొన్ని పౌరసేవలకే పరిమితమై ఉన్నది. జనన నమోదు పత్రం, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఓటర్ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు లాంటివి పొందేందుకు ఉపయోగపడుతున్నాయి. కర్ణాటక రాష్ట్రంలో సకల సర్వీసెస్ యాక్ట్‌పేరుతో సిటిజన్స్ యాక్ట్ 2011లో అమలులోకి వచ్చి ప్రజలకు సంబంధించిన సకల సేవలను అందుబాటులోకి తెచ్చింది. దేశంలోకెల్లా ఆదర్శంగా పౌరులకు 151 సేవలను అందుబాటులోకి తెచ్చింది.

ఇందులో భాగంగా 11 ప్రభుత్వ విభాగాలను సిటిజన్స్ చార్టర్ పరధిలోకి తేవడంతో ప్రజలకు మెరుగైన సేవలు సత్వరంగా అందుతున్నాయి. నిజానికి పౌరసేవల చట్టం నిజమైన అర్థంలో అర్థవంతంగా పనిచేస్తూ... సకాలంలో ప్రభుత్వ సేవలు అందుతున్నాయి.'రైట్ టు సర్వీస్' అనేది పౌరులకు సరైన సమయంలో ఆలస్యం లేకుండా ప్రభుత్వ సేవలు అందడంగా చెప్పుకోవచ్చు. సేవలు అనుకున్న విధంగా ప్రజలకు అందుబాటులో ఉంటే.. ప్రభుత్వ పాలన కూడా అదే మోతాదులో ప్రజలకు అందుబాటులో ఉన్నదని అర్థం. ఇది ప్రజలను వృథా సమయాన్నుంచి రక్షిస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండే లొసుగులు, అవినీతి, బాధ్యతా రాహిత్యాల నుంచి ఉత్పన్నమయ్యే సమస్యలనుంచి ప్రజలను దూరం చేస్తుంది. బాధ్యతాయుత, పారదర్శక పాలనకు మొదటి షరతుగా నిలుస్తుంది.

*- డాక్టర్ ఎస్. కృష్ణ*

**ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994, మే 30-1994 నుండి అమలులోకి వచ్చింది. ఇందులో 278 సెక్షనులు (8) భాగాలుగా స్థానిక ప్రభుత్వాలైన గ్రామపంచాయతీ, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజాపరిషత్ పరిపాలన విధానం, నియమ నిబంధనలు రూపొందించబడినది.**

ఇందులో సెక్షన్ 3 నుండి 147 వరకు మరియు సెక్షను 263 వరకు గ్రామపంచాయతీలకు వర్తిస్తాయి. చట్టంలో రూపొందించిన ఈ సెక్షనుల ఆధారంగా నిబంధనలకు లోబడి ప్రజల భాగస్వామ్యంతో సుపరిపాలన, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే గురుతర బాధ్యత సర్పంచులపై మరియు కార్యదర్శులపై గలదు.

అందులో భాగంగా గౌరవ సర్పంచులు మరియు కార్యదర్శులు గ్రామపంచాయతీ సుపరిపాలన జరుగటానికి ఏ ఏ మాసాలలో ఏ ఏ పనులు చేయాలి అనే విషయం సూచించారు.



# గ్రామపంచాయతీలో సర్పంచులు మరియు కార్యదర్శులు నెల వారీగా చట్ట ప్రకారంగా తప్పక చేయవలసిన విధులు



## జనవరి

- ✳ పన్నుల వసూలు కార్యక్రమాన్ని ముమ్మరంగా సాగించుట.
- ✳ సంతలు, రేవులు, బండ్లు, బస్సులు ఆగే స్థలాలను, చెట్ల ఫల సాయం తప్ప మొదలైన వాటిని సంబంధించి రాబోవు సంవత్సరం కౌలు హక్కును వేలం నోటీసు ప్రకటించిన పిమ్మట వేలం వేయడం, అన్ని రకాల వేలాలు, పంచాయతీ విస్తరణాధికారి సమక్షంలోనే జరపాలి.
- ✳ ప్రస్తుత సంవత్సర కౌలుదారులు ఎవరైనా ఏదైనా బాకీ పడినట్లైతే అట్టి బాకీని పూర్తిగా వసూలు చేయుట.
- ✳ బాకీ చెల్లించని వారిని కౌలు నుండి తొలగించి రుసుంలు పంచాయతీ ద్వారా కాని తిరిగి వేలం వేయడం ద్వారా గానీ మార్చి నెల 31వ తేదీ నాటికి వసూలు చేయడం.
- ✳ అపాయకరమైన వృత్తి వ్యాపారుల జాబితాలు తయారుచేయడం.

## ఫిబ్రవరి

- ✳ పన్నులు చెల్లించని వారిపై జప్తు జరుపడానికి ప్రయత్నించుము.
- ✳ జప్తును ఆటంక పరిచే వారిపై ప్రాసిక్యూషన్ దాఖలు చేయటం.
- ✳ బాకీ పడిన కౌలుదారులపై, పన్నులు కట్టని వారిపై సివిల్ దావాలు వేయించటం.
- ✳ రాబోవు సంవత్సరం కౌలు హక్కుల వేలం పాటలను పంచాయతీచే ఆమోదింపజేసి కౌలుదారుల నుండి నిర్ణయించిన డిపాజిట్‌లు వసూలు చేసి అగ్రిమెంట్లు వ్రాయించుకోవటం.
- ✳ వసూలు చేయడానికి వీలులేని పన్నుల జాబితా (తక్తా) తయారుచేసి అట్టి పన్నులు బకాయిపడిన వారికి పంచాయతీ ప్రాంతంలో జప్తు చేయదగ్గ చరాస్థులు ఏమీలేవని నిర్ధారణ చేసుకొనటం.
- ✳ అపాయకరమైన వ్యాపారాలు నడిపే వారి నుండి ఫీజు వసూలు చేసి వారి లైసెన్సులు రెన్యూవల్ చేయటం.

## మార్చి

- ✳ పన్నుల వసూళ్ళను నూటికి నూరు పాళ్ళు, మొండి పద్దుల విషయమై ప్రాసిక్యూషన్ గాని సివిల్ దావా గానీ దాఖలు చేసి పన్నులు రాబట్టాలి.
- ✳ ఏప్రిల్ నెలలో జరుగబోయే గ్రామసభకు ఏర్పాట్లు చేయాలి.
- ✳ అభివృద్ధి పనులు నిర్వాహణను పూర్తి చేయాలి.
- ✳ ప్రభుత్వం నుండి రావలసిన గ్రాంట్లను పంచాయతీ ఖాతాకు జమ చేయించుకోవాలి.
- ✳ పంచాయతీ చెల్లించవలసిన అప్పుల తాలూకు వాయిదా సొమ్మును ట్రెజరీలో సరియైన పద్దుకు జమ చేయించాలిజ
- ✳ సంవత్సరాంతం గడువు లోగా గ్రాంట్లను పూర్తిగా వినియోగించుకోవాలి.




### ఏప్రిల్

* గత సంవత్సరపు లెక్కలను ముగించి ఈ సంవత్సరానికి కొత్త లెక్కలను ప్రారంభించాలి.
* ఇంటిపన్ను డిమాండ్ తయారు చేయించాలి.
* అక్రమ నిర్మాణాల తనిఖీ చేసి జాబితాలను సరిచేయాలి.
* పరిపాలనా నివేదికను తయారు చేయించాలి.
* గ్రామసభ జరిపించాలి.

### మే

* ఇంటి పన్ను డిమాండ్ బిల్లులు యజమానులకు అందజేయాలి.
* లైసెన్సు పొందకుండా వ్యాపారాలు సాగిస్తున్న వారిపైన, మిల్లు యజమానుల పైన ప్రాసిక్యూషన్లు దాఖలు చేయించాలి.
* పరిపాలనా నివేదికను పంచాయతీచే ఆమోదింపజేసి పంచాయతీ విస్తరణాధికారి గారికి పంపాలి.

### జూన్

* అక్రమ నిర్మాణాల జాబితా పూర్తి చేసి వాటిలో అభ్యంతరకమైన వాటిని తొలగించడానికి మిగిలిన వాటి నుండి రుసుములు వసూలు చేయడానికి గ్రామపంచాయతీ ఆమోదం పొందాలి.
* జూలైలో నిర్వహించే సభకు ఏర్పాట్లు చేయాలి.

### జులై

* అభివృద్ధి పనులకు పంచాయతీ మంజూరీ పొంది అంచనాలు తయారు చేయడానికిగాను తీర్మానముతో ప్రతిపాదనలు పంపుట.
* పంచాయతీ స్థలాలలోను పంచయితీకి చెందిన పోరంబోకు భూములలోను, చెరువు గట్లపై ఫలసాయం ఇచ్చే చెట్లను నాటించాలి.
* చెరువులలో మంచి రకపు చేప విత్తనాలను వేయించటానికి మత్స్య శాఖ వారిని సంప్రదించాఇం.
* గ్రామసభ జులై 1వ తేదీన నిర్వహించాలి.

### ఆగష్టు

* అభివృద్ధి పనులకు అంచనాలు స్వీకరించి పంచాయతీచే పరిపాలన మంజూరీ చేయించాలి.
* పనుల నిర్వహణకు టెండర్లు పిలవాలి.

### సెప్టెంబర్

* పనులకు సంబంధించిన టెండర్లను సక్రమంగా పరిశీలించి పంచాయతీ ఆమోదాన్ని పొందాలి.
* అక్టోబర్‌లో జరిగే గ్రామసభకు ఏర్పాట్లు చేయాలి.

### అక్టోబర్

* గ్రామసభ జరిపించాలి..
* అభివృద్ధి పనులకు సంబంధించిన వర్కు ఆర్డర్స్ జారీ చేయుము.

### నవంబర్

* ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇతర కార్యక్రమాల నిర్వహించాలి.
* బడ్జెట్ అంచనాలు గ్రామపంచాయతీ ఆమోదమునకు సమర్పించాలి.

### డిసెంబర్

* పంచాయతీకి కావలసిన పుస్తకాలకు ఫారాలకు ఇండెంట్లు పంపాలి.
* పన్నులు వసూలు కార్యక్రమం ముమ్మరం చేయాలి.
* గ్రామపంచాయతీ ఆమోదించిన బడ్జెటు అంచనాలు 25 డిసెంబరు లోపల డివిజినల్ పంచాయతీ అధికారికి పరిశీలన నిమిత్తం సమర్పించాలి.

పైన చూపబడిన సూచనలను పాటించి గ్రామాభివృద్ధికి కృషి చేయగలరని సమస్త సర్పంచులను కోరనైనది.

– *బి. లింబగిరిస్వామి,* సిడిపిఒ



# పేదల సొంత ఇంటికల రెండు పడక గదుల ఇళ్ళు

**తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇళ్ళు లేని మరియు నిరుపేద కుటుంబాల వారికి, దారిద్ర్యరేఖకు దిగువన ఆహారభద్రత కుటుంబ సరఫరా కార్డు కల్గి ఉన్నవారికి రెండు పడకగదుల ఇళ్ళ నిర్మాణం చేయటానికి కృతనిశ్చయముతో ఉంది.**

కనీస అవసరాలైన కూడు, గుడ్డ, నీడ అని నినాదమే కాకుండా, ప్రజలకు అవి ఎంత అవసరమో అందరికి తెలిసినదే కదా! మన ప్రాంతం పూర్వం ఉమ్మడి కుటుంబాలుగా ఉండేవి. ఆ ఉమ్మడి కాస్త నేడు అవసరాల నిమిత్తం, వృత్తి ఉద్యోగాల నిమిత్తం చాలీచాలని సంపాదనతో, పట్టణబాట పట్టడంతో అధిక జనాభా వలన ఆదాయ వనరులు గృహవనరులు చాలాకుండా అయ్యాయి. ప్రజల్లో అవగాహన పెరిగి విద్య, ఉపాధి అవకాశాల కోసం పట్టణ ప్రాంతాల వైపు ప్రజలు పరుగెడుతున్నారు.

అలాంటి పరిస్థితుల్లో వలసలు పెరిగి గృహ వసతి సరిగా లేక సరిపోవటం లేదు, సొంత ఇల్లు కొనుగోలు శక్తి పేద వర్గాలకి లేదు ధరలు ఆకాశన్నంటుతున్నాయి. అందుబాటులో లేని ధరలలో పేద, నిరుపేద, బడుగు వర్గాల వారు కొనలేకపోతున్నారు.

అందుకొరకే అలాంటి వారిని గృహ సమస్యల నుండి దూరం చేసి సొంత గూడు కల నెరవేర్చుటకు తెలంగాణ ప్రభుత్వం రెండు పడకల గదుల నిర్మాణ పథకం చేపట్టింది.

### దీనికి లబ్ధిదారుల ఎంపిక విధానం – అర్హతలు

పేద, నిరుపేద వర్గాల వారై ఉండి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి కుటుంబ ఆహార భద్రత కార్డు కల్గిన వారై ఉండాలి.

☆ కుటుంబ యజమాని భార్య పేరున ఇల్లు మంజూరీ ఇస్తారు.

☆ ఇల్లు లేని వారై ఉండి కిరాయి ఇంటిలో నివసిస్తున్న వారు గుడిసెలలో కచ్చా ఇళ్ళల్లో నివసిస్తున్నవారు అర్హులు. స్థానికులై ఉండి అన్ని ఆధార పత్రాలు కలిగి ఉండాలి.

☆ ఎస్.సి./ఎస్.టి. మైనారిటి కులాల ప్రాతిపదికన అర్హత కల్గిన ఎస్.సి./ఎస్.టి. మైనారిటి ఆధారంగా ఎంపిక ఈ క్రింది విధంగా ఎంపిక చేస్తారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఎస్.సి లకు, ఎస్.టి.లకు 50%, మైనారిటీలకు 7%, మధ్యతరగతి వారికి ఇతరులకు 43% పట్టణప్రాంతాల వారికి ఎస్.సి.లకు 17%, ఎస్.టిలకు 6%, మైనారిటీలకు 12%, మిగిలిన ఇతరులకు 65% కేటాయించాలని ప్రతిపాదించారు.

స్థల నిర్ణయం కోసం జిల్లా కలెక్టర్ గ్రామ, మున్సిపాలిటిల పరిధిలో ఇళ్ళ నిర్మాణం కోసం స్థలం ఎంపిక చేస్తారు. గ్రామప్రాంతాల్లో వ్యక్తిగత గృహాల నిర్మాణం కోసం 125 చ.అడుగులు ఉండాలి. ఒక వేళ స్థలం కొరత ఉంటే జి+1 నిర్మాణం కోసం సిఫారసు చేస్తారు ఇవి మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేస్తారు. పట్టణ ప్రాంతంలో అయితే జి+ పద్ధతిలో గ్రేటర్ హైద్రాబాద్ మున్సిపాలిటి ప్రాంతంలో బహుళ అంతస్తులను నిర్మాణానికి అనుమతి ఇవ్వవచ్చును.

ఇళ్ళ నిర్మాణం కేటాయింపులో విభిన్న ప్రతిభావంతుల కోసం గ్రౌండ్ ఫ్లోర్ ఇళ్ళను కేటాయిస్తారు. ఇలా పేదల సొంత ఇంటికల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చుతుంది.

**– జి. రామేశ్వరరావు**

*జిల్లా శిక్షణా మేనేజరు, రంగారెడ్డి*

# అన్నార్తుల ఆపన్నహస్తం 5 రూపాయల భోజనం




**అన్నం పరబ్రహ్మ స్వరూపం, కూటికోసం కోటిపాట్లు 'కోటి విద్యలు కూటి కోసమే' అనే సామెతలు మనం వినే ఉంటాము.**

**'తిండి కలిగితే కండ కలుగునోయ్' అని గురుజాడ కవిత కూడా విన్నాము.**

**మనుష్యులుకైనా, జంతువులుకైనా గాలి, నీరు తరువాత తిండి అత్యవసరం. ప్రాణాలు నిలుపుకోవడానికి ఆరోగ్యంగా బ్రతకడానికి ఆహారం కావాలి.**

ఈ హైదరాబాద్ మహానగరంలో ఎవరి జీవితం వారిది. ఎవరి బ్రతుకు వారిది. ఎవరి కష్టం వారిది. ఈ మహానగరంలో ఎవరికెవరో.. అయినవాళ్ళే అవసరానికి మొహం చాటేసే కాలమిది. ఉన్నవాడికీ పూట గడవటం కష్టమవుతున్న రోజులు ఇవి. మరి ఇక లేనివాళ్ళ పరిస్థితి ఏమిటి? బడుగు జీవులకు రోజుకొకపూటైనా కడుపునిండా రుచికరమైన భోజనం దొరికే పరిస్థితి కూడా లేదు. అలాంటి బడుగు జీవులు కోసం ఈ మహానగరంలో 5 రూపాయల కే రుచికరమైన భోజనం లభిస్తుంది.

సాధారణంగా 5 రూపాయలకు బహిరంగ మార్కెట్లలో తినేందుకు ఏమొస్తుంది. బన్, కాక హోటల్‌లో టీ లేక ఒక సమోసా. కాని తెలంగాణా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరంలో 5 రూపాయల కే భోజనం దొరుకుతుంది. నిరాశ్రయులైన నిరుపేదల ఆకలిగొన్న వారికి కనీసం ఒక్కపూటైనా కడుపునిండా నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సహాయంతో హైదరాబాద్ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ (జి.హెచ్.ఎం.సి) 5 రూపాయల కే భోజనం అందిస్తుంది. ఈ పథకం గత సంవత్సర కాలంగా మహానగరంలో దిగ్విజయంగా అమలు జరుగుతుంది. రోజూ దాదాపు 15 వేలకు పైగా ప్రజలు ఈ పథకం ద్వారా తమ ఆకలిని తీర్చుకుంటున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాతో 2014 మార్చిలో అప్పటి గ్రేటర్ మునిసిపల్ కార్పోరేషన్, హరేకృష్ణ పౌండేషన్ సహకారంతో 5 రూపాయలకే భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. ముఖ్యంగా ఆహారభద్రత కింద సబ్సిడి ధరలకే బియ్యం గోధుమలు వంటివి ప్రభుత్వం ద్వారా పంపిణీ అవుతున్నప్పటికీ గ్రేటర్ పరిధిలోని ప్రజలు వాటిని వినియోగించకోకపోవడం వల్ల చాలామంది సరైన భోజనం చేయలేకపోతున్నారు.



ఈ తరుణంలో గ్రేటర్ పరిధిలోని నిరుపేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. మొదట ఒకే ఒక కేంద్రంతో ప్రారంభమైన ఈ పథకం ఇప్పుడు అంచెలంచలుగా పెరుగుతూ దాదాపు 45 కేంద్రాలకు చేరుకుంది. ప్రధాన ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు, బస్టాండ్లు, రోజువారి కూలీలు ఎక్కువగా ఉండే అడ్డాలతోపాటు ప్రధాన కూడళ్లలో కార్మికుల అడ్డాలు మొదలగు ప్రదేశాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు.




రోజు మధ్యాహ్నం 12 గంటల నుండి 1 గంట వరకు ఎంపిక చేసిన కేంద్రాలలో మధ్యాహ్నభోజనం అందుబాటులో ఉంచుతారు. 450 గ్రాములు ఉండే ఒక కప్పు అన్నం, 100 గ్రాములు పప్పు లేక కూర, సాంబార్, పచ్చడి అందజేస్తారు. ఒక్కోరోజు పులిహోర, అరటిపండు కూడా అందించడం జరుగుతుంది.

పటాన్‌చెరువు వద్ద ఉన్న హరేకృష్ణ ఫౌండేషన్‌కు చెందిన అత్యాధునిక కిచెన్‌లో నాణ్యమైన భోజనాలు తయారు చేసి సమయానికి అన్ని కేంద్రాలకు ప్రత్యేక వాహనాలు ద్వారా చేర్చి హైదరాబాద్ గ్రేటర్ పరిధిలో పలు ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా రుచికరమైన స్వచ్ఛమైన భోజనాన్ని అందించడం జరుగుతుంది. ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు అనే బేధం లేకుండా వెళ్ళిన ప్రతి ఒక్కరికీ భోజనం అందించడం జరుగుతుంది.

నిజానికి ప్రభుత్వానికి ఒక్కో భోజనానికి రూ. 22.50 పైసలు ఖర్చు అవుతుంది. కాని లబ్ధిదారులు నుండి కేవలం 5 రూపాయలు మాత్రమే వసూలు చేసి వారికి భోజనం అందిస్తుంది. ఈ 22.50 పైసలలో రూ. 2.50 పైసలు హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ట్రస్టు భరిస్తుండగా, మిగిలిన 15 రూపాయలు ప్రభుత్వం తరుపున గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జి.హెచ్.ఎం.సి) భరిస్తుంది.

ఈ పథకంలో ప్రజలు భాగస్వామ్యం చాలా అవసరం. అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని మన పురాణాలు చెబుతున్నాయి ఆస్తిపాస్తులు ఎన్ని ఇచ్చినా ఇంకా కావాలన్న ఆశ చావదు. కాని సుష్టుగా భోజనం చేశాక ఇక చాలు అని సంతృప్తిగా చెప్పే మాట ఒక్క అన్నదానానికే చెల్లుతుంది. ఆకలితో ఉన్నవాడికి సూక్తులు కన్నా పిడికెడు ముద్దపెడితే చాలు అన్న మహానుభావుల మాటలను నిజం చేస్తుంది తెలంగాణ ప్రభుత్వం.

ఈ పథకంలో ప్రజలు భాగస్వామ్యం చాలా అవసరం. ఈ కార్యక్రమంలో పాలుపంచుకునేందుకు దాతలు ముందుకు రావాలి ప్రజలు ఇప్పుడున్న పాస్ట్ కల్చర్‌లో పుట్టినరోజులకని, పెళ్ళి మరియు ఇతర పార్టీలకని నేటితరం వేలకు వేలు డబ్బు వృధాగా ఖర్చు చేస్తున్నారు. ఆ డబ్బు ద్వారా జన్మదినాలకు పర్వదినాలకు ఏదేని ఒక కేంద్రం ద్వారా ఒక రోజు భోజనానికి అయ్యే ఖర్చు భరించవచ్చు. దీని ద్వారా డబ్బు వృధా కాకుండా ఆకలితో అలమటించే వారికి ఆపన్నహస్తంగా నిలుస్తోంది. అన్నార్తుల ఆకలి మంట చల్లారుతుంది.

ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు అన్నంపెట్టే ఆలోచన నేటితరంలోని ప్రతి పౌరునికి రావాలి. ప్రతి ఒక్కొరూ ఇట్టి కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా భావించాలి.

తెలంగాణ ప్రభుత్వం పేదల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని వారి కడుపు నింపే పథకం ప్రారంభించడం ఎంతో హర్షించదగ్గ విషయం. మానవీయ కోణంలో, సామాజిక బాధ్యతతో భవిష్యత్‌లో కూడా ప్రజలకు చేరువయ్యే రీతిలో అనేక పథకాలు ప్రభుత్వం చేపట్టాలని ఆశిద్దాం.

***– ఎం. ప్రదీప్ కుమార్***
*రీసెర్చ్ అసోసియేట్, టి.సిపార్డ్*

# పేదల కలల సాకారం 'కళ్యాణ లక్ష్మి'

**తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అత్యంత ప్రతిష్టాత్మకంగా అనేక కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను తెలంగాణలో ప్రారంభించటం జరిగింది. నిరుపేదల కోసం అనేక సంక్షేమ, పేదరిక నిర్మూలన పథకాలను అంటే నిరుపేదలైన యస్.సి., యస్.టిలకు మూడు ఎకరాల భూ పంపిణీ, రెండు పడకల ఇళ్ళు, యస్.సి, యస్.టి, మరియు మైనార్టీ యువతుల వివాహాల కోసం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి అనేక పథకాలను ప్రారంభించటం జరిగింది.**



ఈ సంక్షేమ పథకాల్లో భాగంగా ముఖ్యమంత్రి ఆలోచనలో 'మానస పుత్రికగా' పిలవబడుతున్న 'కళ్యాణలక్ష్మి' పథకం నిరుపేదలైన షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన నిరుపేదలైన యువతుల వివాహానికి ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ప్రవేశపెట్టటం జరిగింది.

తెలంగాణ రాష్ట్రంలోని జనాభాలో అత్యధిక శాతం యస్.సి, యస్.టిలు నివసిస్తున్నారు. వీరు అనాదిగా పేదరికంలో మగ్గుతూ దారిద్ర్యాన్ని అనుభవిస్తూ, కనీసం పూట గడవక నానా అవస్థలు పడుతూ, పిల్లలకు సరైన పోషణ, విద్యను అందించలేక వారిని కూడా తమతో పాటు ఏదో ఒక వృత్తిలో చేర్పించి జీవనాన్ని గడుపుతున్న అనేక మంది యస్.సి, యస్.టి తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక శాతంగా ఉన్నారు. ఇలాంటి వారు నిరంతరం పేదరికంతో పోరాడుతూనే వున్నారు.

ఇలాంటి జీవనం గడుపుతూ తమ ఆడపిల్లలను పెంచి పెద్ద చేసి వారికి వివాహాలు చేయడమనేది వీరికి అత్యంత ఆర్థిక భారంగా పరిగణించబడుతుంది. అటు కుటుంబ పోషణ, ఇటు ఈడుకువచ్చిన ఆడ పిల్లలకు వివాహాలు చేయడానికి వారికున్న ఆర్థిక స్థోమత సరిపడక అనేక అవస్థలు పడుతూ దళారులు, మధ్యవర్తుల వద్ద అప్పులు చేస్తున్నారు. తిరిగి వాటిని తీర్చలేక ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో కొంతమంది వివాహ ఖర్చులు భరించలేక వారికి మేనరికం చేయడానికి ఇష్టపడుతున్నారు. దీనివల్ల వారికి పుట్టబోయే పిల్లలు కొంతమేర జన్యులోపాలతో జన్మిస్తున్నారు.

మన భారతీయ సాంప్రదాయంలో వివాహ వేడుకకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. ఈ వివాహ వేడుక అనేది ఎంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తే అంత గొప్పగా సమాజంలో గుర్తింపు ఏర్పడుతుందని నమ్మకం. దాంతో వివాహ వేడుకలకు అదనపు ఖర్చులు చేయటంతో అనేక కుటుంబాలు అప్పులపాలై వీధులలో పడినవారు కూడా ఉన్నారు. ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగా వున్నప్పటికీ వివాహ వేడుకలకు ఖర్చు ఎక్కువగా పెడుతున్నారు.

ఇలాంటి పరిస్థితులను అంచనా వేసిన ముఖ్యమంత్రి వీరికి ఆర్థికంగా సహాయం చేసే ఉద్దేశంతో 'కళ్యాణ లక్ష్మి' అనే నూతన పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ముఖ్య ఉద్దేశం 18 సంవత్సరాలు నిండిన దళిత, గిరిజన కుటుంబంలోని అమ్మాయి వివాహానికి రూ. 51,000 మంజూరు చేస్తారు. ఈ పథకాన్ని 2014 అక్టోబర్ 02 నుంచి తెలంగాణ రాష్ట్రంలో అమలులోనికి తీసుకువచ్చారు.

ఈ ఆర్థిక సహాయం విషయంలో ఆలస్యం కాకూడదనే ముఖ్య ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'కళ్యాణ లక్ష్మి' పథకాన్ని గ్రీన్ ఛానల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరించటం జరుగుతుంది. దీనివల్ల ఈ పథకంలోని లోపాలు, అవకతవకలకు అడ్డుకట్టవేయటం జరిగింది.

ఈ ఆర్థిక సంవత్సరం 2015-16 ఈ కళ్యాణలక్ష్మి పథకానికి యస్.సి.లకు రూ. 150 కోట్లు, యస్.టి.లకు రూ. 80 కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. అదే విధంగా ఇప్పటి వరకు 2015-16 సంవత్సరానికి గాను 19,328 మంది లబ్ధిదారులకు రూ. 98,573 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించగలిగింది.



## ఎవరు ఈ పథకానికి అర్హులు

*యస్.సి/యస్.టిలకు మాత్రమే:*

- ☆ తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు మాత్రమే ఈ పథకానికి అర్హులు.
- ☆ దరఖాస్తు దారులు యస్.సి, యస్.టి, సామాజిక వర్గానికి చెందిన వారై ఉండాలి.
- ☆ వీరి కుటుంబ వార్షిక ఆదాయం రూ. 2,00,000 మించరాదు.
- ☆ తప్పనిసరిగా అమ్మాయి వయస్సు వివాహ సమయానికి 18 సంవత్సరాలు నిండి వుండాలి.
- ☆ ఈ పథకం అమలులోనికి వచ్చిన నాటి నుంచి జరిగే వివాహాలకే ఈ పథకం వర్తిస్తుంది.
- ☆ ఏదైన ఇంటర్‌నెట్ కేంద్రాలు లేదా 'మీ సేవా' కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.

పైన పేర్కొన్న అర్హతగలిగిన వారు వివాహానికి నెల రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటుగా ఈ క్రింద తెల్పిన ధృవ పత్రాలను జత చేయవలసి వుంటుంది. అవి–

- ☆ వధూవరుల వయస్సు ధృవీకరణ కోసం పదో తరగతి మెమో (చదువుకున్న వారైతే) దరఖాస్తుతో జతపరచాలి. ఒకవేళ చదువుకోని వారైతే తమ పుట్టిన తేది ధృవీకరణ పత్రం (Birth Certificate) జత చేయాలి.
- ☆ కుల ధృవీకరణ పత్రాన్ని తప్పక జత చేయాలి
- ☆ ఆదాయ ధృవీకరణ పత్రం.
- ☆ నివాస ధృవీకరణ పత్రం (వివాహం జరిగే తేది నాటికి 'మీ సేవా' ద్వారా సంబంధిత అధికారి జారీ చేసినదై వుండాలి).
- ☆ వధూవరుల ఇరువురి ఆధార్ కార్డు.





- ☆ బ్యాంకు ఖాతా (వధువు పేరు మీద జారీ చేసిన ఏదైనా జాతీయ బ్యాంకు ఖాతా).

ఒకవేళ వివాహ సమయానికి పైన తెల్పిన పత్రాలను అందచేయలేని పక్షంలో వివాహ అనంతరం కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. అలా దరఖాస్తు చేసుకునే వారు పైన తెల్పిన ధృవ పత్రాలతో పాటుగా వారి వివాహనికి సంబంధించిన శుభలేఖ, పెళ్లికి సంబంధించిన ఐదు ఫొటోలు, మరియు సంబంధిత అధికారులు జారీ చేసిన వివాహ ధృవీకరణ పత్రం తప్పక జతపర్చాలి.

పైన తెల్పి అన్ని ధృవ పత్రాల ఆధారంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన తర్వాత సంబంధిత ప్రింటెడ్ కాపీని గెజిటెడ్ అధికారిచే సంతకం చేయించిన తర్వాత జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో అందచేయాలి.

అయితే మన తెలంగాణ రాష్ట్రంలో యస్.సి, యస్.టి జనాభా అధిక శాతం పేదరికంతో మగ్గుతూ, ఆర్థిక జీవనం దుర్లభంగా ఉండటం, కొంతమంది ఆడపిల్లల వివాహ వేడుకలు చేయలేక, ఆ ఆర్థిక భారాన్ని మోయలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వాటిని నివారించేందుకు ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వీరి ఆర్థిక స్థోమతను పెంచేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. వీరి కృషికి మనమందరం అభినందనలు తెలియచేద్దాం.

అదే విధంగా మునుముందు కూడా ఇలాంటి సంక్షేమ, పేదరిక నిర్మూలన కార్యక్రమాలను కొనసాగించగలిగితే యస్.సి, యస్.టి ప్రజలలో పేదరికాన్ని పారదోలడానికి దోహదం చేస్తుందని ఆశిద్దాం.

దళితులు, గిరిజనులు కుటుంబాలలో వెలుగులు నింపాలని ఆ దిశగా ప్రభుత్వం, రాజకీయ నాయకులు సహాయ సహకారాలను అందిస్తారని ఆశిద్దాం. అదే విధంగా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాలపై అవగాన కలిగి వాటిని సద్వినియోగం చేసుకుందాం. ప్రభుత్వంతో పాటు మనం కూడా భాగస్వాముల మవుదాం.

*– డా॥. కె. నాగేశ్వర రావు*

*రిసెర్చ్ అసోసియేట్, సి.డి. యస్–టిసిపార్డ్*

తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సమగ్ర అభివృద్ధిలో భాగంగా మరీ ముఖ్యంగా మైనారిటీ స్త్రీల వివాహ సమయంలో ఎదుర్కొనే అనేక రకాల సమస్యలను గుర్తించింది. అందుకు గాను తెలంగాణ ప్రభుత్వం పేద ముస్లీం వధువుల కొరకు షాదీ ముబారక్ పథకాన్ని ప్రకటించింది.

ఈ పథకం ద్వారా పేద ముస్లీం ప్రజలు తమ కుమార్తె వివాహ సమయంలో ప్రభుత్వం నుండి సహకారం నగదు రూపంలో రూ.51,000 అందిస్తుంది. ఈ పథకం ముఖ్య ఉద్దేశం వివాహ సమయంలో పేద ముస్లీం తల్లిదండ్రుల ఆర్థిక భారం తగ్గించటం. అక్టోబర్ 2, 2014 నుంచి ఈ పథకం అమలులోకి వచ్చింది. ఈ తేది తరువాత నుండి వివాహం చేసుకునేవారు మాత్రమే షాదీ ముబారక్ పథకం ద్వారా లబ్ధిపొందటానికి అర్హులు.

G.O.Rt.No. 340, G.O.Rt.No.123, మైనారిటీ వెల్‌ఫేర్ (వక్ఫ్) డిపార్టమెంట్, తేది 21.7.2008 మరియు 24.4.2012 లలో ప్రభుత్వం పేద ముస్లీం యువతుల కోసం (మాస్ మ్యారేజ్ పథకాన్ని) వివాహాలను అమలు చేసింది.



### షాదీ ముబారక్ పథకం ద్వారా లబ్ధి పొందటానికి అర్హతలు

- మైనారిటీ కమ్యూనిటికి చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేయాలి.
- తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారై వుండాలి.

# షాదీ ముబారక్ పథకం

తెలంగాణ ప్రభుత్వం వీటి అమలును క్షుణంగా పరిశీలించి గతంలో పేద ప్రజల వివాహ విషయంలో ఇచ్చిన జీ.ఓ.లను రద్దు చేస్తూ ఈ షాదీ ముబారక్ పథకాన్ని G.O.Ms. No. 4 Dt. 25.9.2014 ను జారీ చేసింది.

- తప్పనిసరిగా వివాహ సమయానికి అమ్మాయి వయస్సు 18 సంవత్సరాలు నిండి వుండాలి.
- కుటుంబ వార్షిక ఆదాయం సంవత్సరానికి రూ.2,00,000 మించరాదు.

### దరఖాస్తు చేసుకొనే విధానం



- దరఖాస్తుదారులు తెలంగాణ షాదీ ముబారక్ పథకాన్ని 'మీ సేవా' కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చును.
- *'మీ సేవా' ద్వారా దరఖాస్తుదారులు జతపరచవలసిన సర్టిఫికేట్స్.

దరఖాస్తుదారు ముందుగా http:telanganaepss.cgg.gov.in 'ShadiMubharak.do ఏదైనా 'మీ సేవా' కేంద్రంలో ఈ లింక్ ద్వారా తెలంగాణ షాదీ ముబారక్ పథకం కోసం దరఖాస్తు

చేసుకొనవచ్చును లేదా వారి దరఖాస్తును నేరుగా మండల తహసీల్‌దార్ గారి ఆఫీసులో ఇవ్వవచ్చును.

### ఆన్‌లైన్‌లో ఈ క్రింది విధంగా దరఖాస్తు చేయవచ్చు

ముందుగా http://telanganaepass.cgg.gov.in కు లాగిన్ అయి షాదీముబారక్ పథకం లోగో మీద క్లిక్ చేయండి. పక్క విండోలో దరఖాస్తు ఫారం తెరుచుకుంటుంది. బ్రౌజర్‌లో 4 భాగాలు వుంటాయి అవి:

1. వధువు సమాచారం 2. వరుని సమాచారం
3. వివాహ సమాచారం
4. అవసరమైన డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేయటం.

పై విధంగా వధువు, వరుని, వివాహ సమాచారం మరియు అనుబంధ డాక్యుమెంట్స్ Jpg/Jpeg, ఫార్మాట్‌లలో అప్‌లోడ్ చేసిన తరువాత ఇమేజ్‌లోని కోడ్ నెం.ను ఎంటర్ చేసి సబ్‌మిషన్ బటన్‌ను క్లిక్ చేస్తే దరఖాస్తు ప్రక్రియ ముగుస్తుంది. ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రింట్ తీసుకొని భద్రంగా ఉంచుకోవాలి.

### దరఖాస్తుతో జతపరచవలసిన సర్టిఫికెట్స్

- జనన ధృవీకరణ పత్రం- సంబంధిత అధికారి జారీ చేసినదై వుండాలి.
- కమ్యూనిటి సర్టిఫికెట్ (కుల ధృవీకరణ పత్రం)
- ఆదాయ ధృవీకరణ పత్రం
- వధూవరుల ఆధార్ కార్డులను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి.
- వధువు యొక్క బ్యాంక్ పాస్ పుస్తకం (సేవింగ్స్ అకౌంట్) మొదటి పేజీ వధువు ఫొటోతో సహా స్కాన్ చేసిన కాపీ మరియు వధువు బ్యాంక్ ఖాతా వివరాలు జత చేయాలి.






- వివాహ పత్రిక, ఒక వేళ వున్నచో వివాహ ఫొటో.
- గ్రామ పంచాయతీ ద్వారా కానీ లేదా మసీదు లేదా చర్చీ మత పెద్దల ద్వారా కాని లేక ఇతర అధికారి లేదా వివాహాలు జరిపించే సంస్థ ఇచ్చిన లేఖ స్కాన్ కాపీని జతచేయాలి.
- ఎస్ఎస్‌సి హాల్‌టికెట్ నెంబరు మరియు ఉత్తీర్ణత పొందిన సంవత్సరాల వివరాలు స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. అయితే ఇది ఐశ్చికం మాత్రమే. తప్పనిసరి కాదు.

షాదీ ముబారక్ పథకం ఏ ఇతర పథకాలతో కలపబడదు, ఉదాహరణకు షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలతో కులాంతర వివాహాల సమయంలో ఇచ్చే ఇన్‌సెన్‌టివ్ అవార్డ్.

షాదీ ముబారక్ పథకం ద్వారా జీవితకాలంలో కేవలం ఒకసారి మాత్రమే లబ్ధి పొందగలరు.

సంబంధిత జిల్లా యొక్క జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దరఖాస్తులను పరిశీలించి వాటికి జతచేసిన పత్రాలను నిశితంగా పరిశీలించిన పిదప ఆమోదించబడిన దరఖాస్తులకు వధువు పేరు మీద వున్న బ్యాంక్ ఖాతాకు నేరుగా నగదు జమ చేయబడుతుంది. అయితే ఈ చెల్లింపులన్నీ ఈ పథకం ద్వారా ఆన్‌లైన్‌లో బిల్స్ అప్‌లోడ్ చేయడం ద్వారానే జరుగుతుంది.

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన షాదీముబారక్ పథకంతో పాటు ఇతర సంక్షేమ పథకాలను మైనారిటీ వర్గానికి చెందిన నిరుపేదలు ఉపయోగించుకొన్నట్లయితే వారి ఆర్థిక మరియు సామాజిక పరిస్థితులు మెరుగుపడుతాయి. తద్వారా రాష్ట్రంలోని పేద ప్రజల సమగ్ర అభివృద్ధికి మార్గం సుగమమౌతుంది.

మన తెలంగాణ ప్రభుత్వం మైనార్టీ అభివృద్ధికి పెద్ద పీట వేస్తుంది అందుకోసం మనవంతు బాధ్యతగా ప్రభుత్వ పథకాలను ఇతరులకు అవగాహన కల్పిస్తూ మనం కూడా సద్వినియోగం చేసుకుందాం.

*-షేక్. మున్వర్ అహ్మద్*
*జె. ఆర్. పి, సి. డి. యస్-టిసిపార్డ్*




# 'షీ' బృందాల విజయగాథ

**మనదేశంలోని ప్రధాన నగరాలైన ముంబాయి, ఢిల్లీ, బెంగళూర్, చెన్నై నగరాలతోపాటు తెలుగు రాష్ట్రాల సంయుక్త రాజధాని నగరం హైదరాబాద్‌లో కూడా మహిళలపైన, విద్యార్థినుల పైన అనేక రకాల వేధింపులు కొనసాగడంతో వారు అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మహిళలు ముఖ్యంగా విద్యార్థినులు, యువతీమణులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో ఈవ్‌టీజింగ్ సమస్య ప్రధానమైనది.**

గతంతో పోలిస్తే నేడు యువతీమణులు, మహిళలు, విద్యార్థినులు పలు సందర్భాలలో ఒంటరిగా వీధుల్లోకి రావడం బస్సుల్లో, రైళ్ళల్లో ప్రయాణం చేయడం జరుగుతుంది. నారీమణులు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో పనిచేయడం వలన అనేక సందర్భాలలో వీరు రాత్రివేళలలో కూడా ఒంటరిగా పనిచేయవలసి వస్తుంది. దీన్ని అవకాశంగా తీసుకొని కొంతమంది ఆకతాయులు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడి, వారిని అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అతి సున్నిత మనస్కులైన యువతీమణులు ఈ విషయాన్ని తమ ఇళ్ళల్లో చెప్పలేక, తమలో తామే బాధలను భరిస్తున్నారు. మరికొంందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు.

### షీ టీమ్స్ ఏర్పాటు

మహిళలు, యువతీమణులు, విద్యార్థినులపై నిరంతరంగా, యధేచ్ఛగా కొనసాగుతున్న ఈవ్‌టీజింగ్ సమస్యకు ముగింపు పలకాలన్న సత్సంకల్పంతో ఇంటా, బయట, కార్యాలయాల్లో, బస్సుల్లో, రైళ్ళల్లో, యువతీమణులను, విద్యార్థినులను, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను రక్షించేందుకు విన్నూత్న శైలిలో 'షీ' పేరుతో రక్షణ బృందాలను అందుబాటులోనికి తేవాలని హైదరాబాద్ నగర పోలీసు కమీషనరేటు నిర్ణయించింది.

ఈ నిర్ణయాన్ని తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు దృష్టికి తీసుకెళ్ళారు. హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్ మహేందర్ రెడ్డి, అదనపు పోలీస్ కమీషనర్ (నేరాలు) స్వాతి లక్రా ముఖ్యమంత్రి ఆమోదముద్రతో 'షీ' బృందాలను 24-10-14 ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటికే ఈవ్‌టీజింగ్ నిరోధానికి పనిచేస్తున్న బృందాలకు భిన్నంగా 'షీ' టీమ్‌లను తీర్చిదిద్దారు.

### ప్రత్యేక శిక్షణ

ప్రస్తుతం హైదరాబాద్ నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో 25 షీ బృందాలు పనిచేస్తున్నాయి. ఈ బృందాలన్నీ నగర అదనపు పోలీస్ కమీషనర్ (నేరాలు) స్వాతి లక్రాకు ప్రత్యక్షంగా బాధ్యత వహిస్తాయి. ప్రతి షీ బృందానికి సబ్‌ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి నాయకత్వం వహిస్తారు. ఈ బృందాలను వనితల మరియు బాలికల రక్షణ కోసం ఏర్పాటు చేసినందున ఈ బృందంలో విధిగా ఒక మహిళా కానిస్టేబుల్ ఉంటారు. దీనివల్ల మహిళలు, బాలికలు తమ సమస్యలను స్వేచ్ఛగా, నిర్భయంగా చెప్పుకోవడానికి వీలుకల్గుతుంది.

'షీ' బృందంలో మహిళా కానిస్టేబుల్ కాక ఇద్దరు పురుష కానిస్టేబుళ్ళు ఉంటారు. షీ బృందాలు నిర్వహించే విధులు భిన్నంగా ఉండడం వలన వీరు సమర్థవంతంగా విధులను నిర్వహించడం కోసం ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు. యువతులు, మహిళలకు, బాలికలకు రక్షణ కవచంగా పనిచేసే 'షీ' బృందాల ఎంపిక నుండి శిక్షణ వరకు హైదరాబాద్ నగర నేర విభాగం సుదీర్ఘ ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తోంది.

పోలీసుల సహజ సిద్ధమైన దర్పం కనిపించకుండా నడక, హావాభావాల్లో అవసరమయిన మార్పులు, చేర్పులు చేస్తున్నారు. 'షీ' బృందాలు ప్రజలతో మమేకమై తమ విధులను సమర్థవంతంగా నిర్వహించడానికి అన్ని చర్యలు గైకొనడం జరుగుతుంది. వేషధారణ నుండి మాట్లాడే భాష వరకు పలు అంశాలపై 'షీ' బృంద సభ్యులకు శిక్షణను ఇస్తున్నారు.

'షీ' బృందాల ఏర్పాటులోను, వాటి విధివిధానాల నిర్వహణలోనూ అదనపు పోలీస్ కమీషనర్ (నేరాలు) స్వాతి లక్రా ప్రముఖ భూమికను

పోషిస్తున్నారు. షీ బృందాల సభ్యుల ఎంపిక నుండి బస్‌స్టాప్‌లవద్ద, ఎంఎంటిస్ రైళ్ళలో, ఈవ్‌టీజింగ్ ఎక్కువగా జరిగే ప్రాంతాలలో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారితో ప్రవర్తించాల్సిన తీరు, మాట్లాడాల్సిన అంశాలపై అవసరమైన అవగాహనను కల్పించడంలో స్వాతిలక్రా తగు జాగ్రత్తలను తీసుకుంటున్నారు.

బస్‌స్టాపులలో 'షీ' బృంద సభ్యులు విద్యార్థినులతో కలిసిపోయేందుకు విద్యార్థులు ఇంజినీరింగ్ చదివే వారైతే వారికి సంబంధించిన సబ్జెక్ట్‌ను, మహిళా ఉద్యోగినులైతే వారికి సంబంధించిన అంశాలు చర్చిస్తారు. 'షీ' టీమ్ బృంద సభ్యులకు హైదరాబాద్ నగరంలో ప్రముఖంగా మాట్లాడే తెలుగు, హిందీ, ఉర్దూ, ఆంగ్లభాషలలో తగు శిక్షణలు ఇస్తున్నారు.

ఆధునిక దుస్తులను ధరించే షీ బృంద సభ్యులు వాటిలో రహస్య కెమెరాలను అమర్చుకోవడం వలన ఈ చర్య సాక్ష్యంగా ఉపయోగపడుతుంది. ఇటీవల పోలీసులపై జరుగుతున్న దాడుల దృష్ట్యా షీ టీమ్ బృంద సభ్యులకు అత్యాధునిక ఆయుధాలను సమకూర్చి, వాటి వినియోగంపై అవసరమైన శిక్షణను ఇస్తున్నారు.

## బాధితులకు అండగా 'షీ' బృందాలు

తెలివి మీరిన కొంతమంది యువకులు షీ బృందాలు తమపై దృష్టిపెట్టారన్న ధైర్యంతో ఇప్పటికీ కొన్ని ప్రదేశాలలో ప్రధానంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ గార్డెన్స్, సికింద్రాబాద్, చార్మినార్, లుంబిని పార్క్, నెక్లెస్‌రోడ్‌లలో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇది తెలుసుకున్న షీ బృంద సభ్యులు ఉదయం, సాయంత్రం ఈ ప్రాంతాలలో సంచరిస్తూ ఆకతాయిల ఆటలకు చెక్‌పెట్టారు.

ఫోన్లలో మహిళలను, యువతులను, కాలేజీ అమ్మాయిలను ప్రేమ పేరుతో వేధించడం సర్వసాధారణమయింది. సున్నిత మనస్కులైన విద్యార్థినులు, బాలికలు, మహిళలు తల్లిదండ్రులతో చెప్పుకోలేక తమలో తామే కృంగిపోతుంటారు. గుర్తు తెలియని వ్యక్తుల నుండి ఫోన్లు, వేరువేరు నంబర్ల నుంచి రాత్రి పగలు లేకుండా నిరంతరంగా వేధింపుకాల్స్ అనేకమంది యువతీమణులను, విద్యార్థినులను మనస్థాపానికి గురి చేస్తున్నాయి. ఇటువంటి వారికి స్వాంతన కలిగించాలన్న ఉద్దేశ్యంతో షీ బృందాలు పలుచర్యలు చేపట్టాయి. నిందితులను పట్టుకొని శిక్షించేందుకు కృషిచేస్తున్నాయి.

## కళాశాలల్లో ఈవ్‌టీజింగ్ వ్యతిరేక ప్రచారం

ప్రభుత్వ, ప్రైవేటు వృత్తి కళాశాలల్లో ఈవ్‌టీజింగ్ సర్వసాధారణం. దీన్ని నివారించడం కోసం ఈవ్‌టీజింగ్ వ్యతిరేక ప్రచారం ప్రారంభించాయి. 'షీ' బృందాలు ఈవ్‌టీజింగ్ వల్ల సంభవించే దుష్పరిమాణాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం సకారాత్మక చర్య. ఈ సంవత్సరం జూలై రెండోవారం నుండి వారంలో మూడురోజులు ఎంపిక చేసుకున్న కళాశాలలకు వెళ్ళి విద్యార్థులలో సకారాత్మక చైతన్యం తీసుకురావడం కోసం సదస్సులు నిర్వహిస్తున్నారు.

హైదరాబాద్ నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలోని ఐదు



జోన్లలో గల ఎంపిక చేసుకోబడ్డ కళాశాలలకు ముగ్గురు సహాయ పోలీసు కమీషనర్లు, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, వెళ్ళి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో ఈవ్‌టీజింగ్ నష్టాలను ఇందుకు పాల్పడే వారిపై 'షీ' బృందాలు తీసుకునే చర్యలను వివరిస్తున్నారు.

గతంలో కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధం కోసం కళాశాలల ప్రిన్సిపాల్‌ల అధ్యక్షతన ర్యాగింగ్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు గైకొంటున్నారు. కళాశాలల యాజమాన్యం, పోలీసులు, విద్యార్థినాయకులు, ఇందులో సభ్యులుగా ఉంటారు ఈ కమిటీ ప్రతినెలా సమావేశమై సమస్యలుంటే వాటిని పరిష్కరించడానికి అవసరమయిన చర్యలు గైకొనడం జరుగుతుంది.

ఇంతేకాక ఈ కమిటీ ఈవ్‌టీజింగ్ వ్యతిరేక ప్రచారానికి అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తుంది. అమెరికన్ కాన్సులేట్, అంతర్జాతీయ సంస్థ పి.సి.వి.సి సమన్వయంతో యూసఫ్‌గూడాలోని సెయింట్‌మేరీస్ కళాశాలల్లో కమ్యూనిటీ లెడ్ యాక్షన్ ప్రొగ్రాం బై పోలీస్ (సిఎల్ఏపిపి) ను ప్రారంభించడం జరిగింది. 'బ్రిటిష్ కాన్సులేట్ వాయిస్ ఫర్ గర్ల్స్' అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ కళాశాలల్లో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 11వ తేదీన వసంతలక్ష్మీ ఫౌండేషన్, తరుణి వంటి స్వచ్ఛంద సంస్థల సహకారంతో బై కథాన్ నిర్వహించారు. అక్టోబర్ 21వ తేదీన పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో నిర్వహించిన ఓపెన్‌హౌస్ లో షీ బృందాల ప్రాముఖ్యాన్ని తెలియజేసే స్టాల్ ఏర్పాటు చేసే సందర్శకులకు షీ బృందాలపై అవగాహన కల్పించారు.

## నిందితులపై కేసులు నమోదు

తమిళనాడు ప్రొహిబిషన్ ఆఫ్ ఈవ్‌టీజింగ్, ఆంధ్రప్రదేశ్ యాంటీ ర్యాగింగ్ చట్టంలోని మార్గదర్శకాలను అనుసరించి ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్న నిందితులపై కేసులు నమోదు చేస్తున్నారు. బాధితులు వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తీవ్రతను బట్టి నిర్భయ చట్టం క్రింద కేసులు నమోదు చేస్తారు.

మహిళలు, బాలికలపై వేధింపులు, భౌతికదాడులు అత్యాచార యత్నాలపై హైదరాబాద్ నగరంలోని కొన్ని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు స్వీకరించడం లేదన్న విమర్శలున్నాయి. బాధితులు పోలీసులను ఆశ్రయిస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నా ఆరోపణలు ఉన్నాయి.

ఈ కారణంగా బాధితులెవరైనా సరే 100 టెలిఫోన్ నెంబర్‌కు ఫోను చేయవచ్చని పోలీసులు సలహాలిస్తున్నారు. 100 కి డయల్ చేయగానే వెంటనే పోలీస్ కంట్రోల్ రూంకే చేరడం, అనంతరం 'షీ' బృందాలతో పాటు సంబంధిత పోలీస్‌స్టేషన్ సిబ్బంది తక్షణమే స్పందించి అవసరమయిన చర్యలు గైకొనాలని హైదరాబాద్ నగర కొత్వాల్ మహేందర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆయనే స్వయంగా డయల్ 100 పనితీరును సమీక్షించడం గమనార్హం.

## సంవత్సరకాలంలో సాధించిన ప్రగతి

'షీ' బృందాలను ప్రారంభించి సంవత్సరం పూర్తయింది. షీ బృందాలు ఏడాది వ్యవధిలో గణనీయమైన ప్రగతిని సాధించాయి. బాధితులలో భరోసా పెరిగింది. 281 మందిపై కేసులు నమోదు చేయబడ్డాయి. కేసుల తీవ్రత ఆధారంగా 19 మందికీ జైలు శిక్ష పడింది.

సంవత్సర కాలంలో 'షీ' బృందాలకు 883 ఫిర్యాదులు అందాయి. ఇందులో డయిల్ 100కు 573, ఫేస్‌బుక్‌కు 196, ఈ-మెయిల్ ద్వారా 63, నేరుగా 37, హైక్ ద్వారా 113, వాట్సప్ ద్వారా 75 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల ఆధారంగా అభ్యంతర కామెంట్లు చేసినందుకు 77 కేసులు, ఫోనులో వేధింపులకు పాల్పడ్డందుకుగానూ 08 కేసులు, ఫేస్‌బుక్, ఈ-మెయిల్ వేధింపులకు సంబంధించి 10 కేసులు, అనుమతి లేకుండా ఫొటోలు తీసినందుకు 35 కేసులు, వేధింపులకు గురి చేసినందుకు ఐ.ఐ.సి క్రింద 10 కేసులు, నిర్భయ చట్టం కింద 12 కేసులు నమోదు చేయడం జరిగింది.

## షీ బృందాల పనితీరుపై హర్షం

షీ బృందాల పనితీరు పట్ల విద్యార్థినులు మహిళలు హర్షాన్ని వ్యక్తపరుస్తున్నారు. షీ బృందాలను ప్రారంభించడంలోను అవి సక్రమంగా పనిచేసే తీరుని సాధించడంలో ప్రముఖ పాత్రను పోషించిన నగర అదనపు పోలీస్ కమీషనర్ స్వాతీలక్రా అభినందనీయులు. ఆమె కృషి, పట్టుదల 'షీ' బృందాలకు మంచి గుర్తింపును తెచ్చాయి. ఈ కారణంగానే 'షీ' బృందాలు తీసుకుంటున్న చర్యలు ఫలితాలపై నివేదిక సమర్పించాలంటూ ఇటీవల కేంద్రహోం మంత్రిత్వాన్ని కోరడం 'షీ' బృందాల సక్సెస్ స్టోరీని తెలియజేస్తుంది.

దేశంలోనే వినూత్నంగా చేపట్టిన షీ బృందాల పనితీరును పరిశీలించేందుకు అనేక రాష్ట్రాల నుండి పోలీసు బృందాలు నగరానికి వస్తున్నట్లు తెలుస్తుంది. ఇటీవల ఒడిశా మహిళా కమీషన్ హైదరాబాద్ నగరానికి వచ్చి 'షీ' బృందాల పనితీరును పరిశీలించి వెళ్ళింది.

మనదేశంలోని అన్ని ప్రధాన నగరాలలోను హైదరాబాద్ నగర పోలీసుల స్ఫూర్తితో 'షీ' బృందాలను ఏర్పాటు చేస్తే తరచుగా వేధింపులకు గురి అవుతున్న విద్యార్థినులకు, మహిళలకు ఆకతాయుల అగచాట్ల నుండి విముక్తి లభిస్తుంది.

*(పోలీస్ 'సురక్ష' పత్రిక సౌజన్యంతో...)*

# కె.జి. టు పి.జి ఉచిత విద్య

**మన దేశంలో విద్యాహక్కును ఒక ప్రాథమిక హక్కుగా రాజ్యాంగంలో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 2002లో పొందుపరచటం జరిగింది. ఈ రాజ్యాంగ సవరణ ప్రకారం విద్య అనేది ఉమ్మడి జాబితాలో చేర్చటం జరిగింది.**



మనకు స్వాతంత్ర్యం వచ్చి 69 సంవత్సరాలు గడుస్తున్నా అందరికీ ఉచిత విద్య అనేది సక్రమంగా అమలు చేయలేకపోతున్నాం. దీనిలో భాగంగా విద్యావ్యవస్థలో అనేక మార్పులను చేయటం జరుగుతుంది.

విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. వాటిల్లో భాగంగా సర్వశిక్షా అభియన్, సాక్షర భారత్ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసి నిర్విరామంగా కృషి చేయటం జరుగుతుంది.

ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకు వచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ చంద్రశేఖర్‌రావు ఉచిత విద్యను అందరికీ అందించాలనే ఆలోచనలతో కుల, మతాలకు అతీతంగా నాణ్యమైన విద్యను కె.జి టు పి.జి వరకు అందించాలని ధృడ నిశ్చయంతో ఈ పథకాన్ని ప్రారంభించటం జరిగింది.

ప్రస్తుతం మనం అవలంభిస్తున్న విద్యా విధానం కొంతమందికి మాత్రమే ఉపయోగపడే విధంగా వుంది. అందువల్ల నిరుపేదలైన పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి ఆశక్తి కనబరచలేకపోతున్నారు. దానికి ప్రధాన కారణం వారిలో ఆత్మ నూన్యతా భావం పెంపొందటమే.

ఇలాంటి భావనలు నుంచి యువతను, విద్యార్థులను బయటకు తీసుకువచ్చేందుకు రాష్ట్రంలోని వివిధ శాఖల కింద పని చేస్తున్న ఆశ్రమ పాఠశాలలన్నింటినీ ఒకే గొడుగు క్రిందకు తేవాలని, అదే విధంగా ప్రస్తుతం యస్.సి./యస్.టి, బిసీ, మైనారిటీ, వికలాంగులు తదితర క్యాటగిరీల్లో రెసిడెన్షియల్ స్కూళ్లను కూడా ఒకే విధానంలోకి తీసుకురావటానికి ప్రయత్నం చేస్తున్నారు. అలాగే ఒక్కో పాఠశాలలో ఒక్కోవిధానం, వేరువేరు మెస్ చార్జీలు, బడ్జెట్‌లు ఉన్నాయి.

ఈ విధంగా వేరువేరుగా వున్నవాటిని ఒకే విధమైన వసతి, సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యను మధ్యలోనే ఆపివేస్తున్న విద్యార్థులు గ్రామ స్థాయిలోనే ఎక్కువగా వుంటున్నారు.

అందుకు అనుగుణంగా వారికి గ్రామస్థాయిలోనే ఆంగ్లమాధ్యమంలో బోధన చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది.

ఎవరైతే వారి విద్యను ఆంగ్లమాధ్యమంలో అభ్యసిస్తున్నారో వారు మాత్రమే ఉద్యోగాలు సంపాదించటం, విదేశాలకు ఉన్నత విద్య కోసం వెళ్లటం జరుగుతుంది. అలాంటి ఇంగ్లీషు విద్యా విధానాన్ని అందరికీ అందుబాటులోకి తేవటం జరిగింది.





### ఈ పథకం లక్ష్యాలు:

- ★ రాష్ట్రంలోని నియోజకవర్గానికి 10 రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయటం.
- ★ కుల, మత, డబ్బుతో పనిలేకుండే నాణ్యమైన ఉచిత విద్యను అందించటం.
- ★ ప్రాథమిక స్థాయి నుంచే అనగా 5వ తరగతి నుంచే ఆంగ్ల మాధ్యమంలో బోధన చేయటం.
- ★ ఇంగ్లీషు మీడియం, సిబియస్ఇ సిలబస్‌ను ఈ పాఠశాలల్లో బోధించటం.

### నియోజకవర్గానికి 10 రెసిడెన్షియల్ పాఠశాలలు

మన తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 119 నియోజక వర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి 10 పాఠశాలల చొప్పున మొత్తంగా 1190 రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయటం. అందులో 12వ తరగతి వరకు పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించటం లక్ష్యంగా మన ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది.

అలాగే 12వ తరగతి చదివిన తర్వాత వారికి ఎలాంటి విద్య, వసతి సౌకర్యాలు కల్పించాలనే అంశంపై ఒక సమగ్రమైన నివేదికను తయారు చేస్తున్నారు.

### ఉద్యోగ అవకాశాలు పెంపొందించేలా డిగ్రీ కోర్సులు

ప్రస్తుతం మనం అవలంబిస్తున్న డిగ్రీ కోర్సులను సంస్కరించి వాటిని ఉపాధి అవకాశాలు కోర్సులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది. అందుకు అనుగుణంగానే సాంప్రదాయక కోర్సులతో పాటుగా వృత్తి నైపుణ్యాలను మెరుగు పరిచే విధంగా డిగ్రీ కోర్సులను తయారు చేస్తుంది.

డిగ్రీ పూర్తి చేసిన యువత నిరుద్యోగులుగా ఉంటూ ఎటువంటి ఉద్యోగం లేక ఖాళీగా వుంటున్నారు. అలాంటి వారికి డిగ్రీ తరువాత ఏం చేయాలనే అంశాలను వారికి వివరించి వారిలో ఒక స్పష్టత తీసుకురావడానికి నూతన కోర్సులు దోహదం చేస్తాయని ఆశిద్దాం.



- ★ ఐ.ఐ.టిలను విద్యాశాఖ మాత్రమే నిర్వహించాలి.
- ★ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించటం/మెరుగుపరచటం.
- ★ ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంతో పాటుగా మెరుగైన వైద్యం గురుకుల పాఠశాలల్లో అందించటం.

పైన పేర్కొన్న లక్ష్యాలను సాధించే దిశగా ఈ పథకాన్ని అమలు చేస్తే బావుంటుందని ఆశిద్దాం.

ఆ దిశగా మన ప్రభుత్వం కె.జి నుంచి పి.జి స్థాయి వరకు ఉచిత విద్యను అందించేందుకు కృషి చేస్తుంది. ఈ కృషి ఫలించినట్లయితే కుల, మతాలకు అతీతంగా అందరికీ నాణ్యమైన విద్యా బోధన అందుతుంది.

– డా॥. కె.నాగేశ్వర రావు
రిసెర్చ్ అసోసియేట్, సి.డి.యస్–టిసిపార్డ్



# నూతన పారిశ్రామిక విధానమే తెలంగాణ సమాజభివృద్ధికి సోపానం!


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సత్వర పారిశ్రామికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని నూతన పారిశ్రామిక విధానాన్ని గత సంవత్సరం నవంబర్ 27న ప్రకటించింది. నూతన రాష్ట్రం ఆవిర్భవించిన అనతి కాలంలోనే పురోభివృద్ధి దిశగా అడుగులు వేస్తూ నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించుకోవడం హర్షించదగ్గ విషయం. ప్రపంచ వ్యాప్తంగా దేశంలో నెలకొన్న పోకడల నేపథ్యంలో తెలంగాణ సమాజం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించింది. స్థానికంగా ఔత్సాహికాలను, నిపుణులను ప్రోత్సహించడం. సామాజికాభివృద్ధి దృక్పథంతో ప్రోత్సాహకాలు కల్పించడం తెలంగాణా నూతన పారిశ్రామిక విధానంలో స్పష్టంగా గోచరిస్తున్నాయి.



తెలంగాణా రాష్ట్ర ప్రాజెక్టుల అనుమతులు, స్వీయ ధృవీకరణ విధానం సంక్షిప్తంగా 'టీ-పాస్' పేరుతో రూపొందిన ఈ విధానం అద్భుతాలకు వేదిక అయ్యే అవకాశముంది. ఈ విధానంలో అనేక ప్రశంసనీయ అంశాలు ఉన్నాయి. అందులో ప్రముఖంగా పేర్కొన దగినవి వికేంద్రీకృతమైన రీతిలో పారిశ్రామికాభివృద్ధి, పరిశ్రమల కోసం ప్రత్యేక గ్రిడ్‌ల ఏర్పాటు, రాజకీయ జోక్యం లేకపోవడం, ఏకగవాక్ష విధానం, భూబ్యాంకు ఏర్పాటు మొదలైనవి.

## మౌలిక వసతుల కల్పన

ఏ రాష్ట్రమైనా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం, ఆ రాష్ట్రంలో లభించే మౌలిక సదుపాయాల లభ్యతపైన ఆధారపడి ఉంటుంది. మౌలిక సదుపాయాలలో ప్రముఖంగా పేర్కొనదగినవి విద్యుత్తు, రహదారులు, నీటిసరఫరా, వ్యర్థాల శుద్ధికి అవసరమైన సదుపాయాలు. పరిశ్రమలు ప్రారంభించేనాటికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భావించి నీటి అభివృద్ధికి ప్రతి సంవత్సరం 100 కోట్ల రూపాయలను వెచ్చించాలని నిర్ణయించడాన్ని పారిశ్రామికవేత్తలు స్వాగతిస్తున్నారు.




## పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక విద్యుత్ గ్రిడ్

రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణా రాష్ట్రం తీవ్రమైన విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఈ సంక్షోభం నుండి బయటపడితే తప్ప పారిశ్రామికాభివృద్ధి సాధ్యపడదు. ప్రస్తుతం తెలంగాణా రాష్ట్రంలో విద్యుత్ లోటు 800-1200 మెగావాట్లు. ఇటువంటి పరిస్థితుల్లో నూతనంగా పరిశ్రమలను ఈ ప్రాంతంలో నెలకొల్పడానికి పారిశ్రామికవేత్తలు ఉత్సాహన్ని కనబరిచారు. ఈ అంశాన్ని గ్రహించిన తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల కోసం ప్రత్యేక గ్రిడ్ ఏర్పాటు చేయాలని సంకల్పించింది.

ఫార్మాసిటీకి ప్రత్యేకంగా 500 మెగా వాట్ల విద్యుదుత్పత్తి ప్లాంటును నెలకొల్పడానికి అవసరమైన చర్యలు గైనకొడం జరుగుతుంది. ఈ చర్యలు తెలంగాణా ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేస్తాయి. రెండు మూడు నెలల్లో కొత్తగా రెండు విద్యుత్‌లైన్లు తెలంగాణా రాష్ట్రంలో అందుబాటులోకి వచ్చే వీలుంది.

ఇందులో మొదటిది అంగుల్-పలాస విద్యుత్‌లైను. దీని సామర్థ్యం 4,500 మెగావాట్లు. రెండోది వార్ధా-డిచ్‌పల్లి విద్యుత్‌లైను, దీని సామర్థ్యం 4,500 మెగావాట్లు, ఈ రెండు ట్రాన్స్‌మిషన్ లైన్లు పూర్తయితే తెలంగాణకు అదనంగా రెండువేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. సంవత్సరంలోపు కొత్త విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం పూర్తయితే 2000 మెగావాట్ల విద్యుచ్ఛక్తి లభిస్తుంది.

విద్యుత్ సమస్యను అధిగమించడానికి తెలంగాణ ప్రభుత్వం దీర్ఘ, స్వల్పకాలిక, మధ్యకాలిక విధానాలు రూపొందించి అమలు చేయనుంది. విద్యుత్ మిగులు రాష్ట్రంగా అవతరించిన తరువాత పరిశ్రమల కోసం ప్రత్యేక డిస్కమ్‌ను ఏర్పాటు చేస్తారు. అన్ని రకాల పరిశ్రమలకూ విద్యుత్ కొనుగోలుపై ఆంక్షలు ఎత్తివేసి సంప్రదాయేతర విద్యుత్‌ను ఉత్పత్తి చేసి సరఫరా చేసే సంస్థలను ప్రోత్సహించడం జరుగుతుంది.

## భూబ్యాంకు ఏర్పాటు

పరిశ్రమలను నెలకొల్పడం కోసం వ్యవసాయ రంగానికి పనికిరాని భూముల ను సేకరించి ప్రత్యేక భూబ్యాంకును నెలకొల్పుతారు. పారిశ్రామికాభివృద్ధి కోసం సేకరించిన భూములను రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థకు అప్పగిస్తారు. ఈ సంస్థ వాటిని అభివృద్ధి పరచి పరిశ్రమలకు కేటాయిస్తుంది. ఈ భూకేటాయింపులకు సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టడం వల్ల ఈ విధానం పూర్తిగా పారదర్శకంగా ఉంటుంది.

రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కమిటీ భారీ పరిశ్రమలకు భూకేటాయింపులు గావిస్తుంది. ఐ.ఐ.సిలో ఎం.డి. అధ్యక్షతన గల కమిటీ ఇతర పరిశ్రమలకు అనుమతులు ఇస్తుంది. చిన్న పరిశ్రమలకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గల కమిటీ భూములను కేటాయిస్తుంది. దరఖాస్తులు మంజూరు, ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. నిర్ణీత సమయంలోగా పరిశ్రమల నిర్మాణాన్ని చేపట్టకుంటే కేటాయించిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటారు.

ఈ చర్య భూములు దుర్వినియోగం కాకుండా ఉండడానికి దోహదపడతుంది. ప్రైవేటు భూమిని కొనుగోలు చేయదలిస్తే భూసేకరణ చట్టం ప్రకారం సేకరించేందుకు వీలుగా సాయం అందజేస్తారు. తెలంగాణా రాష్ట్రంలో 30 లక్షల ఎకరాల 'ల్యాండ్ బ్యాంక్' సిద్ధంగా ఉంది.

## ఏకగవాక్ష విధానం

తెలంగాణా పారిశ్రామిక విధానంలో ప్రశంసనీయమైన అంశం ఏకగవాక్ష విధానంలో ప్రశంసనీయమైన అంశం. ఏకగవాక్ష విధానం దీనిని ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలను పరిశీలించి రూపొందించినట్లు అర్థమవుతుంది. ఒక నోడల్ ఏజెన్సీ పారిశ్రామిక వేత్తలకు బదులుగా అన్ని ప్రభుత్వ శాఖల నుండి అనుమతులను సంపాదించి పరిశ్రమలను నెలకొల్పదలచిన పారిశ్రామికవేత్తల పనిని సులభతరం చేస్తుంది.

ఒకే ఒక దరఖాస్తును నింపి సమర్పిస్తే అన్ని అనుమతులు పెట్టుబడిదారులకు లభిస్తాయి. దీనివలన అనవసర కాలయాపన జరుగదు. సమాచార హక్కు చట్టంలో లాగా జాప్యానికి కారణాలు తెలుసుకునే హక్కును పారిశ్రామికవేత్తలకు కల్పించడం విప్లవాత్మక పరిణామం.

తెలంగాణ రాష్ట్ర నూతన పారిశ్రామికాభివృద్ధి విధానాన్ని అనుసరించి 3 నుండి 4 సంవత్సరాలకొకసారి పరిశ్రమలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. తనిఖీల విధానాన్ని ముందుగా నిర్ధారిస్తారు. శాఖాధిపతి నుంచి నిర్దిష్ట లిఖితపూర్వక అనుమతితో తనిఖీలు చేపట్టాలి. ఈ విధానం వల్ల పారిశ్రామికవేత్తలకు అధికారుల అనవసర వేధింపుల నుండి విముక్తి లభిస్తుంది.

## రాజకీయ ఐక్య నివారణ

తెలంగాణ రాష్ట్ర నూతన పారిశ్రామిక విధానంలో పాలకులైన రాజకీయ నాయకుల జోక్యం ఉండకుండా తగు చర్యలు గైకొన్నారు. నోడల్ ఏజెన్సీలు, రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలకు వివిధ స్థాయిల అధికారులే చైర్మన్లుగా వ్యవహరిస్తారు. మెగా పరిశ్రమల అనుమతులకు నిర్దేశించిన పెట్టుబడుల సదుపాయాల మండలికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

రాష్ట్ర విభజనకు పూర్వం ముఖ్యమంత్రి, మంత్రులతో కూడిన పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఉండేది. నూతన పారిశ్రామిక విధానంలో ఈ పద్ధతికి స్వస్తి పలికారు. ఉద్యోగస్వామ్యానికి అన్ని పనులు అప్పగించడం వల్ల జాప్యం జరిగే అవకాశం ఉంది. అందుకే ఆన్‌లైన్ వ్యవస్థ ప్రత్యేక ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. నిర్ణీత పారిశ్రామిక ప్రమాణాలను ఉల్లంఘించిన అధికారులపై కఠిన చర్యలు గైకొనే వీలున్నందున జాప్యానికి, అవినీతికి చెక్‌పెట్టే అవకాశముంది.

## పారిశ్రామిక వికేంద్రీకరణ

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ పరిశ్రమలు హైదరాబాదు చుట్టూ నెలకొల్పబడడం జరిగింది. రాష్ట్రం మొత్తం ఆర్థికాభివృద్ధిని సాధించాలంటే పారిశ్రామిక వికేంద్రీకరణ జరగాలి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణా పారిశ్రామిక విధానంలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పరిశ్రమలను నెలకొల్పాలని నిర్ణయించడం హర్షించదగిన విషయం. హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-నాగాపూర్, హైదరాబాద్-బెంగుళూరు మార్గాలలో తొలిదశలో పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం చేపడతారు.

రెండోదశలో హైదరాబాద్ -మంచిర్యాల, హైదరాబాద్-నల్గొండ, హైదరాబాద్ -ఖమ్మం, వరంగల్ వంటి ప్రాంతాల్లో అభివృద్ధి చెందిన హస్తకళలను, సంప్రదాయక ఉత్పత్తులను ప్రోత్సహిస్తారు, ప్రతి పారిశ్రామిక ప్రాంతంలో మురుగు నీటిశుద్ధి, ప్రతి పరిశ్రమకు అంతర్గత మౌళిక సదుపాయాలు, చట్టబద్ధమయిన అనుమతులు ఉంటాయి. పారిశ్రామిక వాడల వద్ద యాజమాన్య కార్మికుల సౌకర్యార్థం సదుపాయాలు కల్పించడం కోసం టౌన్‌షిప్‌లను నిర్మించాలని సంకల్పించారు.

నూతన పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకు వీలుగా ఇతర రాష్ట్రాల కన్నా తక్కువ పన్నులు విధించాలని భావిస్తున్నారు. విదేశాలలో ఉండే తెలంగాణా వారిని ఆహ్వానించడానికి ప్రవాస తెలంగాణా దివాస్ నిర్వహించాలని భావించడం అభినందనీయం.

## ఉపాధి కల్పించే పరిశ్రమలకు ప్రాముఖ్యం

తెలంగాణ వస్తే ఉద్యోగాలు లభిస్తాయని యువత కొండంత ఆశతో ఉంది. వీరికి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత తెలంగాణా ప్రభుత్వంపైన ఉంది. అందుకే తెలంగాణా ప్రభుత్వం ఉపాధిని అధికంగా కల్పించే చర్మ ఉత్పత్తులు, కాగితం, పాలిమర్స్, జౌళికి ప్రాధాన్యతను కల్పించాలని నిర్ణయించింది.

సూరత్, ముంబై, టెక్స్‌టైల్స్‌కు పరిశ్రమ అభివృద్ధిని సాధించింది. ఈ పరిశ్రమల అభివృద్ధిలో తెలంగాణా ప్రాంత ప్రజలు ప్రధాన పాత్ర పోషించారు. వీరందరిని వరంగల్‌కు రప్పించి వరంగల్‌ను మరో సూరత్‌గా తీర్చిదిద్దాలన్న ఆలోచనా టీ-పాస్‌లో గోచరిస్తుంది.

నవ సమాజ స్థాపన ధ్యేయంగా తెలంగాణా పారిశ్రామిక ఎస్టేట్‌లో ఎస్.సి.లకు 15.4 శాతం, ఎస్.టి.లకు 9.3 శాతం, మహిళలకు 10 శాతం ప్లాట్లు కేటాయించడం హర్షనీయం.

తెలంగాణా రాష్ట్ర అభివృద్ధికి కొలమానం పారిశ్రామిక విధానం. టీ-పాన్ యథతథంగా అమలు జరిగితే తెలంగాణా రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి జరిగి తీరుతుంది.

– *యస్. సత్యనారాయణ, రీసెర్చ్ అసోసియేట్*
*సి.ఎస్.ఆర్.ఎం., టి.సిపార్డ్*



# గ్రామీణులకు ఉపాధినిచ్చే రిజర్వాయర్లు మత్స్య సంపద అభివృద్ధికి సూచనలు

**రిజర్వార్లు ఎక్కువనీటిని నిలువ చేసే నీటి వనరులు. నదుల పైగాని, ఉపనదులపై గాని, వాగులపైగాని నీటి ప్రవాహానికి అడ్డంగా సాగునీరు, త్రాగునీరు, విద్యుదుత్పత్తి మరియు ఇతర అవసరాల గురించి నిర్మించబడినవి. కాని నేడు ఇవి కూడా మంచినీటి చేపల ఉత్పత్తికి అతి ముఖ్యమైన వనరులుగా మారినాయి. అంతేగాక, అనేకమంది సమీప గ్రామీణులకు చక్కటి ఉపాధిని కూడా కల్గిస్తున్నాయి..**

ప్రస్తుతం గ్రామీణులు మత్స్య పరిశ్రమలో రెండు రకాలుగా ఉపాధిని పొందుతున్నారు. మొదటిది నదులు, రిజర్వాయర్లు, బ్యాక్ వాటర్స్‌లో చేపల పట్టుబడి ద్వారా కాగా, రెండోది చెరువులు, కుంటలు మరియు పాండ్స్‌ల వలన ఆక్వాకల్చర్ పెంపకం ద్వారా పెరుగుతున్న జనాభాకు సరిపడే చేపల ఆహారాన్ని అందించానుకుంటే ఒక్క ఆక్వా కల్చర్ ద్వారానే ఉత్పత్తి చేస్తే సరిపోదు. కావున రిజర్వాయర్లలో కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించి పూర్తి సామర్థ్యంలో చేపల ఉత్పత్తిని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల్లో వందకుపైగా రిజర్వాయర్లు కలవు. గత కొన్ని సంవత్సరాలుగా అనేక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను కూడా

**పట్టిక - 1**

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గల కొన్ని ముఖ్యమైన రిజర్వాయర్లు**

| క్రమ సంఖ్య | రిజర్వాయరు పేరు | జిల్లా | క్రమ సంఖ్య | రిజర్వాయరు పేరు | జిల్లా |
|---|---|---|---|---|---|
| 1. | జూరాల | మహబూబ్‌నగర్ | 16. | శ్రీశైలం | కర్నూల్ |
| 2. | కోయిలసాగర్ | మహబూబ్‌నగర్ | 17. | సుంకేసుల | కర్నూల్ |
| 3. | నిజాంసాగర్ | నిజామాబాద్ | 18. | పెన్నా అహోబిలం | అనంతపురం |
| 4. | శ్రీరాంసాగర్ | నిజామాబాద్ | 19. | మైలవరం | కడప |
| 5. | నాగార్జున సాగర్ | నల్గొండ | 20. | అరణియార్ | చిత్తూరు |
| 6. | మూసీ | నల్గొండ | 21. | సోమశిల | నెల్లూరు |
| 7. | దిగువ మానేరు (ఎల్ఎండి) | కరీంనగర్ | 22. | కండలేరు | నెల్లూరు |
| 8. | మధ్య మానేరు (యుఎండి) | కరీంగనగర్ | 23. | కంబం | ప్రకాశం |
| 9. | సింగూరు | మెదక్ | 24. | తాండవ | విశాఖపట్నం |
| 10. | జూట్‌పల్లి | రంగారెడ్డి | 25. | తాటిపూడి | విజయనగరం |
| 11. | పాలేరు | ఖమ్మం | 26. | పులిచింతల | గుంటూరు |
| 12. | వైరా | ఖమ్మం | 27. | ధవలేశ్వరం | తూర్పుగోదావరి |
| 13. | లక్నవకం | వరంగల్ | 28. | తమ్మిలేరు | పశ్చిమగోదావరి |
| 14. | కడం | ఆదిలాబాద్ | 29 | వంశధార | శ్రీకాకుళం |
| 15. | సాతనాల | ఆదిలాబాద్ | 30 | ప్రకాశం బ్యారేజ్ | కృష్ణా |



నిర్మించడం జరిగింది. ఇవన్నియు చేపల ఉత్పత్తికి ఎంతో అనుకూలమైనది. నీటి విస్తీర్ణం అనుసరించి రిజర్వాయర్లను చిన్నతరహా, మధ్యతరా మరియు భారీ తరహా అని మూడు రకాలుగా వర్గీకరిస్తారు. వీటిలో ప్రస్తుత చేపల ఉత్పత్తి స్థాయి మరియు ఉత్పత్తి సామర్థ్యం గురించి పట్టిక-2 లో గమనించవచ్చు.

## ప్రస్తుత చేపల ఉత్పత్తి & సామర్థ్యం

రిజర్వాయర్లలో చేపల ఉత్పత్తిని జాతీయ స్థాయిలో చూసినట్లయితే చిన్న తరహా రిజర్వాయర్లలో హెక్టారుకు సంవత్సరానికి 50 కిలోలు, మధ్య తరహా రిజర్వాయర్లలో 12 కిలోలు మరియు భారీ తరహా రిజర్వాయర్లలో 11 కిలోలుగా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గల రిజర్వాయర్లలో మాత్రం ఇది వరుసగా 188 కిలోలు, 22 కిలోలు మరియు 17 కిలోలుగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

రిజర్వాయర్లు 'నిద్రాణవస్థ'లో ఉన్న జలవనరులుగా చెప్పుకోవచ్చు. వీటిలో చేపల ఉత్పత్తి సామర్థ్యం ఎంతో ఉంది. వీటిని వినియోగించుకోవలసిన అవసరం ఎంతో ఉంది. కావున ఇందుకు అవసరమైన ప్రణాళికను ఏర్పరచుకొని అమలు చేస్తే, వీటి ద్వారా కూడా గణనీయమైన చేపల ఉత్పత్తిని సాధించవచ్చు. అలాగే ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవచ్చు.

**పట్టిక - 2**

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రకాల రిజర్వాయర్లలో ప్రస్తుత చేపల ఉత్పత్తి మరియు ఉత్పత్తి సామర్థ్యం వివరాలు**

| క్రమ సంఖ్య | రకం | నీటి విస్తీర్ణం (హెక్టార్లు) | ప్రస్తుత ఉత్పత్తి సాలీన (హెక్టార్లు) | ఉత్పత్తి సామర్థ్యం సాలీన (హెక్టార్లు) |
|---|---|---|---|---|
| 1. | చిన్న తరహా రిజర్వాయర్లు | 40-1000 | 188 కిలోలు | 500 కిలోలు |
| 2 | మధ్యతరహా రిజర్వాయర్లు | 1001-5000 | 22 కిలోలు | 263 కిలోలు |
| 3 | భారీ తరహా రిజర్వాయర్లు | 7500 | 17 కిలోలు | 82 కిలోలు |

## తక్కువ చేపల ఉత్పత్తికి కారణాలు

- రిజర్వాయర్లు అధిక నీటి విస్తీర్ణంలో ఉండటం వలన యాజమాన్యం కష్టతరమగుట.
- గుణాత్మక మరియు పరిమాణాత్మక చేప విత్తనాన్ని సకాలంలో రిజర్వాయర్లలో వదలకపోవడం.
- రిజర్వాయర్లలో అన్ని సైజుల చేపలను విచక్షణారహితంగా పట్టుకోవడం.
- బ్రీడింగ్‌కు అనుకూలంగా ఉండే రిజర్వాయర్లలో చేపల వేటను (జులై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాలు) నిషేధించకపోవడం.
- చేపల పెంపకం మరియు పట్టుబడిలో శాస్త్రీయ పద్ధతులను అవలంభిచకపోవడం.

## మత్స్య సంపద అభివృద్ధికి సూచనలు

- మధ్య మరియు భారీ తరహా రిజర్వాయర్లలో అనుమతించబడిన వలలతో మాత్రమే చేపల వేట చేయాలి.
- అవసరమైనప్పుడు అనగా చేపల లభ్యత బాగా తగినప్పుడు పెద్దసైజు దేశీయ కార్పు చేపపిల్లలను కనీసం హెక్టారుకు వెయ్యి చొప్పున వేసుకోవాలి.
- చేపల వేటను ప్రతి సంవత్సరం కనీసం రెండు మాసాలు అనగా జులై, ఆగష్టు నెలల్లో విధిగా నిషేధించాలి.
- బాధ్యతాయుత చేపలవేట వలన వీటిలో చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచుకోవచ్చు. ఫలితంగా ఈ మధ్య మరియు తరహా రిజర్వాయర్లపై ఆధారపడే మత్స్యకారులకు సుస్థిర చేపల లభ్యత సాధ్యపడుతుంది.
- చిన్నతరహా రిజర్వాయర్లలో ఫింగర్‌లింగ్స్ (80-100 మి.మీ) సైజు కార్పు చేప పిల్లల్ని వదలి, పెంపకం చేయడం ద్వారా ఉత్పత్తిని గణనీయంగా పెంచుకోదానికి మిగతావాటి కంటే కొంత సులవుగా ఉంటాయి.
- వీటిలో హెక్టారు నీటి విస్తీర్ణానికి కనీసం 2 వేల చేప పిల్లలను వదులుకోవాలి.
- పెంపక సమయంలో దొంగతనం జరుగకుండా తగిన భద్రత చేసుకోవాలి.
- ఇటీవల బాగా ప్రాచుర్యంలోకి వస్తున్న 'కేజ్ కల్చర్' మరియు 'పెన్ కల్చర్' పద్ధతులను కూడా రిజర్వార్లలో అవలంభించుకోవాలి. ఇందుకోసం కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని మరియు శిక్షణను మత్స్యశాఖ ద్వారా లేదా నిపుణుల ద్వారా పొందాలి.
- రిజర్వాయర్‌కు సంబంధించిన సభ్యుల మధ్య మంచి సఖ్యత మరియు అవగాహన ఉండాలి. సంబంధిత సంస్థల ద్వారా తగిన ఆర్థిక సహాయాన్ని పొంది, రిజర్వాయర్లలో మత్స్య సంపద అభివృద్ధికి విధిగా కృషి చేసుకోవాలి.

*– డాక్టర్ బి. లక్ష్మప్ప, ఎఫ్‌డిఒ, మత్స్యశాఖ, మహబూబ్‌నగర్ 9441076533*

# గ్రామపంచాయతీలలో వినియోగ చార్జీలు విధించే విధానం

**ఏ స్థాయి వ్యవస్థకైనా, ప్రభుత్వానికైనా ఆర్థిక వ్యవహారాల విషయంలో పారదర్శకత అవసరం. అందుకు అనుగుణంగా ఆర్థిక వ్యవహారాల నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలు ఉండాలి. నిర్వహణ వ్యవహారాలు సక్రమంగా ఉన్నప్పుడే అమలు, పర్యవేక్షణ సజావుగా జరుగుతుంది. ప్రజల, ప్రతినిధుల పర్యవేక్షణకు, పరిశీలనకు సమాచారం పొందడానికి అవకాశం ఉంటుంది.**

జాప్యానికి చోటు ఉండదు. తద్వారా ప్రజలలో వ్యవస్థ పట్ల విశ్వాసం, నమ్మకం పెరుగుతుంది. గ్రామ పంచాయతి ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో గ్రామపంచాయతి సర్పంచుల మరియు గ్రామ పంచాయతి కార్యదర్శుల పాత్ర చాలా కీలకం. ఆర్థిక వ్యవహారల నిర్వహణ తెలియక చాలా మంది సర్పంచులు మరియు కార్యదర్శులు ఆడిట్ అభ్యంతరాలను ఎదుర్కొని వాటికి సరియైన సమాదానాలు పంపించక పోవడం వలన చివరకు సర్చార్జులకు కూడ గురి అయ్యి అర్థికముగా ఇబ్బందులకు గురి కాబడినారు.

గ్రామ పంచాయతి సభ్యులకు కూడా ఆర్థిక వ్యవహారాల నిర్వహణ తెలియడము వలన సర్పంచులకు గల ఆర్థికాధికారాల పరిమితిని గుర్తించి వారి అపోహలను దూరం చేసుకొని పంచాయతి సమగ్ర అభివృద్ధికి పాటు పడతారు.

గ్రామపంచాయతీలు తమ ప్రజలకు అందించవలసిన పౌర సేవలు ముఖ్యంగా గ్రామములో వీధి దీపాలు ఏర్పాటు చేయుట, మురుగు నీరు పారుదలకు కావలసిన మురుగు కాల్వల నిర్మాణము మరియు వాటి నిర్వహణ అలాగే త్రాగు నీరు సదుపాయము కల్పించి దానిని నిర్వహించుట పంచాయతీల ప్రథమ కర్తవ్యం. వీటిని నిర్మించుటకు మొదట పంచాయితీల వద్ద నిధులున్నను వాటిని నిర్మించిన తరువాత వాటి నిర్వహణ కొరకు పంచాయతీల వద్ద సరిపడా నిధులు లేక నీటి సరఫరా వ్యవస్థ, మురుగు నీటి కాలువలు నిర్వహించడానికి నిధులు చాలక చివరకు వీధి దీపాలను కూడా పెట్టించుటకు తగినన్ని నిధులు పంచాయతీలలో లేక వాటి నిర్వహణను పట్టించుకోని పంచాయతీలు చాలా ఉన్నాయి.

ఇలాంటి దుస్థితి పంచాయతీలకు రాకుండా ఉండేందుకే పంచాయతీ రాజ్ చట్టం 1994 లోని సెక్షను 71 ద్వార పంచాయతీలు అవసమైతే ప్రత్యేక పన్నులను విధించి వసూలు చేయుటకు పంచాయతీలకు అధికారమివ్వబడినది. అలాగే పంచాయతీలు కల్పిస్తున్న వసతులను (సౌకర్యాలను) వినియోగించు కొన్నందుకు, అలాంటి వసతుల కొరకు పంచాయతీలచే చేయబడిన ఖర్చును పంచాయతీలు ప్రజలనుండి వసూలు చేసినప్పుడు మాత్రమే మళ్లి రాబోవు కాలములో అలాంటి సౌకర్యాలు ప్రజలకు సమర్థవంతంగా కల్పించుటకు వీలు కలుగుతుంది. కావున అలా వసూలు చేయు రుసుములను లేక పన్నులనే ప్రత్యేక పన్నులు లేక వినియోగ చార్జీలు అని అంటారు.

దీనికి చక్కటి ఉదహరణ ఏమిటంటే మనము వినియోగించుకున్న లేక వాడుకున్న విద్యుత్తుకు మనం ప్రతి నెల విద్యుత్తు చార్జీలను చెల్లించుచున్నాము. అయినను సంవత్సరాలు గడిచిన తరువాత గత సంవత్సరములో వాడుకున్న దానికి అదనముగా కొంత మొత్తం మనకు వచ్చు బిల్లులలో ఎఫ్.ఎస్.ఏ (F.S.A.) అనే పద్దుకింద మన బిల్లులో కన్పిస్తుంది. అది ఎందుకు విదించుచున్నారంటె మనకు సరఫరా చేసిన విధ్యుత్తుకు మనం అందరము కలిసి చెల్లించిన మొత్తానికి, విద్యుత్తును ఉత్పత్తిచేసి పంపిణీ చేయుటకు, విద్యుత్తు శాఖచే చేయబడిన ఖర్చుల మొత్తం ఎక్కువగా ఉన్నపుడు అలా ఎక్కువ ఖర్చుచేసి మొత్తమును తిరిగి మన నుండి వసూలు చేయుట ద్వార విద్యుత్తు సంస్థలకు వచ్చిన లోటును భర్తిచేసుకుంటాయి. దానినే విద్యుత్తు సంస్థలు ఎఫ్.ఎస్.ఏ (F.S.A.) రూపంలో మననుండి వసూలు చేస్తాయి.

అలాగే పంచాయతీలు పౌర సౌకర్యాల కల్పన కొరకు చేసిన ఖర్చును, మళ్లీ వచ్చే సంవత్సరములో అంతే మొత్తం లేక అంతకంటె ఎక్కువ మొత్తం ఖర్చు చేసి పౌరసౌకర్యాలను సమర్థవంతంగా చేయగలగాలి అంటె పంచాయతీ చేసిన ఖర్చులను ప్రజలనుండి తిరిగి రాబట్టుకొంటేనే తప్ప అవి సరైన పౌర సౌకర్యాలు కల్పించలేవు. కాబట్టి దీనికి సంబంధించిన నియమాలు తెలుసుకుంటే ఆర్థిక వనరులను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడానికి వీలుపడుతుంది.

## ప్రత్యేక పన్నుల (వినియోగ చార్జీల) విధించు విధానం

ఇంటి పన్నుతో బాటు ప్రత్యే పన్నులు (వినియోగ చార్జీలు) కూడా కలిపి ఇంటి పన్నును ఎలా మదింపు చేస్తారు, వినియోగచార్జీలు ఎందుకు విధించాలి, వాటిని ఏ యే పద్దులకు ఖర్చు చేయవచ్చును వాటి నియమాల గురించి ఇప్పుడు తెలుసుకుందాము.

గ్రామపంచాయతి ప్రజలకు కల్పించుచున్న సౌక్యాల ఖర్చులను ప్రజలు భరించుటకు గాను తెలంగాణ పంచాయతి రాజ్ చట్టము 1994 లోని సెక్షను 71 ప్రకారము ప్రభుత్వము ఉత్తర్వు G.O.Ms. No.97 P.R&RD (Pts.III) dep.dated 14-03-2002 ద్వారా జారీచేసిన నియమాల ప్రకారము గ్రామపంచాయతి కల్పించుచున్న సౌకర్యాలు అనగా వీధిదీపాలు, మంచి నీటి సరఫరా మరియు మురుగు నీటి కాలువలపై గ్రామపంచాయతి చే చేయబడుతున్న ఖర్చును వినియోగ దారులకు పంచి వారి నుండి అట్టి ఖర్చును తిరిగి వసూలు చేయుట దీని ముఖ్య ఉద్దేశము.

ఇట్టి వినియోగ చార్జీలు వేయుటకు గ్రామసభను సంప్రదించి నిర్ణయించుటకు గ్రామ పంచాయతీకి పూర్తి అధికారము కలదు. వినియోగ చార్జీలు వేయుటకు ఇతర అనుమతులు గాని ఆమోదము కాని అవసరము లేదు.

- ★ వినియోగ చార్జీలు విధించుటకు ముందు గ్రామ సభ ఆమోదము పొంద వలెను.
- ★ వినియోగ చార్జీలు విధించుటకు ముందు వాటి మీద అనగా వీధి దీపాలు,నీటి సరఫరా మరియు మురుగునీటి కాలువల పై గత మూడు సంవత్సరములకు గాను గ్రామపంచాయతీ చే చేయబడిన ఖర్చు, మరియు వాటి వలన వచ్చిన ఆదాయము, ఏ సంవత్సరమునుండి వినియోగచార్జీలు వేయ దలుచుకున్నారో ఆ సంవత్సరమునకు సంబందించిన బడ్జెటు అంచనాలు మొదలగు వాటిని పరిగణ లోకి తీసకొన వలెను.
- ★ ప్రత్యేకము గా ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ సమావేశములో సగానికి తగ్గకుండా సభ్యుల ఆమోదముతో ఏ యే రేట్లతో, ఎంత వ్యవధి వరకు వినియోగ చార్జీలు విధించాలో నిర్ణయించాలి.
- ★ వినియోగ చార్జీలు వేటికొరకు వసూలు చేసారో వాటి కొరకే ఖర్చు చేయాలి. ఇతర ఖర్చులకు వాడరాదు.
- ★ వినియోగ చార్జీల ద్వార సమకూరిన ఆదాయము మరియు చేయబడిన ఖర్చుల కొరకు ప్రత్యేక ఖాతా గల రిజిష్టరు నిర్వహించాలి.
- ★ వినియోగ చార్జీల వసూలు కొరకు ప్రత్యేక డిమాండు రిజిష్టరు నిర్వహించాలి.

లక్షెట్టిపేట గ్రామపంచాయతిలో 2800 గృహాలకు ఇంటి పన్ను డిమాండు రూ. 14,65,200 గా ఉంది. అ గ్రామపంచాయతీలో వీధిదీపాలు, మంచినీటి సరఫరా మరియు మురుగునీటి కాలువల సౌకర్యము కల్పించబడినది.

ఆ గ్రామపంచాయతి గత మూడు సంవత్సరములకు గాను వివిద సౌకర్యాల కల్పనకు గాను ఖర్చుచేయ బడిన మొత్తము ఈ క్రింది విధముగా యున్నది. వినియోగ చార్జీలు 2016-17 సంవత్సరము నుండి వేయదలుచుకున్నట్లయితే ఎంత వేయాలో చూద్దాము.

| సంఖ్య | సంవత్సరము | నీటి సరఫరాకు | వీధి దీపాలకు | మురుగు కాలవలకు |
|---|---|---|---|---|
| 1. | 2012-13 | 1,34,500 | 1,15,999 | 1,59,500 |
| 2. | 2013-14 | 1,45,600 | 1,19,500 | 1,65,000 |
| 3. | 2014-15 | 1,54,600 | 1,25,000 | 1,7,4800 |
| | **మొత్తము ఖర్చు** | **4,34,700** | **3,60,499** | **4,99,300** |

లక్షెట్టిపేట గ్రామపంచాయతి గత మూడు సంవత్సరమలకు గాను నీటి సరఫరా కొరకు రూపాయలు 4,34,700 ఖర్చు చేయనైనది. దానిని మూడు సంవత్సరములకు సరాసరి చేయగా రూ. 1,44,900 అవుతుంది. దాని తిరిగి వినియోగ చార్జీల క్రింద ఆ గ్రామపంచాయతీ వసూలు చేస్తేనే తప్ప పౌరులకు మెరుగైన నీటి సరఫరాను పంచాయతీ ఆందించలేదు కావున అట్టి మొత్తము గ్రామములో యున్న 2800 గృహాల వినియోగదారులకు పంచాలి.

అంటే ఇంటిపన్ను డిమాండు రూ. 14,65,200 కు ఎంత శాతము నీటి సరఫరా కొరకు ప్రత్యేక పన్ను (వినియోగ చార్జీలు) విధించాలి అని నిర్ణయించుటకు గాను గత మూడు సంవత్సరాల మొత్తం ఖర్చును సరాసరి చేయగా అంటే మూడు సంవత్సరాల ఖర్చును మూడు తో భాగించగా వచ్చిన సరాసరి ఖర్చును ఆ పంచాయతీ యొక్క మొత్తం ఇంటిపన్ను డిమాండుతో భాగించాలి ఆ తరువాత శాతం వచ్చుటకు గాను వందతో గుణించాలి. అలా వచ్చిన శాతము మాత్రమే నీటిపన్ను వినియోగ చార్జీగా నిర్ణయించాలి తప్ప పంచాయతీ కార్యదర్శులు లేక సర్పంచులు వారి ఇష్టము వచ్చినట్లు వేయకూడదు.

ఉదహరణ 1,44,900 ఉ14,65,20010088% అవుతుంది.

అంటే ప్రతి యజమాని చెల్లించు ఇంటి పన్ను పైన 9.88% లేదా 10% నీటి పన్నును ఆ గ్రామము లోని గృహాలన్నిటికి వేయడం వలన గ్రామపంచాయతి నీటి సరఫరా కు గాను గత మూడు సంవత్సరము లకు చేసిన ఖర్చు మరొక మూడు సంవత్సరమల వరకు వసూలు చేయడము ద్వార సమకూరుతుంది.

అలాగే వీధి దీపాల పన్ను, మురుగు నీటికాలువలపై ఖర్చు చేయబడిన మొత్తమునకు తగిన శాతము వినియోగపు పన్ను వేయడము వలన వాటిని వసూలు చేయడం వలన ప్రజలకు కల్పించ వలసిన సేవలు నిరంతరాయము కొనసాగుతాయి. లేని యెడల గ్రామపంచాయతీ ఆర్థిక వ్యవస్థ దెబ్బ తిని కనీస సౌకర్యములు కూడ కల్పించలేక పోతుంది.

*- యస్. శంకరయ్య, సీనియర్ రిసోర్స్ పర్సన్, టిసిపార్డు*






# డిజిటల్ తెలంగాణాలో మొట్టమొదటి ఆదర్శగ్రామం –సిర్గాపూర్

**జవాబుదారీతనం, పారదర్శకత మరియు బాధ్యతయుతమైన ప్రభుత్వాన్ని స్థాపించటం కోసం భారతదేశ ప్రధానమంత్రి ప్రతిష్టాత్మకంగా 'డిజిటల్ ఇండియా' అనే కార్యక్రమాన్ని జూలై 1, 2015 న ప్రారంభించారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత వేగంతో కూడిన అంతర్జాల సౌకర్యాలను కల్పించడం.**

### డిజిటల్ ఇండియాలో ముఖ్యభాగాలు

1. డిజిటల్ మౌళిక సదుపాయాల నిర్మాణం.
2. మెరుగైన డిజిటల్ సేవలు అందించడం.
3. డిజిటల్ అక్షరాస్యత.



భారతదేశంలో తెలంగాణాతో సహా పది రాష్ట్రాల్లో మొదటగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణా రాష్ట్రంలో ఐ.టి. శాఖా మంత్రి శ్రీ కె.తారకరామారావు 'డిజిటల్ తెలంగాణా'ను ప్రారంభించడం జరిగింది. తెలంగాణాలోని గ్రామాలను 'డిజిటల్ విలేజ్' లాగా తీర్చిదిద్దడానికి ఆయన పూనుకున్నారు.

మెదక్ జిల్లా నారాయణఖేడ్ తాలుకా, కల్హర్ మండలంలో ఒక మారుమూల గ్రామం అయిన సిర్గాపూర్ డిజిటల్ తెలంగాణాలో మొట్టమొదటి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దబడుతున్నది. దీని వెనుక ఆ గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ప్రజల సహకారం మరియు సమన్వయం ఎంతైనా ఉంది. 2011 ప్రకారం సిర్గాపూర్ గ్రామ జనాభా 5,608 ఈ గ్రామ విస్తీర్ణం 5,290 ఎకరాలు. సిర్గాపూర్ గ్రామంలో పది తండాలు ఉన్నాయి. పది తండాల జనాభా సుమారు 1900 మంది.

ఈ సిర్గాపూర్ గ్రామం 'డిజిటల్ తెలంగాణా' వైపు దూసుకెళ్ళడానికి ముఖ్య కారణం ఆ ఊరి సర్పంచ్ శ్రీ మనీష్ పాటిల్‌గా చెప్పుకొవచ్చు. శ్రీ మనీష్ పాటిల్ సర్పంచ్‌గా కావటానికి ముందు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా సేవలు అందించారు. అందుకే తనకు ఉన్న తెలివిని సద్వినియోగం చేస్తూ, చొరవతో తమ గ్రామ సమస్త సమాచారాన్ని వెబ్‌సైట్‌గా పొందుపరిచారు. పారదర్శక మరియు జవాబుదారీతనం పాలనకు ఉదాహరణగా నిలుస్తున్నారు.

'డిజిటల్ ఇండియా', 'డిజిటల్ తెలంగాణా' స్ఫూర్తితో తను 'సిర్గాపూర్ ఇన్ వెబ్‌సైట్' (http :wwwsirgapur.in) ని ప్రారంభించానని ఆయన తెలియజేశారు. ఈ వెబ్‌సైట్‌ని ఓపెన్ చేసినట్లయితే మొదటగా

ఈ ఊరి ఆవరణలో ఉన్న మౌళిక సదుపాయాలతో కూడిన చిత్రావళి దర్శనిమిస్తుంది. ఈ గ్రామంలో ఉన్న ముఖ్యమౌళిక సదుపాయాలు ఇవి:

- ☆ పోలీస్ స్టేషన్
- ☆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- ☆ పోస్టు ఆఫీసు
- ☆ ఎస్‌బిహెచ్ బ్యాంక్
- ☆ గ్రామ పంచాయతీ కార్యాలయం
- ☆ జిల్లా పరిషత్ పాఠశాల
- ☆ 11/33 కెయు సబ్‌స్టేషన్
- ☆ 10 ఎం.వి. సోలార్ పవర్‌ప్లాంట్
- ☆ సాంఘీక సంక్షేమ వసతి గృహం (బాలురలకు)
- ☆ కెజిబివి కస్తూరిబాగాంధీ బాలిక విద్యాలయం.

సిర్గాపూర్ గ్రామంలో ఎన్నికకాబడిన సర్పంచ్, ఉప సర్పంచ్, 14 వార్డు మెంబర్లు, 2 ఎం.పి.టి.సి సభ్యులు మరియు కో-ఆప్టేడ్ సభ్యుల సమాచారం ఆ గ్రామ వెబ్‌సైట్‌లో పొందుపరచనైనది.

గ్రామానికి మంజూరైన నిధులు మరియు ఖర్చు వివరాలు చెక్‌నెంబర్‌తో సహా చేపట్టిన పనులు ఇందులో పట్టిక రూపంలో అందుబాటులో ఉంచడం జరిగింది. గ్రామ పంచాయతీ నిధుల వివరాలు, పదవ ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులు మరియు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు గూర్చి అన్ని వివరంగా తెలుసుకొనవచ్చును.

ఈ వెబ్‌సైట్‌లో 'బెనిఫిట్స్' అనే అంశంలో ముఖ్యంగా నాలుగు రకాల ప్రభుత్వ కార్యక్రమానికి చెందిన సమాచారం తెలుసుకోవచ్చును అవి:





1. రేషన్ బియ్యం - షాపు 17 మరియు 18
2. పెన్షన్‌లు
3. గృహాలు
4. ఐహెచ్‌హెచ్‌ఎల్ ఇండివిద్యూవల్ హౌస్‌హోల్డ్ శానిటరి లాటరీన్స్ (నిర్మల్ భారత్ అభియాన్)

ఈ పైన తెలుపబడిన అంశాలపై క్లిక్ చేసే లబ్ధిదారుల వివరాలు, వారికి ప్రభుత్వం నుండి అందిన ఆర్థిక సహాయం వివిధ కార్యక్రమాల పరంగా పట్టిక రూపంలో చూడవచ్చును. ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద లబ్ధి పొందుతున్న వారి వివరాలను ప్రపంచంలో ఏ మూల నుండైనా తెలుసుకొనవచ్చును.

10 ఎం.వి కెపాసిటిలో గ్రామంలో ఉన్న సోలార్ పవర్ ప్లాంట్‌కు అతి తక్కువ వ్యయంతో గ్రామంలో విద్యుత్ సౌకర్యం గూర్చి సంబంధించిన చిత్రాలను చూడవచ్చును. అంతేకాక, ఈ వెబ్‌సైట్‌లో ఫిర్యాదుల విభాగానికి ప్రత్యేక స్థానాన్ని కల్పించారు.

గ్రామంలో చేపట్టిన పనులపైన ఎవరైనా ఫిర్యాదు చేస్తే నిర్దేశించిన గడువులోపు వారి మొయిల్‌కు పూర్తి వివరాలు అందజేసే విధంగా ఏర్పాట్లు చేసేవారు. గ్రామసర్పంచ్ అయిన శ్రీ మనీష్ పాటిల్ స్వయంగా ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేస్తుండటం విశేషం.

సిర్గాపూర్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుంటూ తెలంగాణాలో మరిన్ని 'డిజిటల్ విలేజ్' లాగా తీర్చిదిద్దబడతాయి అన్నదానికి సందేహమే లేదు. సిర్గాపూర్ గ్రామ స్ఫూర్తితో తెలంగాణా రాష్ట్రంలో ఉన్న అన్ని గ్రామాలు 'డిజిటల్ గ్రామాలు' గా రూపుదిద్దుకోవాలని ఆశిద్దాం.

**- కుసుమ మాధురి**
*సెంటర్‌హెడ్-సి.సాటా, సి.డబ్ల్యు.సి.డి.,*
*సీనియర్ ఫ్యాకల్టీ, సి.డి.పి.ఐ*



# విపత్తులు - నిర్వహణ

**సాధారణంగా మన రాష్ట్రంలో కరువు, వరదలు, తుఫాన్లు వస్తూ వుంటాయి. వీటి వలన సమాజానికి నష్టం సంభవిస్తుంది. విపత్తు అంటే ఏమిటి ? విపత్తు వలన కలిగిన నష్టాలను భరించడం, ఇతరుల సహాయం లేనిదే సమాజం తిరిగి యధాస్థితికి కోలుకోవడం జరగని పరిస్థితిని విపత్తు అని అంటారు. ఈ పరిస్థితిలో పూర్తి స్థాయిలో గుర్తించు కోవలసిన విషయాలు ఉన్నాయి.**

వాటి వివరాలలోకి వెళితే, మనుష్యులు ప్రాణాలు కోల్పోవడం, గాయాలు పూర్తిగా / పాక్షికంగా కావడం, పశు సంపద కోల్పోవటం, వ్యక్తిగతమైన ఆస్తులకు నష్టం వాటిల్లటం, పంటలు పాక్షికంగా / పూర్తిగా పాడుకావటం, ప్రభుత్వ ఆస్తులకు నష్టం సంభవించటం, ప్రజల ఇండ్లు కుప్పకూలటం, లేదా కొట్టుకొనిపోవటం, త్రాగునీరు కలుషితం కావటం తద్వారా ప్రజలకు జంతువులకు అంటురోగాలు ప్రబలటం, రోడ్లకు గండి పడటం, చెరువులకు గండి పండటం, కొండ చరియలు విరిగి పడటం మొదలైనవి ఎక్కువ స్థాయిలో జరిగినపుడు ఆ సమాజం వారికున్న సొంత వనరులను ఉపయోగించి సాధారణ స్థితికి చేరుకోలేదని చెప్పవచ్చు.

### విపత్తు ప్రభావం

- ★ ప్రకృతి వైపరీత్యాలు సంభవించటం వలన అనేక కష్ట నష్టాలకు ప్రజలు గురి అవుతారు.
  *ఉదా :* ప్రజలు, జంతువులు ప్రాణాలు కోల్పోవటం.
- ★ ప్రజలకు, పశువులకు అంటురోగాలు ప్రబలటం.
- ★ వ్యక్తిగత ఆస్తులు, పూర్తిగా / పాక్షికంగా నష్టానికి గురి కావటం.
- ★ పంటలు పూర్తిగా / పాక్షికంగా పాడుకావటం
- ★ టెలిఫోన్ తీగలు / స్థంబాలు, విద్యుత్ తీగలు / స్థంబాలు తెగిపోవటం/ విరిగి పోవటం.


### విపత్తు రకాలు

- ★ వాతావరణ సంబంధమైన విపత్తులు.
- ★ భౌగోళిక సంబంధమైన విపత్తులు.
- ★ మానవ తప్పిదాల వలన సంభవించే విపత్తులు.
- ★ రసాయనిక, పారిశ్రామిక మరియు అణుశక్తి చర్యల వలన సంభవించే విపత్తులు.
- ★ జీవ పరిసరాల సంబంధమైన విపత్తులు.

### డిసాస్టర్ మేనేజ్‌మెంట్ (విపత్తు నిర్వహణ వలయం)

విపత్తుల వలన కలిగే నష్టాలను తగ్గించుకోవడానికి చేపట్టే కార్యక్రమాలను విపత్తుల నిర్వహణ అనవచ్చును.

## విపత్తు నిర్వహణ వలయం



## విపత్తు నిర్వహణ - ఉద్దేశ్యాలు

- ★ జరగబోయే నష్టాలను తగ్గించటం
- ★ బాధితులకు తగిన సమయంలో అవసరానికి అనుగుణంగా సహాయ సహకారాలు అందజేయటం

## మొదటి ఉద్దేశ్యం

ప్రభుత్వ యంత్రాంగం ప్రయత్నాలతో పాటు గ్రామంలో వున్న పంచాయతీ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, ఎస్‌హెచ్‌జి గ్రూపు లీడర్లు, సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అందరు కలిసి గ్రామాన్ని విపత్తుల నుండి కాపాడుకోవడానికి భద్రతా చర్యలు తీసుకోవడం, వైపర్యీతాల ధాటికి ఎదుర్కొనే శక్తిని సమకూర్చుకోవడం.

## రెండవ ఉద్దేశ్యం

ఇప్పటి వరకు వైపర్యీతాలను పూర్తి స్థాయిలో ఆపగలిగే స్థాయికి మనం చేరుకోలేదని చెప్పవచ్చు. కావున విపత్తులు సంభవించినపుడు బాధితులకు సత్వర సహాయ సహకారాలు ఏ విధంగా అందించాలో ముందుగానే ఆలోచించి వైపరీత్యానికి స్పందించి చేపట్టే చర్యలు, ముందస్తు హెచ్చరికలు అందరికి అందించటం.

## మూడవ ఉద్దేశ్యం

వైపరీత్యాలు సంభవించినపుడు ప్రజల జీవితం చిన్నాబిన్నమవుతుంది. సమాజం సాధారణ స్థితికి చేరుకోవాలి అంటే వైపరీత్యాలకు ముందున్న వాస్తవ పరిస్థితులకు తిరిగి చేరుకోవాలి.

## విపత్తులు -తుఫాన్లు

తుఫానును సాధారణంగా సైక్లోన్ అంటారు. సైక్లోన్ అనే పదం గ్రీకు భాష నుండి తీసుకున్నది అంటే 'చుట్టుకున్న పాము' అని అర్థం.



## తుఫాన్లు అంటే ఏమిటి

సముద్రంలో అల్పపీడనం ఏర్పడి ఆ ప్రాంతంలోని మబ్బుల వలన భారీ వర్షంతో పాటు, గాలి అతివేగంగా వీస్తుంది – ఇదే తుఫాను. తుఫానుల దిశను ముందుగా ఊహించలేము. అవి ఉన్నట్టుండి దిశను మారుస్తాయి, తీవ్రమవుతాయి లేదా తేలిపోతాయి.

తుఫానుల్లో మూడు విధాలుగా ప్రమాదం జరుగుతుంది.

1. తీవ్రమైన గాలులు, 2. కుండపోత వర్షం, 3. ఉప్పెన.

***తీవ్రంగా వీచే గాలులు*** : తుఫానులో గంటకు 100 నుండి 300 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. ఈ గాలి ధాటికి తట్టుకోలేని కట్టడాలు, టెలిఫోన్ స్థంబాలు, తీగలు, విద్యుత్ స్థంభాలు, వైర్లు, టవర్స్, గుడిసెలు, పెంకుటిళ్ళు, చెట్లు, కోళ్ళషెడ్లు, కొబ్బరి, అరటి తోటలు మొదలైనవి దెబ్బతింటాయి.

***కుండపోత వర్షం :*** తుఫాను ఏర్పడిన సమయంలో రెండు నుండి మూడు రోజులు భారీ వర్షం కురుస్తుంది. సాధారణంగా సంవత్సరం అంతా కురిసే మొత్తం వర్షపాతానికి దాదాపు 5–6 రెట్లు వక్కువ వర్షపాతం నమోదవుతుంది. వేగవంతమైన గాలులు వీయటం వర్షం వలన నష్టం చాలా భారీగా ఉంటుంది. దీని ద్వారా లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అవుతాయి. వరదనీరు ఎత్తు ప్రదేశం నుండి పల్లానికి పారుతూ దారిలో వచ్చిన కట్టడాల బలాన్ని బలహీన పరుస్తుంది. పునాదులు దెబ్బతింటాయి. చెట్లు పడిపోతాయి. పంటలకు విపరీతంగా నష్టం సంభవిస్తుంది.

***ఉప్పెన :*** తుఫానులో ప్రత్యేకంగా ఎక్కువ హాని కలిగించేది ఉప్పెన అని చెప్పవచ్చు. పెద్ద అలలు, తుఫాను ప్రయాణిస్తున్న వేగంతో వస్తాయి. వీటి ఎత్తు 3 నుంచి 7 మీటర్లు ఉంటుంది. దీని వలన కెరటాలు నేల మీదకు 10 నుంచి 25 కిలోమీటర్ల దూరం వరకు వెళతాయి. ఉప్పెనలో చిక్కుకున్న మనుషులు చనిపోతారు లేదా తీవ్రగాయాలకు గురవుతాయి. బలహీనమైన ఇండ్లు కొట్టుకుపోతూ చిన్నాభిన్నం అవుతాయి.

***హెచ్చరిక***: తుఫాను గురించిన సమాచారాన్ని తుఫాను హెచ్చరిక కేంద్రం, విశాఖ పట్టణం వారు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తుంటారు. హెచ్చరికలు రెండు రకాలుగా ఉంటాయి.

***అలర్ట్***: దీని అర్థం తుఫాను సముద్రంలో ప్రారంభం అవుతుందనీ, అది తీరానికి చాలా దూరంలో ఉందని ముందస్తు హెచ్చరిక చేస్తారు. ఇది తీర ప్రాంతం తాకడానికి కనీసం 48 గంటలు అంటే 2 రోజుల సమయం ఉంటుంది. ఈ హెచ్చరిక తగిన ముందస్తు చర్యల గురించి స్పందింప చేయడానికి, రోజుకు నాలుగు సార్లు హైదరాబాద్‌కు, అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలకు సమాచారం పంపుతారు.

***సైక్లోన్ వార్నింగ్***: తుఫాను ఇంకా రెండు రోజుల్లో తీరప్రాంతాన్ని తాకుతుందనగా ప్రతి మూడు గంటలకు ఈ హెచ్చరికలు ఇస్తారు. వీటినే సైక్లోన్ వార్నింగ్ బులెటిన్లు అంటారు.

*ఉపగ్రహం ద్వారా హెచ్చరికలు :* తుఫాన్ హెచ్చరికలు ఆలస్యంగా చేరుతున్నాయి అనే అభిప్రాయం అందరిలోను బలంగా ఉన్నందువలన హెచ్చరిక డిపార్ట్‌మెంట్ వారు ఒక కొత్త సాధనాన్ని ప్రవేశపెట్టారు. అందులో ముఖ్యంగా వున్న భాగాలు –



- ★ చెన్నైలో వున్న హెచ్చరిక కేంద్రం జిల్లా కోడ్ ప్రకారంగా హెచ్చరికను తెలుగులో తయారు చేయడం.
- ★ చెన్నై నగరంలో వున్న సెట్ మీద సీ బ్యాండ్ ద్వారా శాటిలైట్‌కు హెచ్చరికను పంపించడం.
- ★ శాటిలైట్ ద్వారా ఆ హెచ్చరికను ఎస్ బ్యాండ్‌లో చేరవలసిన గమ్యానికి పంపించడం.
- ★ ఆ గమ్యస్థానానికి రిసీవర్ ద్వారా తెలుగులో నెమ్మదిగా ప్రచారం అవుతుంది.

*తుఫానుకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు :*

తుఫాను సమాయాల్లో గ్రామ ప్రజలు ముఖ్యంగా కోస్తాతీరం వెంబడివున్న గ్రామాల్లో ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. వాస్తవంగా తుఫాను రాకముందు ఏ ఏ చర్యలు తీసుకోవాలో, తుఫాన్ వస్తున్నపుడు ఏ విధంగా తమను తాము రక్షించుకోవడానికి జాగ్రత్తపడాలో ఈ క్రింది విధంగా పొందుపర్చడం జరిగింది.

- ★ ఇళ్ళు తనిఖీ  చేయడం, అవసరమైన చోట్ల సిమెంట్ చేయడం వలన వదులుగా వున్న పెంకులను గట్టిచేయడం, తలుపులు, కిటికీలను మరమ్మత్తు చేయడం
- ★ ఇంటి చుట్టు ప్రక్కల ప్రాంతాలను పరిశీలించడం. ఎండిపోయిన లేక ఎండిపోతున్న చెట్లను తొలగించడం, పనికిరాని సామానులను, విడి ఇటుకలు, చెత్త డబ్బాలు, సైన్ బోర్డులను, కదలకుండా చేయడం
- ★ కిరోసిన్‌తో నింపిన అరికెన్ లాంతర్, ఫ్లాష్‌లైట్ తగినన్ని డ్రై సెల్స్ మీ దగ్గర వుంచుకోవడం.
- ★ పూర్తిగా శిథిలమైన భవనాలను పడగొట్టడం.
- ★ మీ రేడియో సెట్లను పూర్తిగా సర్వీసు చేసి ఉంచుకోడం. ట్రాన్సిస్టర్ల విషయంలో బ్యాటరీలను సిద్ధంగా ఉంచుకోవడం.
- ★ చెక్క బోర్డులను సిద్ధంగా ఉంచుకోవడం.

*తుఫాన్లు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు :*

- ★ పై అంతస్తులో ఉండకూడదు. ఒకటవ అంతస్తులో వున్నవారు కూడా నేల అంతస్తులో ఉండటం మంచిది. తలుపులు, కిటికీలు, ద్వారబంధాలన్నింటిని గట్టిగా కట్టివేసి, అడ్డంకులు పెట్టి ఉంచడం.
- ★ సక్రమంగా మూతపెట్టి ఉంచిన పాత్రలలో అదనంగా త్రాగే నీటిని నిల్వ చేసి ఉంచుకోవడం.
- ★ పిల్లలకు, పెద్దలకు కనీసం వారం రోజుల పాటు సరిపోయే తిండి, నిత్యావసర సరుకులు, వంట సామాగ్రిని సిద్ధం చేసుకోవడం.
- ★ తుఫాను ఉన్నప్పుడు బయట తిరగరాదు.
- ★ రేడియో ప్రసారాలు, వాతావరణ పరిస్థితి సూచనలు వింటూ వుండాలి. పుకార్లు నమ్మరాదు.
- ★ పశువులను తగినంత ముందుగా పల్లపు స్థలాల నుండి వెంటనే తరలించాలి.
- ★ ఇంటిలోని ఫర్నిచర్, పనిముట్లు, కిరోసిన్ డబ్బాలు, తోట పనిముట్లు, ఇతర వస్తువులను సురక్షిత ప్రదేశాలలో ఉంచండి.
- ★ ఎట్టి పరిస్థితిలోనైనా కలత చెందకుండా ఉండండి. మీరు ఓపిక ధైర్యాన్ని కలిగివున్నట్లయితే ఇతరులు కూడ నిబ్బరంగా ఉంటారు.

*తుఫాను వెలసిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు :*

- ★ తెగిపడిపోయిన విద్యుత్ తీగలను తాకకుండా దూరంగా ఉండడం. విద్యుత్ తీగలు తగిలిన వ్యక్తిని రక్షించేటప్పుడు వీలుగా తీగలు తొలగించడానికి పొడి కర్ర వంటి వస్తువులను వాడడం.
- ★ అంటు వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం.

## వరదలు

వరద అనగా నిత్యజీవితాన్ని ఆటంకపరిచే నీటి మట్టంగా మనం భావించవచ్చును. ఇది భారీ వర్షం మరియు ఉప్పెనల ఫలితంగా సంభవిస్తుంది.

*వరదల రకాలు :*

- ★ ఆకస్మికంగా వచ్చే వరదలు (చెరువు కట్టలు, వరదగట్లు, గండిపడటం వలన).
- ★ నదుల ద్వారా వచ్చే వరదలు (భారీ వర్షాలు వలన పూర్తి స్థాయిలో ఉప్పొంగటం).
- ★ ఉప్పెన వలన వరదలు (తుఫాను సమయంలో).

*వరద ముందు :*

- ★ మీరు నివసిస్తున్న ప్రాంతం వరద బాధిత ప్రాంతమా కాదా అని తెలుసుకోవటం, మీ ప్రాంతానికి ఎగువ ప్రదేశంలో  (సమస్యలు

సంభవించటాని ఇరు మూల కారణాలైన) మట్టి, నీటి పారుదల, జల విద్యుత్తు ఆనకట్టలు ఉన్న వాటిని గుర్తించటం.

- ★ వరద కాపుదల, వరద హెచ్చరిక మరియు చిన్న కాల్వల హెచ్చరిక – ఈ పదాలను తెల్సుకొనుట.
- ★ టార్చ్‌లైటు, త్రాగునీరు, బిస్కట్స్ మొదలైన అత్యవసర వస్తువుల ను సిద్ధంగా ఉంచుకొనటం.
- ★ తరలింపు ప్రణాళికలు సిద్ధ పరుచుకొనటం.
- ★ వరద షెల్టరులో కావలసిన ఏర్పాటులు చేయటం, స్థానిక ప్రకృతి వైపరీత్యాల యాజమాన్య కార్యాలయం నుండి కావల్సిన విషయ సేకరణ చేయటం.
- ★ భీమా పథకాలను ప్రోత్సహించటం, గృహోపకరణ వస్తువులను రక్షిత ప్రాంతాల్లో ఉండేలా ప్రోత్సహించటం.

***వరద కాలంలో :***

- ★ స్థానిక సమాచారం కోసం రేడియో, స్థానిక రేడియో లేదా టెలివిజన్ స్టేషన్లలో వచ్చే సమాచారం వినాలి.
- ★ స్థానిక అధికార్లు వరద హెచ్చరిక జారీ చేసిన యెడల తరలింపుకు సిద్ధంగా ఉండాలి.
- ★ మీరు ఇంటిని వదలి వెళ్ళవలసివస్తే మీ ఇంటి సభ్యులందరకు విద్యుత్ సరఫరాను, గ్యాస్ సప్లయ్‌ని ఎలా ఆపాలో, మరియు ఆరోగ్య రక్షణ విషయాలను నేర్పించాలి.
- ★ సమయం ఉన్నట్లైతే ఇంటిని, ఇంటి చుట్టుపక్కల ఉన్న వస్తువుల ను భద్రపరచండి.
- ★ వరద నీటి నుండి దూరంగా ఉండండి.
- ★ వరద నీరు లోతుగా ఉన్నట్లైతే ఇంటి పునాదిని, కట్టడాన్ని రక్షించడానికి వరద నీటిని స్వతంత్రంగా పారనివ్వాలి.
- ★ వరద నీటిలో మునిగి ఉన్నరోడ్లపై వాహనాలను నడపవద్దు. నీటి అడుగున రహదారి కొట్టుకొనిపోయి ఉండవచ్చు. అందులో చిక్కుకొని పోవుటగానీ, కొట్టుకొని పోవుటగానీ జరగవచ్చును.

***వరద తరువాత :***

- ★ ప్రవహిస్తున్న వరద నీటి నుండి దూరంగా ఉండటం. ఆరుఅంగుళాల లోతున ప్రవహించే వరద నీరు కాళ్ళను లాగివేయవచ్చును.
- ★ తెగిపడిన కరెంటు తీగల నుండి దూరంగా ఉండటం, వాటి గురించి ఫిర్యాదు చేయటం.
- ★ సహాయాన్ని ఎక్కడ నుండి పొందవచ్చో తెల్సుకొనటానికి రేడియో వింటూ ఉండటం.
- ★ ఆరోగ్య, రక్షణ అవసరాల గురించి ఆలోచించాలి. వరద నీటిని తాకినట్లైతే తరచు చేతులను సబ్బు, శుభ్రమైన నీటితో కడుక్కోవాలి. వరద నీరు తగిలిన ఆహార పదార్థాలను పారవేయటం.
- ★ ఇంటిని వదలి వెళ్ళవల్సివస్తే అన్ని బయటి తలుపులు, కిటికీలు మూసితాళం వేసి వెళ్ళటం.
- ★ ప్రమాదకరమైన కాలుష్యాన్ని అరికట్టాలి. క్రిమిసంహారకాలు నీటిలో కలపకుండా చూడటం.
- ★ వరద సమయంలో ఆ ప్రాంతాన్ని వదలి మెట్ట ప్రాంతంలోని షెల్టరుకు వీలైన పశువులను, చరాస్థులను, వస్తువులను, వాహనాల ను తీసుకొని వెళ్ళి ఉండటమనేది శ్రేష్ఠమైన రక్షణ పద్ధతి.
- ★ వరద నీటితో జీవనాన్ని అలవాటుగా పాటించటం.

***వరద సమయంలో వేయదగిన పనులు***

- ★ వరదకు సంబంధించిన హెచ్చరికలు, సలహాల కోసం స్థానిక రేడియో వింటూ ఉండాలి.
- ★ విద్యుత్ పరికరాలన్నింటి కనెక్షన్ తీసివేయాలి.
- ★ విద్యుత్, గ్యాస్ స్టవ్‌లను ఇంటిని విడిచి వెళ్ళేముందు ఆపివేయాలి.
- ★ వాహనాలు, పరికరాలు, చెత్త, రసాయనాలు మొదలైన వాటిని ఎత్తైన ప్రాంతంలో పెట్టాలి.

***వేయకూడని పనులు***

- ★ పిల్లలను వరద నీటిలో గాని, వరద నీటి వద్ద గాని ఆడుకోనివ్వరాదు
- ★ వరద ముంపు పరిసర ప్రాంతాలలో తిరగనివ్వరాదు, వాహనాల ను నడుపరాదు.
- ★ వరద నీటికి గురైన ఆహార పదార్థాలను తినకూడదు.
- ★ తెలియని లోతు, ప్రవాహ వేగం గల వరద నీటిలో వాహనాలను నడపవద్దు.

***వరద యాజమాన్య పద్ధతులు వాటి వివరాలు***

- ★ వరద నీటి నిల్వలకోసం వరద నీటిని అదుపు చేసే రిజర్వాయర్లు
- ★ నది యొక్క వరదనీటి పారుదల కొరకు కాల్వలను అభివృద్ధి పరచుట.
- ★ వరద ముంపుకు గురి అయ్యే ప్రాంతాలలో వరద నీటి అదుపుకు గట్లు కట్టుట.
- ★ వరద నీటి పారుదలను ఒక కాల్వ నుండి మరొక కాల్వకు మళ్ళించడానికి వరదమార్గాల నిర్మాణం.
- ★ డ్రైనేజి మురుగు కాల్వల అభివృద్ధి.



* వరద ప్రమాదాన్ని ముందుగానే గుర్తించడం
* వరద మైదాన ప్రాంతాలను విభజించటం.

### విపత్తుల సంసిద్ధత


దక్షిణాదిలో ప్రముఖ నదులైన గోదావరి, కృష్ణా, నాగవళి, పెన్నా తదితర నదులతోపాటు, చెరువులు కూడా అనేకం ఉన్నందువలన విపత్తులను ఎదుర్కోవలసి వస్తుంది.

విపత్తుకు సంసిద్ధం కావడం అనేది నిరంతరంగా మరియు సంఘటితంగా జరిగే ప్రక్రియ, ఈ ప్రక్రియ ఏదో ఒక శాఖ కార్యక్రమం కాకుండా అన్ని శాఖల కార్యక్రమాల వనరులతో ఏర్పడేది. ప్రకృతి విపత్తులు కలిగించే నష్టాలను తగ్గించడానికి చేపట్టే కార్యక్రమాలు చర్యలనే సంసిద్ధత చర్యలు అని చెప్పవచ్చు.

*విపత్తు సంసిద్ధత ముఖ్య ఉద్దేశ్యాలు*

* హెచ్చరికలు జారీ చేసే విధానాన్ని అభివృద్ధి చేయటం మరియు వాటిని క్రమం వారీగా పని చేస్తున్నదీ లేనిదీ పరీక్షించటం.
* విపత్తుల వలన ప్రమాదభయం వున్న ప్రాంతాలలో నివసించే ప్రజలకు, అధికారులకు అవగాహన మరియు శిక్షణ ఇచ్చుట.
* విపత్తులపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం.
* విపత్తులు జరిగే సమయములలో వెంటనే స్పందించటానికి వీలుగా స్థానిక సమాచార కేంద్రాన్ని వాటి సిబ్బందిని ఏర్పరచుకొనటం.

ఫలవంతమైన అత్యవసర స్పందన అనేది అన్ని శాఖలు అన్ని వర్గాలు తీసుకునే చర్యలపై ఆధారపడి ఉంటుంది. సమన్వయం అనేది పరస్పర నమ్మకం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన బట్టి పాల్గొన్న



ప్రజలు, విపత్తు బారిన పడిన ప్రజలు, సముదాయ ఆధారిత వ్యవస్థలు, సైనిక, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల (ఎన్‌జిఓలు) సహకారం మరియు వనరుల సమీకరణ చర్యలపై ఆధారపడి ఉంటుంది.

గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలోని ప్రజలకు ఏ విపత్తు ఎంతమేరకు నష్టం కలిగిస్తుందో మరియు ఏ ఏ ప్రాంతాలో ఏ విపత్తులకు గురి కాగలవో అని గ్రామాల వారీగా అంచనా వేయాలి..

### *అంచనాను ఈ క్రింది వాటి ఆధారంగా చేయాలి*

- ముందుగా ప్రజలు ఎదుర్కొంటున్న విపత్తుల లక్షణాలు, తీవ్రత ఎంతదూరం మరియు ఎంతకాలం వరకు విస్తరిస్తున్నదీ గుర్తించాలి.
- తరచుగా ఏయే ప్రాంతాల్లోని ప్రజలు ఏయే విపత్తులకు గురవుతున్నారు అన్న విషయాన్ని గుర్తించాలి.
- ఏ రకమైన విపత్తుల్లో మౌలిక సదుపాయాలు, ఇళ్ళు దెబ్బతింటున్నాయో గుర్తించాలి.
- విపత్తు ప్రభావానికి గురికాని అంశాలను కూడా గుర్తించాలి.

### *వనరుల గురించి అంచనా*

- ప్రస్తుతం గ్రామంలో వున్న వనరుల గురించిన అంచనా.
- విపత్తు సంసిద్ధతకు కావలసిన వనరుల గురించిన అంచనా. విపత్తు నిర్వహణ మరియు ఉపశమన చర్యలకు కావలసిన వనరుల గురించి అంచనా వేయటం. ప్రణాళికను తయారు చేయటం.
- విపత్తులలో సహాయ, సమన్వయాలు సాధించటానికి కావలసిన యంత్రాంగం.

### *సంసిద్ధత ప్రణాళిక రూపకల్పన చేయటం*

విపత్తుల నిర్వహణలో పని చేసే వారికి సంసిద్ధత ప్రణాళిక ఉపయోగకరంగా ఉంటుంది. అసలు ప్రణాళిక లేకపోయినట్లయితే ఏమి చేయాలి అనే విషయంపై స్పష్టత వుండదు. కాబట్టి ఒక ప్రణాళికను తయారు చేసుకోవాలి.

విపత్తు సంసిద్ధత ప్రణాళిక అనేది వ్యవస్థాపకమైన వనరులను గుర్తించటం, చట్టాలను మరియు విధానాలను రూపొందించటం, నిర్ధారించిన విధులు మరియు బాధ్యతలు సకాలంలో కట్టుదిట్టంగా అమలు చేయటం ఫలవంతమైన అత్యవసర స్పందనలతో కూడినది.

### *సంస్థాగత యంత్రాంగం*

రాష్ట్ర స్థాయిలో విపత్తు నిర్వహణ కొరకు హైపవర్ కమిటి ఏర్పాటు చేయబడినది. దీనికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షులు మరియు విపత్తు నిర్వహణలో పాల్గొనే శాఖల, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, కేంద్ర ప్రభుత్వ అధీనంలోని శాఖల అధికారులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. దీనికి సమావేశకర్త (కన్వీనర్)గా కమీషనర్ విపత్తుల యాజమాన్యం / నిర్వహణ ఉంటారు.

జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సంఘం ఉంటుంది. జిల్లా రెవెన్యూ అధికారి దీనికి సమావేశ కర్తగా ఉంటారు. జిల్లాలోని ముఖ్యమైన శాఖల అధికారులు దీనిలో సభ్యులుగా ఉంటారు. అదేవిధంగా మండల స్థాయిలో సమన్వయ సంఘం ఉంటుంది.

### *స్పందన యంత్రాంగం - జిల్లా కంట్రోలు రూమ్*

విపత్తు సమయంలో జిల్లా కంట్రోలు కేంద్రం లేక సెల్ ఒక కేంద్ర బిందువుగా పని చేస్తుంది. జిల్లా కార్యాచరణ ప్రణాళికను అమలు పరచటం దీని ప్రధాన బాధ్యత.

విపత్తుల నిర్వహణకు సంబంధించి అన్ని చర్యలను జిల్లాలో ఈ కేంద్రం పర్యవేక్షించటం, సమన్వయం మరియు సహాయ సహకారాలకు కేంద్రంగా ఉంటుంది. వాటి వివరాలు:

- మండల విపత్తుల నిర్వహణకు సంబంధించి కార్యచరణ ప్రణాళికను తయారు చేయడం మరియు పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికను మార్చుకొనుటను పర్యవేక్షిస్తుంది.
- మండలంలో వచ్చే విపత్తులకు సంబంధించి నిర్దిష్టమైన ప్రణాళికను తయారు చేసుకొనేలా ప్రోత్సహిస్తుంది.
- జిల్లా/మండల/పంచాయతీ స్థాయి అధికారులకు ఇచ్చే శిక్షణా కార్యక్రమాలన పర్యవేక్షిస్తుంది.
- వాతావరణ శాఖ నుండి సమాచారం అందుకున్న వెంటనే ప్రభుత్వ శాఖలలోని అధికారులకు, ప్రజలకు హెచ్చరికలను వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా జారీ చేస్తుంది.

### *ప్రభుత్వ విపత్తు సంసిద్ధత చర్యలు*

- ముందస్తు హెచ్చరిక వ్యవస్థ
- తరలింపు విధానాల ప్రణాళిక
- వెతుకుట మరియు రక్షణ
- శిబిర నిర్వహణ
- ప్రథమ చికిత్స
- వార్తా – రవాణ వ్యవస్థలు
- సహాయక చర్యలు
- మానవ హిత సహాయం
- విపత్తు నష్టం, వాటి అంచనా
- తాత్కాలిక మరమ్మతులు మరియు మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, రోడ్లు మొదలుగునవి యదాస్థితికి తెచ్చుట.

### **ప్రభుత్వ - ప్రభుత్వేతర సంస్థల మధ్య సమన్వయం, బాధ్యతలు**

విపత్తు నిర్వహణలో భాగమైన సంసిద్ధత, ఉపశమనం మరియు నివారణ చర్యలను వివిధ శాఖలు వివిధ విపత్తులలో తీసుకోవాల్సిన బాధ్యత వున్నది. ప్రభుత్వంలోని ఏ శాఖ విపత్తు ఏర్పడినప్పుడు ఎలాంటి చర్య తీసుకోవాలి. అన్న విషయాలను విపత్తుల నిర్వహణ శాఖ (రెవెన్యూ) మాన్యువల్స్‌లో సవివరంగా తెలియర్చబడినది. సంక్షిప్తంగా చిత్రపటం ద్వారా తెలియజేయడమైనది. ◆

# కేంద్ర ప్రభుత్వ వినూత్న పథకాలు

**ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా 30 కోట్లకు పైగా పేద ప్రజలు భారతదేశంలో ఉన్నారు అన్నది జీర్ణించుకోలేని కఠోర వాస్తవం. దేశంలోని ప్రజలలో కొంతమందికి మాత్రమే బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. అత్యధిక పేదలకు బ్యాంకు ఖాతాలు లేవు. బ్యాంకు ఖాతాను ప్రారంభించాలనుకుంటే కనీసం 500 డిపాజిట్ చేయాలి. అంత మొత్తం వారికి ఉండదు. బ్యాంకు ఖాతాలు లేనందు వలన పొదుపుకు అవకాశం ఉండటం లేదు. అందువలన వీరికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందడంలేదు.**

ఈ పరిస్థితిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుము కట్టింది. దేశంలో అట్టడుగు వర్గాల వారందరికీ బ్యాంకు ఖాతాలు అందుబాటులోకి తేవాలి తద్వారా ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో వారిని భాగస్వాములను చేయాలని అన్నది ముఖ్య లక్ష్యం. భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోడీ ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (మేరాఖాతా భాగ్యవిధాత) పేరుతో ఒక ప్రతిష్ఠాత్మక బృహత్తర కార్యక్రమానికి ఆగష్టు 26, 2014 సంవత్సరంలో శ్రీకారం చుట్టారు.

### ప్రధానమంత్రి జన్-ధన్ యోజన ఖాతా వలన ప్రయోజనాలు:

- ఎటువంటి డబ్బులు అవసరం లేకుండానే ఉచితంగా బ్యాంకులో ప్రాథమిక పొదుపు ఖాతా తెరవవచ్చును. అట్టి ఖాతాలో కనీస మొత్తం నిల్వ (డిపాజిట్) అవసరం లేదు.
- ఈ బ్యాంకు ఖాతాలో మన రోజువారీ పొదుపును దాచుకోవచ్చు, ఖాతాలో ఎప్పుడైనా సొమ్ము జమ చేసుకోవచ్చు, అవసరములకు తీసుకుని వాడుకోవచ్చును. ఈ సేవలకు ఎటువంటి రుసుము వసూలు చేయబడదు.
- ప్రభుత్వ పథకాల తాలుకు రాయితీలు నేరుగా ఖాతాలో జమచేయబడతాయి.
- దేశంలో ఎక్కడికైనా సులభంగా నగదు బదిలీ చేసుకొనవచ్చును.

Pradhan Mantri Jan Dhan Yojna



- బ్యాంకులో ప్రాథమిక పొదుపు ఖాతా చేర్చేటప్పుడే రూపే డెబిట్ (ఏటియం) కార్డు జారీ చేస్తారు.
- ఈ కార్డు ఉన్నవారికి ఒక లక్ష రూపాయలు వరకు ప్రమాద భీమా సౌకర్యం ఉంటుంది.
- 30,000 రూపాయలకు ఉచిత జీవిత భీమా సదుపాయం ఉంటుంది.
- ఈ బ్యాంకు ఖాతా ద్వారా 6 నెలల కాలము సక్రమంగా లావాదేవీలు నడిపినట్లయితే 5000 ఓవర్ డ్రాఫ్ట్(అప్పు) ఇస్తారు.
- ఖాతాదారు తొలి రుణమును సక్రమముగా చెల్లించినచో హామీ లేకుండా రుణపరిమితిని 15000 వరకు పెంచుతారు.

### జన్-ధన్ యోజన పొదుపు ఖాతాదారు బ్యాంకులో పొందు ఇతర సదుపాయాలు.

- కిసాన్ క్రెడిట్ కార్డు పొందవచ్చును.
- కాలపరిమితి డిపాజిట్లు మరియు రికరింగు (అమృత) డిపాజిట్లు
- పంట రుణములు, ట్రాక్టర్లు మరియు వ్యవసాయ యంత్రముల కొరకు రుణం
- ఖాతాదారు ఆధార్ నంబరును బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసుకొనవచ్చును. తద్వారా ప్రయోజనాలు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి.

జన్-ధన్ యోజన పొదుపు ఖాతా ఎలా తెరవవాలి. జన్-ధన్ యోజన ప్రాథమిక పొదుపు ఖాతా తెరవడం చాలా సులభం. పొదుపు ఖతాకు సంబంధించిన దరఖాస్తును కెవైసి నిబంధనలలో సూచించిన

ధృవపత్రములతో పాటు ఇటీవల తీయించుక్నొ ఒక ఫొటో జతపర్చాలి. వ్యక్తిగత గుర్తింపుకు రుజువుగా ఓటరు కార్డు/ ఆధార్ కార్డు/ పాన్‌కార్డు డ్రైవింగ్ లైసెన్స్‌లాంటివి మరియు చిరునామాకు రుజువుగా టెలిఫోన్ బిల్లు / కరెంట్ బిల్లు/ గ్రామసర్పంచ్/ విఆర్‌వో నుంచి ధ్రువీకరణ పత్రం లాంటి వాటిలో ఏదైనా సమర్పించి ఖాతా తెరవవచ్చును

మరిన్ని వివరముల కోసం: www.pmidy.gov.in.ఆర్థిక సేవల విభాగం ద్వారా లేదా

1800110001 జాతీయ టోల్‌ఫ్రీ నెంబరు

18004258525 రాష్ట్ర టోల్‌ఫ్రీ నెంబర్ల ద్వారా

ప్రధానమంత్రి జన్-ధన్ యోజన ఖాతా ప్రారంభించుకోవచ్చు. తద్వారా అనేక ప్రభుత్వ ప్రయోజనాలు పొందండి


ప్రధానమంత్రి జన్-ధన్ యోజన పథకాన్ని విస్తరించే కార్యక్రమంలో భాగంగా కేంద్రప్రభుత్వం వివిధ రకాలైన సామాజిక భద్రతా పథకాలు ప్రవేశపెట్టడం జరిగినది. వాటిలో మొదటిది-

## ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి భీమాయోజన (పిఎంజెజెబివై)

***పథకం వివరాలు***: ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి భీమాయోజన పథకం అనేది ఒక సంవత్సర కాలానికి వర్తించే జీవిత భీమా పథకం. ప్రతి సంవత్సరం ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం పునరుద్దరించుకొనే అవకాశం కలదు. జీవిత భీమా సంస్థలు కొన్ని నియమ నిబంధనలకు లోబడి బ్యాంకులతో ఒప్పందం కుదుర్చుకొని ఆమోదం పొందిన తదుపరి ఈ పథకాన్ని అందిస్తాయి. ఇందులో భాగస్వాములైన బ్యాంకులు తమ బ్యాంకు వినియోగదారులకు ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు అలాంటి ఏ భీమా సంస్థతో అయినా స్వేచ్ఛగా ఒప్పందం చేసుకొనవచ్చును.

***ఈ పథకం ప్రత్యేకత:*** పాలసీదారు ఏ కారణం చేత చనిపోయినప్పటికీ ఈ పథకం పరిధిలో భీమా వర్తిస్తుంది. ఈ పాలసీ క్లెయిమ్ చేసుకొనవచ్చును. పాలసీ మొత్తాన్ని బ్యాంక్ సేవింగ్ ఖాతా నుంచే జమ చేస్తారు.

***ఈ పథకానికి అర్హతలు:*** ప్రధానమంత్రి జీవన్-జ్యోతి భీమాయోజన పథకంలో చేరేవారు ఈ పథకాన్ని అమలు చేసే బ్యాంకులో పొదుపుఖాతా కల్గియుండాలి. 18 సంవత్సరాల నుండి 50




సంవత్సరాల మధ్య వయస్సు గల ఖాతాదారులు అందరూ ఈ పథకంలో చేరేందుకు అర్హులు. ఒకసారి చేరిన పాలసీదారు 55 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు వార్షిక ప్రీమియం చెల్లిస్తూ జీవిత భీమా సదుపాయం పొందవచ్చును. ఒకటి కంటే ఎక్కువ బ్యాంకులలో ఖాతాలు కలిగియున్న ఖాతాదారులు ఏదైనా ఒక బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే ఈ పథకంలో చేరేందుకు అర్హత ఉంటుంది.

***వార్షిక ప్రీమియం:*** ఒక సభ్యునికి సంవత్సరానికి 330 రూపాయలు వార్షిక ప్రీమియంగా చెల్లించాలి. (అనగా రోజుకు ఒక రూపాయి కంటే తక్కువ) ప్రీమియం మొత్తాన్ని ఒకేసారి ఖాతాదారుని పొదుపు ఖాతా నుంచి ఆటో-డెబిట్ (స్వయం చాలిక ఖర్చు) చేయుట ద్వారా ప్రతి సంవత్సరం మే 31వ తేది లోగా, ఒక సంవత్సర కాల జీవిత భీమా రక్షణ కొరకు తీసుకోవడం జరుగుతుంది.

***నమోదు కాలము మరియు విధానము:*** ఈ పథకం ప్రారంభంలో జూన్ 1, 2015 నుండి 31మే 2016 వరకు భీమా రక్షణ గల కాలానికి ఈ పథకంలో చేరాలనుకొనే సభ్యులు 31 మే 2015 నాటికి తమ పేర్లను నమోదు చేసుకొని ఉండాలి. వార్షిక చందా 330 రూపాయల మొత్తము నిర్దేశిత పొదుపు ఖాతా నుండి ఆటోడెబిట్ చేయుటకు తమ అంగీకారాన్ని నిర్ణీత నమూనాలో బ్యాంకుకు సమర్పించాలి.

ఆలస్యంగా చేరుట ఎలా? అయితే ఆలస్యంగా ఈ పథకములో చేరగోరేవారు మిగిలిన కాలానికి వర్తించేలా 31 ఆగష్టు 2015 వరకు నమోదు చేసుకొనే అవకాశం ఉంది. ఈ గడువును భారత ప్రభుత్వం మరో మూడు నెలలు అనగా 30 నవంబర్ 2015 వరకు పొడిగించవచ్చును. ఆ తరువాత ఈ పథకంలో చేరాలనుకునేవారు నిర్ణీత నమూనాలో తాము ఆరోగ్యంగా ఉన్నట్లు స్వీయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించడంతో పాటుగా వార్షిక ప్రీమియం మొత్తాన్ని చెల్లించి మిగిలిన కాలానికి భీమా రక్షణ వర్తించేలా సభ్యత్వం పొందాలి.

ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం ఒక విశిష్ట వినూత్న పథకం. ఎందుకంటే ఈ పథకం క్రింద నమోదు అయిన పాలసీదారు ఏ కారణంచేతనైనా మరణించినట్లయితే, ఈ పాలసీని క్లెయిమ్ చేసుకోవచ్చు. మరణం ప్రమాదవశాత్తు అవనక్కరలేదు. ఇటువంటి భీమాసౌకర్యం కేవలం 330 రూపాలయకే మరియే ఇతర భీమా పథకాలలో వర్తించడం అరుదు. సహజ మరణానికి సైతం జీవితభీమా రక్షణ వర్తించడం విశేషం.

## ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన (పిఎంఎస్‌బివై)

ప్రధానమంత్రి జన్-ధన్ యోజన పథకాన్ని విస్తరించే కార్యక్రమంలో భాగంగా ప్రవేశపెట్టబడిన 3 రకాలైన సామాజిక భద్రతా పథకాలో రెండవది ఈ పథకం. ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన పథకం అనేది ఒక సంవత్సర కాలానికి వర్తించే జీవిత భీమాపథకం. ప్రతి సంవత్సరం ఏ సంవత్సరానికి ఆ సంవత్సర పునరుద్దరించుకొనవచ్చును.

ఈ పథకములో భీమారక్షణ అనేది ప్రమాదవశాత్తు మరణమునకు మరియు అంగవైకల్యానికి మాత్రమే వర్తిస్తుంది.

ప్రభుత్వరంగ సాధారణ భీమా కంపెనీలు మరియు అవసరమైన అనుమతులు పొంది ఒకే విధమైన షరతులతో ఈ పథకాన్ని అందించే ఇతర సాధారణ భీమా కంపెనీలు బ్యాంకులతో అనుసంధానమై ఈ పథకాన్ని అమలు చేస్తాయి. బ్యాంకులు తమ ఖాతాదారుల కోసం ఈ పథకాన్ని అందించటానికి ఏ భీమాకంపెనీ భాగస్వామ్యంతోనైనా నిర్వహించటానికి స్వేచ్ఛ కలిగి ఉంటాయి.

***పథకానికి అర్హతలు:*** సురక్ష భీమా యోజన పథకం ద్వారా భీమా రక్షణ పొందాలని కోరుకునేవారు మొదటిగా ఈ పథకాన్ని అమలు చేసే బ్యాంకులలో పొదుపుఖాతా(సేవింగ్ అకౌంట్) కలిగి ఉండాలి. 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల మధ్య వయస్సు కల్గిన ఖాతాదారులందరికీ ఈ పథకం వర్తిస్తుంది. ఒకటి కంటే ఎక్కువ బ్యాంకులలో ఖాతాలు కలిగియున్న ఖాతాదారులు ఏదేని ఒక బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే ఈ పథకంలో చేరేందుకు అర్హులు అవుతారు. బ్యాంకు ఖాతాకు – ఆధార్‌కార్డు ప్రాథమిక కెవైసి ( మీ ఖాతాదారుని తెలుసుకొండి)గా ఉంటుంది.

***నమోదు విధానము–కాలవ్యవధి:*** ప్రధానమంత్రి సురక్ష భీమాయోజన పథకం యొక్క భీమా రక్షణ ఒక ఏడాది కాలానికి వర్తిస్తుంది. భీమారక్షణ కాలవ్యవధి జూన్ 1వ ప్రతి సంవత్సరం మే 31వ తేదీన నిర్దేశిత ధరఖాస్తును సమర్పించి పథకములో తిరిగి చేరవచ్చును మరియు పొదుపు ఖాతా నుండి ఆటో–డెబిట్ (స్వయం చాలిక ఖర్చు) చేయటం ద్వారా వార్షిక ప్రీమియం చెల్లింపు చేయవచ్చును. నమోదు కావడానికి మొదటి ఏడాది 31 ఆగష్టు 2015 వరకు వ్యవధి ఉంటుంది. ఈ పథకం ప్రవేశపెట్టబడిన తొలిఏడాది కనుక కేంద్ర ప్రభుత్వం మరో 3 నెలల పాటు అనగా 30 నవంబర్ 2015 వరకు నమోదు చేసుకోటానికి వ్యవధి ఇవ్వడం జరిగినది. వార్షిక ప్రీమియం చెల్లించి ప్రత్యేక నియమ నిబంధనలకు లోబడి ఈ పథకంలో చేరవచ్చును. ఈ పథకం నుండి ఎప్పుడైనా వైదొలిగిన










వ్యక్తులు/ పథకం కొనసాగుతున్నప్పుడు ప్రతి సంవత్సరం అర్హులైన కొత్తవారు చేరవచ్చును.

***ప్రీమియం చెల్లింపు:*** సంవత్సరానికి 12 రూపాయలు ఈ పథకం క్రింద వార్షిక భీమా రక్షణ ఖాతాదారుడు చెల్లించవలసి ఉంటుంది. పథకం కొనసాగింపుకు లోబడి ఖాతాదారుడు ప్రతి సంవత్సరం ప్రీమియం చెల్లింపు కోసం కాలపరిమితి లేని దీర్ఘకాలిక అంగీకారమును/ ఆటో–డెబిట్ అధికారాన్ని బ్యాంకుకు ఇవ్వవచ్చును.

***ప్రయోజనములు:***

- మరణము లేదా మృతి చెందితే 2 లక్షల రూపాయల బీమా వర్తిస్తుంది.
- రెండు కళ్ళుగాని రెండు చేతులుగాని/ రెండు కాళ్ళుగానీ పూర్తిగా నష్టపోయినా మరియు ఒక కన్ను పూర్తిగా చూపు కోల్పోయినా 2 లక్షల రూపాయల బీమా.
- ఒక కన్నులేదా చెయ్యిలేదా కాలు(పాదం) పూర్తిగా పనిచేయకపోయినా 1 లక్ష రూపాయలు బీమా

శాశ్వత అంగవైకల్యానికి 2 లక్షల రూపాయలు మరియు పాక్షిక అంగవైకల్యానికి ఒక లక్ష రూపాయలు లబ్దిదారుడు పొందగలడు ప్రమాదవశాత్తు మరణానికి 2 లక్షల రూపాయలు పాలసీదారుని మరణానంతరం నామినీకి భీమా పరిహారం అందజేయబడుతుంది.

## అటల్ పింఛన్ యోజన (ఏపివై)

ప్రధానమంత్రి జన్–ధన్ యోజన పథకాన్ని విస్తరించే కార్యక్రమంలో భాగంగా ప్రవేశపెట్టబడిన 3 రకాలైన సామాజిక భద్రతా పథకాలలో 3వ పథకమే అటల్ పింఛన్ యోజన (ఏపివై).

***ఈ పథకం లక్ష్యం :*** భారతదేశంలోని అసంఘటిత రంగంలో పనిచేస్తూ పింఛను సదుపాయం లేని కార్మికులకు వృద్ధాప్యంలో ఆసరా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వినూత్న పథకమే 'అటల్ పింఛన్ యోజన' పథకం. ఈ పథకం ద్వారా అసంఘటిత రంగాల్లోని కార్మికులు తమ ఉద్యోగ విరమణ అనంతరం అనందంగా జీవించేలా స్వచ్ఛందగా పొదుపు చేసేందుకు వారిని ప్రోత్సహిస్తుంది. ఏపివై జాతీయ పింఛను వ్యవస్థ ద్వారా పిఏఆర్‌డిఏ యాజమాన్యంలో నడిచే భారత ప్రభుత్వ పథకం.




***అర్హతలు :*** 1) 18 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల వయస్సు లోపువారు ఈ పథకానికి అర్హులు 2) భారతీయ పౌరుడై ఉండి అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుడై ఉండాలి 3. అర్హత గల సేవింగ్ బ్యాంకుఖాతా ఉన్నవారంతా ఈ పథకంలో చేరటానికి అర్హులు 4. నమోదు చేసుకొనే వ్యక్తి ఖచ్చితంగా ఆధార్ మరియు సెల్‌నంబర్ కలిగిఉండాలి.

***నెలవారీ పొదుపు మొత్తం:*** 18 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఈ పథకంలో చేరవచ్చు. కనీసం 20 సంవత్సరాలు ఈ పథకంలో కొనసాగాలి. 18 సంవత్సరాల వయస్సులో ఈ పథకంలో చేరితే 60 సంవత్సంరాల తరువాత 1000 పింఛన్ పొందాలంటే ప్రతి నెలా 42 రూపాయలు చెల్లించాలి. 5000 పింఛను పొందాలంటే ప్రతినెలా రూ. 210 చొప్పున చెల్లించాలి. 60 సంవత్సరాలు నిండిన తరువాత పింఛను లభిస్తుంది. ఈ పథకంలో చేరిన నాటి నుండి చెల్లించిన మొత్తం ఆధారంగా నెలవారీ పెన్షన్ ఎంత అనేది నిర్ణయిస్తారు. (ఈ విధంగా రూ. 1000 నుండి రూ. 5000 రూపాయల వరకు పింఛన్ లభించే అవకాశం ఉంటుంది)

***అటల్‌ఫింఛన్ యోజన ప్రయోజనాలు:*** 1) సభ్యుడు 5 సంవత్సరాల కాలవ్యవధిలో చేసే పొదుపు మొత్తంలో 50% లేదా ఏడాదికి రూ. 1000. ఏది తక్కువ అయితే అది భారత ప్రభుత్వం చెల్లిస్తుంది. చట్టబద్దమైన సామాజిక భద్రతా పథకాలు వర్తించనివారు మరి యు ఆదాయపన్ను పరిధిలోనికి రానివారికి మాత్రమే ప్రభుత్వం సహ విరాళం అందుబాటులో ఉంటుంది. 2) పొదుపును బట్టి రూ. 1000 నుండి రూ. 5000 వరకు కనీస నెలవారీ ఫించను అందించబడుతుంది. 3) 60 సంవత్సరాల వయస్సు అనంతరం ఈ పథకం నుండి వైదొలగవచ్చును. అప్పటినుండి పింఛను చెల్లింపులు మొదలవుతాయి. 4) చందాదారుడు చనిపోయినచో పెన్షన్ అతని భార్యకు/ భర్తకు అందజేయడం జరుగుతుంది. 5) ఇరువురు చనిపోయినచో పెన్షన్ మొత్తం వారి వారసులకు అందజేస్తారు 6) ఈ లబ్ధి భారత ప్రభుత్వంచే హామీ పొందపరచబడినది.

పై అంశాలను నిశితంగా గమనించినట్లయితే అటల్ పెన్షన్ యోజన పథకం అసంఘటిత రంగంలోని భారతీయ కార్మికులకు ఒక వరం వంటిదని నిస్సందేహంగా చెప్పవచ్చును.

## సుకన్య సమృద్ధియోజన పథకం

ఆడపిల్లలు తల్లిదండ్రులకు భారం అనే భావనను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం సంకల్పించినది. ఇందులో భాగంగా బాలికల సంరక్షణార్థం ఇటీవల సుకన్య సమృద్ధి యోజన అనే ఒక విశిష్ఠమైన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తపాల శాఖ పర్యవేక్షణలో ఈ పథకం అమలు జరుగుతుంది. 'సుకన్య సమృద్ధి యోజన పథకం' ఆడపిల్ల పాలిట ఒక వరం లాంటిది అని చెప్పవచ్చును. ఈ పథకం ఖాతా ద్వారా పొదుపు చేసి పొందే ప్రయోజనాలు భవిష్యత్‌లో ఆడబిడ్డల ఉన్నతవిద్య/ ఉపాధి కల్పన/ వివాహఖర్చులకు అండగా నిలుస్తాయి.



***ఈ పథకానికి అర్హతలు***

సుకన్య సమృద్ధి యోజన ఖాతా శిశువు (ఆడబిడ్డ) పుట్టిన నాటి నుండి పదేళ్ళ వయస్సు వచ్చే వరకు బాలికల పేరుతో ప్రారంభించవచ్చును. పథకం ప్రారంభించిన మొదటి సంవత్సరం ఒక సంవత్సరం గ్రేస్ పీరియడ్ ఇవ్వడం జరిగింది. ఈ పథకం కుటుంబంలోని ఇద్దరు బాలికలకు మాత్రమే వర్తిస్తుంది. ఈ పథకం క్రింద ఖాతాలో ప్రతి సంవత్సరం రూ. 1000 తగ్గకుండా జమచేయాలి. లేనిచో ఖాతా నిలిపివేయాలి. తిరిగి సంవత్సరానికి రూ. 50 అపరాధ రుసుంచెల్లించి ఖాతాను అమలులోకి తేవలసి ఉంటుంది. ఈ పథకంలో సంవత్సరానికి రూ. 1000 నుండి రూ. 1,50,000 రూపాయలు వరకు జమచేయవచ్చును. ఈ ఖాతా కాలపరిమితి 21 సంవత్సరాలు.

***పథకం ప్రయోజనాలు***

సుకన్య సమృద్ధి యోజన ఖాతా పొందిన వారికి సంవత్సరానికి అత్యధికంగా 9.2% చక్రవడ్డీ పొందే సౌకర్యం కలదు. బాలికకు 14 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు రోజువారీ, నెలవారీ, వార్షికంగా 1000 రూపాయల నుండి 1,50,000 రూపాయలకు మించకుండా జమచేయవచ్చును. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80 క్రింద ఆదాయ పన్ను మినహాయింపు సౌకర్యం కూడా కలదు. బాలికకు 21 సంవత్సరాలు నిండిన తరువాత ఖాతా మెచ్యూరిటీ అవుతుంది. అప్పటి వరకు పొదుపు చేసిన మొత్తాన్ని అప్పటి ఆర్థిక సంవత్సరానికి 9.2% వడ్డీ అందజేస్తారు. 14 సంవత్సరాలలో ప్రభుత్వం ప్రకటించిన




వడ్డీ ఖాతాలోకి జమ చేస్తారు. ఈ ఖాతా ఉన్న బాలికకు 18 సంవత్సరాలు నిండాగానే ఖాతాలో ఉన్న మొత్తం నుండి 50% ఋణంగా తీసుకునే అవకాశము ంంది. 21 సంవత్సంరాలు వచ్చిన తరువాత ఖాతా మెచ్యురిటీ కాలం ఉన్నప్పటికి, 18 సంవత్సరాలు నిండిన తరువాత బాలికకు ఎప్పుడు వివాహం అయితే అప్పుడు ఖాతా మెచ్చురిటీ అవుతుంది. ఈ సుకన్య సమృద్ధి యోజన ఖాతాపై ఎటువంటి లావాదేవీలు జరిపే అవకాశం ఉండదు.

### *నమోదు విధానం*

సుకన్య సమృద్ధి యోజన ఖాతాను అన్ని తపాలా కార్యాలయం (పోస్టాఫీస్) లలో తెరవవచ్చును. ఇందుకు కావలసిన పత్రములు–

1. బాలిక పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం

2. తల్లి/తండ్రి లేదా గార్డియన్ జాయింటు ఫొటో

3. ఆధార్ కార్డునకు నకలు మరియు ఇతర గుర్తింపు పత్రాలతో సమీపంలోని పోస్టాఫీస్‌లో సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరవవచ్చును.

ఆడబిడ్డల సంక్షేమం/ సాధికారత కొరకు ఈ పథకం ప్రవేశపెట్టబడింది. ప్రతి ఆడపిల్లల తల్లిదండ్రులు ఈ పథకం గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలి.

ఆడపిల్లల ఉన్నతవిద్య, ఉపాధికల్పన మరియు వివాహ ఖర్చులు వారి భవిష్యత్‌కి బంగారు బాటలు వేయడానికి ఈ పథకం ఎంతో తోడ్పడుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. మరి న్ని వివరాల కోసం మీకు సమీపంలో ఉన్న తపాలా కార్యాలయం (పోస్టాఫీస్)లో సంప్రదించండి.

## ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం

దేశంలో నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకం అమలులోకి తెచ్చింది. ఈ మేరకు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ దేను పురస్కరించుకుని జూలై 15న ప్రధానమంత్రి కౌశల్ వికాస్‌యోజన (పీఎంకేవీవై) పథకాన్ని ప్రారంభించింది. యువతలో స్కిల్స్ పెంపొందించడంతోపాటు, వారికి ఉపాధి కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా పథకం గురించి ప్రత్యేక కథనం..

### *దరఖాస్తు ఇలా..*

ఈ పథకంలో చేరడానికి నిరుద్యోగులు నేరుగా నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్ఎస్‌డీసీ) కాల్‌సెంటర్ 88000 55555కు కాల్ చేసి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. తర్వాత వెబ్‌సైట్లో కోర్సు, ట్రైనింగ్ సెంటర్లను ఎంచుకోవాలి.

ఈ పథకం కింద 19 రంగాల్లో శిక్షణ పొందవచ్చు. ఇవన్నీ చిన్న తరహా రంగాలకు చెందినవే. వీటిలో శిక్షణ పొందిన తర్వాత ఉద్యోగాలు సైతం పొందవచ్చు. మరోవైపు స్వయం ఉపాధికి అవకాశం ఉంది. శిక్షణ అనంతరం అసెస్‌మెంట్ టెస్ట్ (అంచనా పరీక్ష) నిర్వహిస్తారు. ఇందు కోసం సర్వీస్ సెక్టార్ అభ్యర్థులు రూ. 800, తయారీ రంగ అభ్యర్థులు రూ. 1200 ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ ఇస్తారు. అసెస్‌మెంట్ టెస్ట్‌లో ఫెయిల్ అయిన వారికి తిరిగి శిక్షణ అందించాల్సిన బాధ్యత ఆయా ఏజెన్సీదే. రీ అసెస్‌మెంట్ ఫీజును ఆయా ఏజెన్సీయే భరించాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికెట్ ఆధారంగా ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు.

### *పథకానికి అర్హతలు, ప్రయోజనాలు...*



- భారత జాతీయత కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకంలో చేరేందుకు అర్హులే.
- వయోపరిమితి కూడా లేదు. అన్నీ వయసుల వారు చేరవచ్చు
- విద్యార్హతతో సంబంధం లేకుండానే ఉపాధి పొందే అవకాశం
- ఉద్యోగాల కోసం నిరుద్యోగులు రెజ్యూమ్ పట్టుకుని తిరగాల్సిన అవసరం ఉండదు.
- బోగస్ ట్రైనింగ్ సెంటర్ల చేతిలో మోసపోవడానికి ఆస్కారం ఉండదు.
- శిక్షణ కోసం రూ. వేలు వెచ్చించనవసరం లేదు.
- ఒకే వ్యక్తి ఎన్ని కోర్సులనైనా ఎంచుకోవచ్చు. ఎన్ని సార్లయినా శిక్షణ పొందవచ్చు. కానీ, మానిటరీ రివార్డు మాత్రం ఒక్కసారే వర్తిస్తుంది.
- శిక్షణనిచ్చిన ట్రైనింగ్ పార్టనర్ ప్లేస్‌మెంట్ కల్పించాల్సి ఉంటుంది.




❁ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం, ఆన్‌లైన్‌లోనే స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లను ఎంచుకోవడం ఈ స్కీమ్ ప్రత్యేకత.

❁ నైపుణ్య అభివృద్ధి ద్వారా యువశక్తిని దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు ఈ పథకం దోహదం చేయనుంది.

### *ప్రాసెసింగ్ ఇలా..*

మొదట పీఎంకేవీవై వెబ్‌సైట్‌కి వెళ్లాలి. అక్కడ పీఎంకే వీవై ప్రాసెస్ అనే ఆప్షన్‌తోపాటు 5 రకాల స్టెప్స్ దర్శనమిస్తాయి. వాటిలో మొదట ఫైండ్ ఏ ట్రైనింగ్ సెంటర్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. రాష్ట్రం, జిల్లా.. నేర్చుకోవాల్సిన స్కిల్ పేర్లను ఎంచుకోవాలి. ఫైండ్ నవ్ ఆప్షన్‌ను క్లిక్ చేయగానే మీరు కోరుకునే ట్రైనింగ్ సెంటర్లు పేర్లతో సహా ప్రత్యక్షమవుతాయి. ఆ తర్వాత కోర్సును ఎంచుకుంటే ఆయా వివరాలు నెట్‌లో లభ్యమవుతాయి.

### *కౌశల్ మేళాలు..*

పీఎంకేవీవై పథకంలో చేరడానికి జిల్లా స్థాయిలో నిర్వహించే కౌశల్ మేళాలను సైతం నిర్వహిస్తున్నారు. ఇందులో అభ్యర్థులను ఎంపిక చేయడంతోపాటు అర్హులకు ప్లేస్‌మెంట్స్ కూడా కల్పిస్తారు. ట్రైనింగ్ పార్టనర్స్, ట్రైనీలు, సంస్థలకు ఈ కౌశల్‌మేళాలు వారధిగా పనిచేస్తాయి.

### *మానిటరీ రివార్డు...*

శిక్షణాకాలంలో అభ్యర్థులకు మానిటరీ రివార్డుగా కొంత మొత్తాన్ని ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఇందుకోసం ఆయా అభ్యర్థి ఆధార్‌కార్డు నెంబర్‌ను సమర్పించాలి. ఈ రివార్డును ట్రైనీ బ్యాంక్ ఖాతాలో జమచేస్తారు. ట్రైనీకి అకౌంట్ లేకపోతే ట్రైనింగ్ పార్ట్‌నర్ కొత్తగా తెరిపించాల్సి ఉంటుంది. కాగా, ఇందులో మొత్తం ఆరు నేషనల్ అక్యుపేషనల్ స్టాండర్స్ లెవల్స్ అందుబాటులో ఉన్నాయి. ఒక్కో లెవల్ వారికి ఒక్కో రివార్డు లభిస్తుంది.

### *స్కిల్ ట్రైనింగ్ రివార్డులు*

| లెవల్ | తయారీ, నిర్మాణ రంగాలు | ఇతర రంగాలు |
|---|---|---|
| 1-2 | రూ. 7500 | రూ. 5000 |
| 3-4 | రూ. 10,000 | రూ. 7500 |
| 5-6 | రూ. 12, 500 | రూ. 10.000 |

తెలంగాణలో 700 ట్రైనింగ్ పార్ట్‌నర్ కేంద్రాలు నమోదయ్యాయి. మొత్తం 25 స్కిల్ కౌన్సిల్ సెక్టార్లు, 446 జాబ్‌రోల్స్ ఉండగా ఇప్పటివరకు 9 మంది ఈ స్కీమ్‌లో పేర్లను నమోదు చేసుకున్నారు. తెలంగాణలోని 700 ట్రైనింగ్ కేంద్రాలు ఉండగా సింహభాగం గ్రేటర్ పరిధిలోనే ఉన్నాయి. ఐటీ, ఐటీఈఎస్, బ్యాకింగ్ అండ్ ఫైనాన్సియల్ సర్వీసెస్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అండ్ రియల్ ఎస్టేట్, టూరిజం అండ్ హాస్పిటాలిటి సర్వీసెస్‌లో అత్యధిక మంది శిక్షణ పొందుతున్నారు.

### *గతం కంటే భిన్నం*

గతంలో ఇలాంటి పథకాలెన్నో వచ్చినా ప్రస్తుత పథకానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. గతంలో కేవలం ట్రైనింగ్ ఇచ్చి వదిలివేయగా ఇప్పుడు అభ్యర్థికి ప్లేస్‌మెంట్ కల్పించాల్సి బాధ్యత ట్రైనింగ్ పార్ట్‌నరే తీసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థి ఫెయిల్ అయినా పార్టనరే బాధ్యత వహించాలి. ప్లేస్‌మెంట్ కల్పించిన తర్వాత ఆయా సంస్థల్లో పనిచేస్తున్న వివరాలు, ఏడాది కాలంపాటు ఎస్ఎస్‌డీసీకి పంపించాల్సి ఉంటుంది. అభ్యర్థి ఏడాదిపాటు పనిచేయకుంటే పార్టనరే మరో సంస్థలో చేరించాలి. ఇలాంటి బాధ్యతాయుతమైన మార్గదర్శకాలు కలిగిన పీఎంకేవీవైతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయన్న అంచనాలున్నాయి.

### *శిక్షణ పొందే రంగాలివే....*

❁ ఐటీ, ఐటీఈఎస్ సెక్టార్ స్కిల్స్

❁ ఆటో అండ్ ఆటో విడిభాగాలు.

❁ బ్యాకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్

❁ బ్యూటీ అండ్ వెల్‌నెస్

❁ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అండ్ రియల్ ఎస్టేట్

❁ క్యాపిటల్ గూడ్స్

❁ ఎలక్ట్రానిక్స్ ఐటీ అండ్ హార్డ్‌వేర్

❁ జెమ్స్ అండ్ జ్యూవెలరీ

❁ హెల్త్‌కేర్ లైఫ్‌సైన్సెస్

❁ లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్స్

❁ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్

❁ ఆర్గనైజ్‌డ్ రీటైల్

❁ ప్లంబరింగ్, సెక్యూరిటీ

❁ టెలికాం

❁ టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్లూమ్

❁ టూరిజం అండ్ హాస్పిటాలిటీ సర్వీసెస్

❁ వ్యవసాయం

– కోమట్ల త్రినాధ రెడ్డి, *బి.ఎన్.వి.*

# సైన్సు & టెక్నాలజీ రంగంలో దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్రం

**నూతన తెలంగాణ రాష్ట్రం శాస్త్ర సాంకేతికరంగలో దూసుకు పోతుంది. అందుకు కారణం రాష్ట్ర ఐ.టి శాఖామంత్రి కె.టి.ఆర్ తనదైన శైలిలో వివిధ కంపెనీలు, దేశాలు, యునెస్కో, యు.ఎన్.డి.పి, అమెరికా జపాన్ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకొని హైదరాబాద్, తెలంగాణ పట్టణాలు, గ్రామాలకు కనెక్టివిటీ లింకును ఏర్పరిచి అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.**

ఆటంకం లేకుండా లైసెన్సులు, పర్మిట్స్, నీళ్ళు, విద్యుచ్ఛక్తి అనుమతుల ను సింగిల్ విండో ద్వారా కలుగ జేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

కేటిఆర్ విదేశీ ప్రతినిధులతో చర్చించి వారిని దేశంలో ఆహ్వానించటానికి కావలసిన స్కిల్, సంభాషణ చాతుర్యం,



భాష పర్సనాలిటీలను కలిగి ఉండడంతో కేటిఆర్ విదేశీ పెట్టుబడులను తెలంగాణ రాష్ట్రానికి తెచ్చేందుకు గట్టి ప్రయత్నం చేశారు. చేస్తున్నారు. చివరకు దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో నడుస్తున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసు హైదరాబాద్‌లో తమ కంపెనీలున్నా కూడా వాటిని విస్తరింపజేయడానికి నిర్ణయించింది. అదేవిధంగా టాటా కంపెనీలో స్థిరీకరించడానికి నిర్ణయించింది. ఇది చాలా మంచి పరిణామం. టాటా కంపెనీ పరిశ్రమ రంగంలో పరి శోధన, సాంకేతిక రంగలో పరిశోధన చేసి ఆ పరిజ్ఞానాన్ని ముందు తెలంగాణ రాష్ట్రంలో విస్తరింపజేయటానికి నిర్ణయించింది.

కేటిఆర్ అమెరికాలోని తన అనుభవాలను రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగించడం ఒక విధంగా ముందడుగు. తెలంగాణా రాష్ట్రంలో కేటిఆర్ చూపిన సాంకేతిక బాటను అందుకునే కంపెనీలు కాని, మానవ వనరులు కాని ఇంకా పైకి రాలేదు. ఇప్పుడిప్పుడే తెలంగాణ రాష్ట్రం తన సాంకేతిక బాటను, సాంకేతిక దృక్పథాన్ని ఒక రోడ్ మ్యాప్‌ను ఏర్పరుచుకొని ముందుకు వెళుతున్నారు.

కేటిఆర్ ఇటీవలకాలంలో చురుకుగా విదేశీ కంపెనీలతోను, దేశీయ కంపెనీలతోను ఒప్పందాలను కుదుర్చుకొని హైదరాబాద్, మెదక్, వరంగల్ కారిడార్‌లలో సాంకేతిక హాబ్‌లను నెలకొల్పేందుకు చర్యలు తీసుకొన్నారు. దాదాపు ప్రైవేటు రంగంలో దాదాపు ఐదుల క్షల ఉద్యోగాలు వచ్చే మూడేళ్ళలో కల్పించేందుకు అమెరికన్, జపాన్, మలేషియా కంపెనీలు తమ ఇష్టాన్ని వ్యక్తం చేశాయి. ఆ కంపెనీలకు ఏ

విప్రో, ఇన్‌ఫోసిస్ లతో టి.సిఎస్ కూడా తన శక్తి సామార్థ్యాల విస్తరణ చేపట్టింది. ఇందుకు కావలసిన కోలేబరేషన్ ఒప్పందాలను టాటా కంపెనీల అధినేత చైర్మన్ సైరస్ మిస్త్రీతో కుదుర్చుకొన్నారు. త్రిపుల్ఐటి లో

ఇంటిలిజెంట్ సిస్టమ్‌ను మరింత పెంచి విస్తరించడానికి అంగీకారం కుదిరింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవాలంటే ట్రిపుల్‌ఐటిలో మరిన్ని పరిశోధనలు జరిపి తెలంగాణ రాష్ట్రమంతటా విస్తరించే విధంగా చూడవలసిన బాధ్యత ప్రభుత్వం మీదనే ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐ.టి. పరిశ్రమలకు ఇతర పరిశ్రమలకు 15 రోజుల్లోనే లైసెన్సు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి కెసిఆర్ వివరించారు.



ఇందుకోసం ప్రత్యేక సెల్‌ను కూడా ఏర్పాటు చేశారు. ట్రిపుల్ ఐ.టిలో పరిశోధన సాంకేతిక పరిజ్ఞాన కేంద్రానికి 30 కోట్ల రూపాయలు కేటాయించినట్లు కేసిఆర్ టాటా గ్రూప్ చైర్మన్ సైరస్ మిస్త్రీకి వివరించారు. టిసిఎస్ కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో టాయ్‌లెట్లు నిర్మించడం జరుగుతుందన్నారు.

కెటిఆర్ చొరవతో గ్రామ పంచాయతీలకు ఐటి కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నట్లు అందుకోసం ఇప్పటికే 800 గ్రామాలకు ఐటి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. కె.టి.ఆర్ గ్రామపంచాయతీరాజ్ శాఖ మంత్రిగా మీ సేవ, ఇ-కేంద్రాల ద్వారా మరిన్ని సర్వీసులు అందించేట్లు అభివృద్ధి చేయటానికి చర్యలు చేపట్టారు.

ముఖ్యంగా ప్రభుత్వం అందించే సేవలన్నీ ఒకేచోట దొరికే విధంగా పల్లె సమగ్ర సేవాకేంద్రాలను, గ్రామ పంచయాతీలలో ప్రారంభించడం ద్వారా ప్రభుత్వ సేవలు పల్లె ప్రజలకు మరింత దగ్గరయ్యాయి.

తెలంగాణ పంచాయతీరాజ్‌శాఖలో సాంకేతిక మార్పులతో కనెక్టివిటిని పెంచి పంచాయతీల పనితీరును కంప్యూటర్ ద్వారా మానిటరింగ్ చేయడం గ్రామ పంచాయతీ పన్నులు వసూలు ఎంత చేసింది అనే అంశాలను సేకరించేందుకు సాంకేతిక పరిజ్ఞానం అమలులోకి తెస్తున్నారు.



ఫైబర్ టెక్నాలజీ కనెక్టివిటీ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి ఈ నేపథ్యం పంచాయతీరాజ్ శాఖ ముఖ్యంగా మూడు కార్యక్రమాలను 1. పెన్షన్‌లు అందించడం. 2. ఆహార భద్రతా చట్టం అమలు 3. సన్నబియ్యం పంపిణీని సమర్ధవంతంగా అర్హులకు అందజేయడం జరుగుతుంది. 4. పన్నులు వసూలుచేసి గ్రామాలలోని త్రాగునీరు, పారిశుధ్యం, రోడ్ల నిర్మాణం చేసి ప్రజలకు సౌకర్యవంతమైన జీవనం కల్పించేందుకు కె.టి.ఆర్ తన సామర్ధ్యంతో కృషి చేస్తున్నారు.

హైదరాబాద్ నగరంలో వైఫై టెక్నాలజీని ఉపయోగించడంతో పాటు గ్రామాలలో మాట్ ద్వారా కనెక్టివిటీని సామాన్యులకు అందుబాటులోకి తేవడంలో కెటిఆర్ కృషి ప్రశంసనీయం. అదేవిధంగా రాష్ట్రంలో వరంగల్, కరీంనగర్ పట్టణాలను కూడా పరిశ్రమల కేంద్రాలుగా అభివృద్ధి చేయటానికి ప్రయత్నించడంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి ప్రశంసనీయమైనది.

హైదరాబాద్‌ను తెలంగాణ ఎన్ఆర్ఐలు పెట్టుబడులు పెట్టే విధంగా ఇప్పటికే 18 మందికి లైసెన్సులు మంజూరు చేయడం జరిగింది. అదే రీతిలో తెలంగాణలో మానవ వనరులు సాంకేతిక రంగంలో అంతగా విస్తరించలేదు. దానితో మరిన్ని నాణ్యమైన ఐ.టి. సంస్థలు, మెడికల్ ఫార్మసీ రంగంలో మానవ వనరుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న చర్యలు ప్రశంసనీయం అని చెప్పాలి. తెలంగాణలోనున్న పేదరికాన్ని తొలగించి పల్లెలను బాగుపరిచే పరిజ్ఞానంపై దృష్టి పెట్టి గ్రామాభివృద్ధికి కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

*– సి.ఎం.పి.*

# బహిర్భూమి స్థితిగతుల పరిశీలనపై ఒకరోజ శిక్షణా కార్యక్రమం





**తెలంగాణ రాష్ట్రంలో బహిరంగ మల విసర్జనా రహిత గ్రామాలను ప్రకటించే విషయంలో పరిశీలన & నిర్ధారణ జరిపే అధికారులకు ఒక రోజు శిక్షణను టిసిపార్డు, నీరు-పారిశుద్ధ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు.**

ఈ కార్యక్రమానికి స్వచ్ఛభారత్ తెలంగాణ రాష్ట్ర మిషన్ డైరెక్టర్ శ్రీ కె. విశ్వనాథ్ అధ్యక్షత వహించి రాష్ట్రంలో పరిశుభ్రతను పాటించటం ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమని అన్నారు.

స్వచ్ఛభారత్ భారత్ మిషన్ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ వెంకటేశ్ ఈ విషయంలో పరిశీలన నిర్ధారణ బృందాలు చూడవలసిన వివిధ అంశాలను గురించి వివరించారు.

యూనిసెఫ్, హైదరాబాద్ కన్సల్టెంట్ శ్రీ సుధాకర్‌రెడ్డి, తమ ఉపన్యాసంలో పారిశుధ్ద్య ప్రాముఖ్యతను గూర్చి ప్రస్తుత పరిస్థితి గురించి వివరించారు.

ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలో వివిధ జిల్లాలను ఎంపిడివోలు, ఎపిఓలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరులు పాల్గొన్నారు. బహిర్భూమికి వెళ్ళే వారి మనస్తత్వాన్ని మార్చేందుకు, వారి అలవాటును తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.

బహిరంగ మల విసర్జనా రహిత గ్రామాలను వివిధ స్థాయిల్లో పరిశీలించి తగిన నివేదికలను ఈ తనిఖీ బృందాలు అందిస్తారు. ఈ కార్యక్రమానికి సిడబ్ల్యుఎస్ హెడ్ ఎ. నాగేశ్వర్‌రావు సమన్వయం చేశారు.

*-సి.ఎం.పి.*

# పల్లెల్లో ఐటీ వెలుగులు

**బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేదిశగా రాష్ట్రంలో మరో అడుగు ముందుకు పడింది. సమాచార, సాంకేతిక పరిజ్ఞానం (ఐటీ) కొత్తపుంతలు తొక్కుతున్న నేపథ్యంలో ఆ ఫలాలను గ్రామగ్రామానికీ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె సమగ్ర కేంద్రాల (ఈ-పంచాయతీ) ద్వారా ఈ-గవర్నెన్స్‌కు బీజం వేసింది. ప్రస్తుతం కొన్ని సేవలకే పరిమితమైన ఈ-పంచాయతీలు రాబోయే రోజుల్లో 320 కీలక సేవలను అందించనున్నాయి.**

ప్రస్తుతం జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, పట్టణాలు, నగరాలకు పరిమితమైన మీ-సేవ, ఈ-సేవ కేంద్రాల ద్వారా పౌరులకు సేవలందిస్తున్నట్లుగానే గ్రామాల్లో ఈ-పంచాయతీలు వేర్వేరు సేవల్ని ఒకేచోట అందిచనున్నాయి. మీ-సేవ, ఈ-సేవ, ఈ-పంచాయతీల ద్వారా అందించేందుకు వీలున్న 60 రకాల సేవలను అధికారులు గుర్తించారు. ప్రస్తుతం పల్లె సమగ్ర కేంద్రాల పేరుతో 104 గ్రామాల్లో ఈ కేంద్రాల ఏర్పాటు, మరో 700 గ్రామాలకు విస్తరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## పక్కాగా సమాచారం

పరిపాలనలో పారదర్శకత, అవినీతి నిర్మూలన, స్థానికసంస్థల బలోపేతం లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారు ప్రారంభించిన డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పలు సాఫ్ట్‌వేర్లను జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) రూపొందించింది. ఇందులో ప్రధానంగా పీఆర్ఐఏ సాఫ్ట్, ప్లాన్‌ప్లస్ సాఫ్ట్‌వేర్ల ద్వారా ఈ-పంచాయతీ వ్యవస్థ పనిచేస్తుంది. ఈ సాఫ్ట్‌వేర్ల ద్వారా స్థానిక భాషలో కంప్యూటర్ అప్లికేషన్లు పనిచేస్తాయి. ప్రణాళికను సిద్ధం చేసుకొనే అప్లికేషన్ వేర్వేరు మార్గాల ద్వారా వచ్చే ఆదాయాలను ఒకే పేమెంట్ గేట్‌వే ద్వారా ఇబ్బందులు లేకుండా సులభతరం చేస్తుంది. వివిధ అనుమతుల విషయంలో ఎలాంటి అవినీతికి ఆస్కారం ఉండదు.

గ్లోబల్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా రూపొందిన గ్రాఫ్స్ ఆధారంగా ఉన్నతాధికారులు సమాచారాన్ని తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రధానంగా బీఆర్‌జీఎఫ్ జిల్లాల్లో వినియోగానికి ప్లాన్‌ప్లస్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. దీనికి అనుసంధానిస్తూ మరిన్ని సేవలను అందించే యాక్షన్‌సాఫ్ట్ అనే మరో సాఫ్ట్‌వేర్‌ను పంచాయతీలకు అందించారు. మున్ముందు రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఐసీ రూపొందించిన సర్వీస్‌ప్లస్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించుకొంటుంది. దీని ద్వారా ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్సుల జారీ, వేలాలు, కోర్టు కేసులు, జెడ్పీ ప్రావిడెంట్ ఫండ్, నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీ), పేరు మార్పు సదుపాయం, నల్లా కనెక్షన్లు, భవన నిర్మాణ అనుమతులు, ఆస్తుల విలువ నిర్ధారణ పత్రాలు, వివాహ నమోదు పత్రాలు, ఇంటి యాజమాన్య హక్కు పత్రాలు అందిస్తారు. ఇందులో జారీచేసిన పత్రాల వివరాలు వాటంతట అవే జీఐఎస్ మాడ్యుల్‌ద్వారా మండల, జిల్లా, రాష్ట్ర పోర్టళ్లకు చేరుతుంది.

సామాజిక తనిఖీ కోసం ఎన్ఐసీ రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను కూడా ఈ-పంచాయతీల్లో వినియోగించుకోనున్నారు. సమగ్ర సర్వే డేటాను ఇప్పటికే సేకరించిన నేపథ్యంలో ఆ వివరాలను ఈ సాఫ్ట్‌వేర్లలో అప్‌లోడ్ చేసి, వివిధ పథకాల్లో అర్హులను గుర్తించి మెరుగైన సేవలు అందించే వెసులుబాటు కలుగుతుంది.



శిక్షణ నిర్వహణ పోర్టల్ ద్వారా గ్రామాల్లోని ఎస్‌హెచ్‌జీ మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ-పంచాయతీల నిర్వహణపై కూడా దీని ద్వారా శిక్షణ ఇవ్వవచ్చు.

## గ్రామాలకు విస్తరించిన పౌరసేవా కేంద్రాలు

కేవలం జిల్లా, మండల, పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ-సేవ, మీ-సేవ కేంద్రాల సేవలు పల్లె సమగ్ర సేవా కేంద్రాల (ఈ-పంచాయితీ) ఏర్పాటుతో గ్రామాల్లోకి విస్తరించాయి. గ్రామస్థాయిలో ఎంటర్ ప్రెన్యూర్ (వీఎల్ఈ) ద్వారా ఈ పంచాయతీలను నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో డిగ్రీ అర్హతగల యువతను ఎంపికచేసి ఐటీ శాఖ ద్వారా ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి శిక్షణ ఇచ్చారు.

స్వయం సహాయక సంఘాల ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం స్త్రీనిధి బ్యాంకును ఏర్పాటు చేసింది. దీనికి రాష్ట్రవ్యాప్తంగా 1010 సెంటర్లు ఉన్నాయి. వీటికి సంబంధించిన ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు ఆంధ్రాబ్యాంక్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌తో స్త్రీనిధి సంస్థ ఒప్పందాలు కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా 274 కేంద్రాల్లో ఎస్‌బీహెచ్,

ఆంధ్రాబ్యాంకులకు బిజినెస్ కరస్పాడెంట్ (బీసీ) కేంద్రాలుగా స్త్రీనిధి వ్యవహరిస్తున్నది. ఈ కేంద్రాల నిర్వహణకు ఇంటర్నెట్ సౌకర్యం కోసం ఇప్పటివరకు డాటా కార్డును వినియోగించారు. ఈ కార్డు సేవలు ఆశించినంత వేగంగా లేకపోవడంతో 20 బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ) కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా వీశాట్, వై-మాక్స్, బీఎస్ఎన్ఎల్ బ్రాండ్‌తోపాటు అందుబాటులో ఉన్న ఎంఎోఎస్ (కేబుల్ నెట్‌వర్క్)ల ను ఉపయోగించాలని నిర్ణయించారు.

ప్రస్తుతం బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందుబాటులో ఉన్న పంచాయతీల్లో పల్లె సమగ్ర కేంద్రాల పేరుతో ఈ-పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందులో భాగంగా రాష్ట్రంలోని 274 బిజినెస్ కరస్పాడెంట్ (బీసీ) కేంద్రాల్లో 104 కేంద్రాలకు బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించి, పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేశారు. మిగిలిన కేంద్రాలకు కూడా దశలవారీగా బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. బ్రాడ్ బ్యాండ్ సేవలు అందుబాటులోలేని మారుమూల గ్రామల్లో వీశాట్, వై-మాక్స్, కేబుల్ నెట్‌వర్క్ ద్వారా సేవలందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నది. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని 8700 గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నది.

## ఈ-పంచాయతీల ద్వారా అందిస్తున్న సేవలు

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, వాటిలో పత్రాల్లో సవరణలు, పిల్లల పేర్ల మార్పు, ఇంటిపన్ను, బ్యాంకుల ఆర్థిక సేవలు, స్వయం సహాయక సంఘాల ఆర్థిక కార్యకలాపాల నిర్వహణ, ఆసరా పింఛన్ల చెల్లింపులు, ఉపాధి హామీ పథకం చెల్లింపులు, మీ-సేవ కేంద్రాల సేవలు, ఇతర ప్రభుత్వ సేవలు.

## మీ-సేవ, ఈ-సేవ ద్వారా 24 సేవలు

పౌరుల వద్దకే ప్రభుత్వ సేవల నినాదంతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవ, ఈ-సేవ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రాష్ట్రంలో వేలమందికి ఉపాధి లభించడమే కాకుండా, విస్తృతంగా పౌరసేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.. ఇవి 30 రకాల సేవలను అందిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 24 రకాల సేవలు, గ్రేటర్ హైదరాబాద్‌లో అదనంగా మరో 6 రకాల సేవలు అందిస్తున్నాయి. సేవలకుగాను మీ-సేవా కేంద్రాలు ప్రారంభంలో రూ. 25 నుంచి రూ. 1,000 ల వరకు చార్జీలు వసూలు చేసేవి. ప్రస్తుతం పెరిగిన విద్యుత్, సాంకేతిక చార్జీల కారణంగా రేట్లను పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నది.

## మీ-సేవ ద్వారా అందుతున్న సేవలు

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, వాటిలో పత్రాల్లో సవరణలు, పిల్లల పేర్ల మార్పు, ఇంటిపన్ను, బ్యాంకుల ఆర్థిక సేవలు, స్వయం సహాయక సంఘాల ఆర్థిక కార్యకలాపాల నిర్వహణ, ఆసరా



పింఛన్ల చెల్లింపులు, ఉపాధి హామీ పథకం చెల్లింపులు, మీ-సేవ కేంద్రాల సేవలు, ఇతర ప్రభుత్వ సేవలు.

## మీ-సేవ, ఈ-సేవ ద్వారా 24 సేవలు

పౌరుల వద్దకే ప్రభుత్వ సేవల నినాదంతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవ, ఈ-సేవ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిద్వారా రాష్ట్రంలో వేలమందికి ఉపాధి లభించడమే కాకుండా విస్తృతంగా పౌరసేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఇవి 30 రకాల సేవలను అందిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 24 రకాల సేవలు గ్రేటర్ హైదరాబాద్‌లో అదనంగా మరో 6 రకాల సేవలు అందిస్తున్నాయి. సేవలకు గాను మీ-సేవా కేంద్రాలు ప్రారంభంలో రూ. 25 నుంచి రూ. 1,000ల వరకు చార్జీలు వసూలు చేసేవి. ప్రస్తుతం పెరిగిన విద్యుత్, సాంకేతిక చార్జీల కారణంగా రేట్లను పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నది.

## మీ-సేవ ద్వారా అందుతున్న సేవలు

అడంగళ్/ పహాణీ నకలు, రికార్డు ఆఫ్‌రైట్స్ నకలు (ఆర్ఓఆర్ ఐబీ), ఎఫ్ ఎంబీ నకలు, గ్రామ భౌగోళిక పట్టిక నకలు (విలేజ్‌మ్యాప్), ఎఫ్‌లైన్ పిటిషన్స్, రెవెన్యూ రికార్డుల్లో వివరాల మార్పు (మ్యుటేషన్), భూముల సబ్‌డివిజన్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్ (కులం-స్థానికత-జనన ధ్రువీకరణ) పత్రం, ఓబీసీ ధ్రువీకరణ పత్రం, ఈబీసీ ధ్రువీకరణ పత్రం, వ్యవసాయ ఆదాయ ధ్రువీకరణ పత్రం, నో-ఎర్నింగ్ మెంబర్ (ఆర్జన లేని కుటుంబ) ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల (సామాజిక భద్రత పథకం-ప్రభుత్వ ఉద్యోగులు-పింఛన్లు) ధ్రువీకరణ పత్రం, ఇంక బరెన్స్ సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ పత్రాల ధ్రువీకరణ పత్రం, మనీలెండింగ్ లైసెన్స్ ధ్రువీకరణ పత్రం, అల్లోపతి వైద్యశాల రిజిస్ట్రేషన్, ఆపద్బంధు, ఎన్ఎఫ్‌బీఎస్‌కు దరఖాస్తు, ఎన్ఓసీ (భూములు), తాకట్టు వ్యాపారానికి అనుమతులు, పాఠశాలలు, కళాశాలల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రత్యేకంగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పుట్టిన తేదీల మార్పు, మరణ ధ్రువీకరణ పత్రంలో సవరణలు, పిల్లల పేర్లు మార్పు వంటి సేవలను మీ-సేవ అందిస్తున్నాయి.

◆

# బహిరంగ మల విసర్జనారహిత దిశగా తెలంగాణ రాష్ట్రం

**ప్రస్తుతం పారిశుద్ధ్య సాధనలో మన గ్రామ పంచాయితీల ముందున్న సమస్యల ప్రాధాన్యతాక్రమంలో బహిరంగ మలవిసర్జనదే మొదటి స్థానం. ఎందుకంటే గ్రామీణ ప్రాంతాల్లో వదిలి వేసిన మానవ మలంలో వ్యాధిని కలిగించే క్రిములు అతిపెద్ద సంఖ్యలో ఉంటాయి. అవి మన గ్రామంలోకి, మన ఇంటిలోకి, మనం తినే ఆహారంలోకి మనం త్రాగే నీటిలోకి ఈ క్రింది వాహకాల ద్వారా చేరుకొని వ్యాధులు కలిగిస్తాయి.**

- ☆ చేతి వేళ్ళ ద్వారా
- ☆ గాలి ద్వారా
- ☆ ఈగల ద్వారా
- ☆ నీటి ద్వారా
- ☆ పాదాల ద్వారా
- ☆ వాహనాల ద్వారా

అంతేకాదు ఈ సమస్య ప్రజారోగ్యం, తద్వారా గ్రామీణ ప్రజల ఉపాధి, ఎదుగుదలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపించటమే కాకుండా, మహిళల మర్యాద, భద్రతలకు కూడా భంగం కలిగిస్తుంది. ఇంటిలో మరుదుదొడ్డి సౌకర్యం లేకపోవడం లేదా కట్టిన మరుగుదొడ్డి వివిధ కారణాల వలన వాడకపోవడమే ఈ సమస్యకు మూలం.

ఈ సమస్య తీవ్రతను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం గ్రామజ్యోతి కార్యక్రమం క్రింద పారిశుద్ధ్య ప్రణాళికలో బహిరంగ మల విసర్జన నిర్మూలనకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. కేవలం మరుగుదొడ్ల నిర్మాణాలే కాకుండా, రాష్ట్రం బహిరంగ మల విసర్జనరహిత స్థితికి చేరుకోవటమే లక్ష్యంగా నిర్ణయించుకొని గ్రామ పంచాయితీలకు సంబంధిత శాఖలకు స్పష్టంగా, విపులమైన మార్గదర్శకాలను ఇచ్చింది. క్షేత్రస్థాయిలో ఈ ప్రణాళిక అమలు దశలు పట్టికలో చూపబడ్డాయి.




*ఈ పథకానికి సంబంధించిన ఇతర ముఖ్యమైన అంశాలు*

**నిధులు :** స్వచ్ఛ భారత్ మిషన్ లేదా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం నుండి (స్వచ్ఛ భారత్ మిషన్ క్రింద వ్యక్తిగత మరుగు దొడ్డి ఖర్చు 12000 రూపాయల వరకు ఉండవచ్చు. దీనిపై అదనంగా అయ్యే ఖర్చును లబ్ధిదారుడు భరించాలి.

**ఉద్దేశ్యము:** రాబోయే 4 సంవత్సరాలలో తెలంగాణాలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మరుగుదొడ్డిని వాడుతూ ప్రతి పంచాయితీ బహిరంగ మల విసర్జన రహిత స్థితికి చేరుకోవటం. కేంద్ర ప్రభుత్వం వారు ఇచ్చిన నిర్వచనం ప్రకారం ఓడిఎఫ్ అంటే –

1. గ్రామంలో ప్రతి ఒక్క కుటుంబము / సంస్థ సురక్షిత పద్ధతి ద్వారా మలాన్ని నిర్వహించాలి.

2. గ్రామంలో మానవ మల చాయలు కనపడకూడదు.

మరుగుదొడ్డి నిర్మాణం తరువాత జరిగే ఓడిఎఫ్ ఆడిట్‌లో ఇటువంటి అంశాలు చూస్తారు.

3. గ్రామ పంచాయితీల చొరవ, ఉత్సాహం :

బహిరంగ మల విసర్జన నిర్మూలనా ప్రణాళికను మండలాధికారికి సమర్పించే ముందు గ్రామ పంచాయితీ, నీరు పారిశుద్ధ్య కమిటీ వారు ప్రజలలో వివిధ పద్ధతుల ద్వారా అవగాహన పెంచి, మరుగుదొడ్డి కావాలనే ప్రేరణను వారిలో కలిగించి, వారిని సమాయత్త పరచాలి. అంతేకాకుండా –

- ☆ గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగంగా జరిపిన ఇంటింటి సర్వే ఆధారంగా మరుగుదొడ్డి లేని కుటుంబాల వివరాలను పరిశీలించి మరొక్కసారి ధృవీకరించుకోవాలి.
- ☆ మన గ్రామీణ ప్రాంతాలకు అనువైన ట్విన్ లీచ్‌పిట్ టాయిలెట్ల నిర్మాణం గురించి వాటి పనితీరు, వాటి లోని విడి భాగాల గురించి ప్రజలకు విశదీకరించి నమ్మకం కలిగించాలి.
- ☆ టాయ్‌లెట్ పాన్, పి ట్రాప్, పిట్‌రింగులు, పైపులు, జంక్షన్ బాక్స్ ఇత్యాది భాగాల అవసరం మదింపు చేసిన తరువాత మార్కెట్లో విచారించి సాధ్యమైనంత సరసమైన ధరలతో కొనుగోలుకు ఉపక్రమించటం.
- ☆ ఇటువంటి సిమెంటు రింగులు స్థానికంగానే లభించే మార్గం అన్వేషించి దానివల్ల కలిగే పొదుపు అవకాశాలను వాడుకోవాలి.

## క్షేత్రస్థాయిలో ఈ ప్రణాళిక అమలు దశలు

గ్రామంలోని కుటుంబాల్లో అవగాహన పెంపు, మరుగుదొడ్లి నిర్మాణానికి నిశ్చయం

↓

గ్రామసభ గ్రామ పంచాయితీల తీర్మానము తదితర చర్యలు

↓

గ్రామ పంచాయితీచే ప్రణాళిక తయారు, మండల పారిశుద్ధ్య అధికారి (ఎం.పి.డి.ఓ )కి సమర్పణ

↓

ఎం.పి.డి.ఓ చే పంచాయితీ ప్రణాళికల పరిశీలన, సమగ్ర మండల స్థాయి ప్రతిపాదనలను జిల్లా అధికారులకు సమర్పణ

↓

జిల్లా కలెక్టరు ఆమోదం మేరకు మండల పారిశుద్ధ్య అధికారిచే సంబంధిత పంచాయితీలకు వర్క్ ఆర్డర్ల జారీ

↓

జిల్లా స్థాయిలో RWS/DWMA అధికారుల పరిశీలన పిదప జిల్లా కలెక్టరుచే ఆమోదం

↓

పంచాయితీ నీరు పారిశుద్ధ్య కమిటీ అధ్వర్యంలో మరుగు దొడ్ల నిర్మాణం ప్రారంభం, మార్గదర్శకాల నుగుణంగా కమిటీకి స్వచ్ఛ భారత్ మిషన్ / నరేగా నిధుల దశల వారీ విడుదల

↓

నిర్మాణం పూర్తి అయిన తరువాత పంచాయితీ కమిటీచే నిధుల వినియోగ సర్టిఫికేట్లు సమర్పణ (మండల పారిశుద్ధ్య అధికారి ద్వారా జిల్లా అధికారులకు)

↓

సంపూర్ణంగా ప్రణాళిక అమలైన తరువాత ODF పంచాయితీగా గుర్తింపుకై దరఖాస్తు, ODF ఆడిట్/తనిఖీ ఆధారంగా మండల పారిశుద్ధ్య అధికారిచే బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా గుర్తింపు సర్టిఫికేట్ జారీ



★ స్థానికంగా ఉన్న మేస్త్రీలను గుర్తించాలి.

★ వారివారి టాయిలెట్ల పిట్లను సంబంధిత కుటుంబాలే త్రవ్వటానికి పురమాయించాలి.

★ పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు, పంచాయితీ కార్యాలయంతో పాటు ఇతర పబ్లిక్ సంస్థల టాయిలెట్ల స్థితిని పరిశీలించి, వాటి అవసరాలను కూడా ప్రణాళికలో చేర్చాలి.

★ **బ్యాంక్ అకౌంటు:** పంచాయితీ నీరు పారిశుద్ధ్య కమిటీ ఏదేని ప్రభుత్వ బ్యాంకులో అకౌంటును తెరవాలి. ఈ అకౌంటును సర్పంచ్, పంచాయితీ కార్యదర్శి, స్థానిక వి.ఓ అధ్యక్షులు ఉమ్మడిగా నిర్వహించాలి. ఈ అకౌంటు వివరాలను మండలాభివృద్ధి అధికారికి తెలపాలి ఆ తరువాత మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన నిధులను దశలవారీగా ఈ ఖాతాలోనే చేరుతాయి.

మంజూరైన టాయిలెట్ల నిర్మాణానికి సంబంధిచిన నిధుల విడుదల క్రమం ఇలా ఉంటుంది. జిల్లా కలెక్టర్ మంజూరు ఉత్తర్వుల అనుగుణంగా మండల పారిశుద్ధ్య అధికారి (ఎం.పి.డి.ఓ) వర్క్ ఆర్డర్‌ను జారీ చేసి మూడు విడతలలో ఈ క్రింది క్రమంలో పంచాయితీ నీరు పారిశుద్ధ్య కమిటీ బ్యాంక్ అకౌంటుకు బదలాయిస్తారు.

**మొదటివిడత (50 శాతం):** టాయిలెట్ నిర్మాణానికి నిర్ధారించిన స్థలాల ఫోటోలని సంబంధింత ఆన్‌లైన్ సిస్టంలో ఒక ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా అప్‌లోడ్ చేసిన తరువాత

**రెండవ విడత (40 శాతం):** సగానికి పై బడిన నిర్మాణ దశలో పనులు ఉన్నట్టు నిర్ధారించే ఫోటోలు అప్‌లోడ్ చేసిన తరువాత

**చివరి విడత (10 శాతం):** టాయిలెట్ నిర్మాణం పూర్తయినట్లు నిర్ధారించే ఫోటోలు అప్‌లోడ్ చేయడంతో పాటు నీరు, పారిశుద్ధ్య కమిటీ వారు యుటిలైజేషన్ సర్టిఫికేటు ఇచ్చిన తరువాత

**పంచాయితీ నీరు, పారిశుద్ధ్య కమిటీ సబ్‌కమిటీలు:** బహిరంగ మల విసర్జన నిర్మూలనకు కీలకమైన టాయిలెట్ల నిర్మాణం, సజావుగా, త్వరితగతిన పారదర్శకతతో జరిగి వాటి వాడకం తక్షణం మొదలయ్యే పరిస్థితిని కల్పించటానికి నీరు, పారిశుద్ధ్య కమిటీ తమలో తాము ఈ క్రింది సబ్ కమిటీలను ఏర్పరచుకోవాలి.

## సబ్ కమిటీ- బాధ్యతలు

**అవగాహన మరియు నిఘా కమిటీ :** టాయిలెట్ల ఆవశ్యకత వాటి వాడకం పై అవగాహన కల్పించి తిరోగమనం జరుగకుండా చూడటం.

**కొనుగోలు కమిటీ :** టాయిలెట్ల నిర్మాణానికి అవసరమైన మేరకు నిర్మాణ సామగ్రి విడిభాగాలు టోకున సరమైన రేట్లకు సేకరించటం ఉత్పత్తి దారులతో లేక వి.ఓలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం సంబంధిత బిల్లుల చెల్లింపు, సామగ్రిని భద్రపరచటం, మేస్త్రీలను నిర్ధారించటం వగైరాలు.

**నిర్మాణ కమిటీ :** టాయిలెట్ల నిర్మాణం అన్ని దశలలో పర్యవేక్షణ జరపడం, నాణ్యతా పరిరక్షణ, జాప్యాల నివారణ.

**రాష్ట్రస్థాయిలో నిర్వహణ:** స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) విధులు నిధుల నిర్వహణను తెలంగాణ రాష్ట్ర స్వచ్ఛభారత్ మిషన్ ప్రాజెక్ట్ డైరెక్టరు చూసుకొని క్రింది స్థాయికి నిధుల విడుదలను పర్యవేక్షిస్తారు. అలాగే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకము క్రింద లభ్యమయ్యే నిధుల నిర్వహణను పి.ఆర్ అండ్ ఆర్.డి కమీషనర్ చూసుకొంటారు.

## తెలంగాణా రాష్ట్రంలో జరుగుతున్న ప్రక్రియ

తెలంగాణా రాష్ట్రంలో ప్రస్తుత కార్యక్రమం మొదలవటానికి ముందు 443 గ్రామ పంచాయితీలు బహిరంగా మల విసర్జన రహితంగా ఉండేవి. కాని గ్రామ జ్యోతి కార్యక్రమం క్రింద 2015-16 సంవత్సరంలో 2210 గ్రామ పంచాయితీలను గుర్తించి వాటిని ఓడిఎఫ్‌గా తీర్చిదిద్దటం లక్ష్యంగా పెట్టుకోవటం జరిగింది. ఈ దిశలో కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతున్నాయి. 181 గ్రామ పంచాయితీలు ఓడిఎఫ్ స్థాయికి చేరుకొన్నాయి.

కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లా అసెంబ్లీ నియోజక వర్గం, మెదక్ జిల్లాలోని సిద్దిపేట నియోజకవర్గాల పరిధిలోగల అన్ని గ్రామ పంచాయితీలు బహిరంగ మల విసర్జనారహిత స్థితికి చేరుకోవడంతో ఈ రెండు నియోజక వర్గాలు ఓడిఎఫ్ గా ప్రకటించబడ్డాయి.

ఇదే పంథాలో ఇనుమడించిన ఉత్సాహంతో మరో నాలుగేళ్ళలో తెలంగాణా రాష్ట్రాన్ని సమిష్టిగా బహిరంగ మల విసర్జనారహితం చేయటానికి మనమందరం పాటుపడదాం.

**- ఏ.నాగేశ్వర రావు,**
*సెంటర్ హెడ్, సి.డబ్ల్యు.ఎస్ అండ్ సి.యమ్.ఇ.డి*
*టిసిపార్డ్*

Printed & Published by: Anita Ramachandran, Commissioner, on behalf of TSIPARD, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. Telangana, Published at TSIPARD, Rajendranagar, Hyderabad-500 030 **Editor : Anita Ramachandran**